జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967, 7989694528

కృష్ణ    సోమవారం 13 జూలై 2026    సంపుటి : 01    సంచిక :180    పేజీలు : 12    వెల : 3/-    PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం, జ్యేష్ఠ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం విశేషం: ప్రదోష వ్రతం, మాస శివరాత్రి, సూర్యోదయం: 5:33 । సూర్యాస్తమయం: 6:32 చంద్రోదయం: 4:01 । చంద్రాస్తమయం: 4:35 తిథి: బహుళ త్రయోదశి రా. 8:57 వరకు, తదుపరి చతుర్దశి నక్షత్రం: రోహిణి ఉ. 7:04 వరకు, తదుపరి మృగశిర తె. 5:24 వరకు, తదుపరి ఆరుద్ర యోగం: వృద్ధి రా. 8:04 వరకు, తదుపరి ధ్రువ కరణం: గరజ ఉ. 10:11 వరకు, తదుపరి వణిజ రా. 8:57 వరకు, తదుపరి భద్ర

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI    http://www.prajajyothinews.com    Mail: prajajyothidaily@gmail.com

## వయనాడ్‌ను రాజకీయ మనుగడ కోసమే వాడుకుంటున్నారు



- విదేశాల్లో కుట్రలు చేస్తున్నారంటూ ఆరోపణ
- కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై బీజేపీ ఫైర్
- వయనాడ్ కొండచరియల ఘటన తర్వాత రాహుల్ అక్కడికి వెళ్లలేదని విమర్శలు
- రాజకీయ లబ్ధి కోసమే వయనాడ్‌ను వాడుకుంటున్నారని ఆరోపణలు

## క్షిపణుల తయారీలో ప్రైవేట్ సంస్థలకు గ్రీన్ సిగ్నల్

- రక్షణ రంగంలో కేంద్రం కీలక సంస్కరణలు
- అస్త్ర మార్క్-2 క్షిపణుల తయారీలో ప్రైవేట్ కంపెనీలకు అవకాశం
- రక్షణ ఉత్పత్తుల డిమాండ్ పెరగడంతో కేంద్రం కొత్త వ్యూహం
- ఎగుమతులు, స్వదేశీ తయారీ సామర్థ్యం పెంపే ప్రధాన లక్ష్యం





### పవన్ రెండో భుజానికి కూడా

## సమస్య ఉందని వైద్యులు చెప్పారు



- ముంబై ఆసుపత్రిలో పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన సీఎం చంద్రబాబు
- భుజానికి మూడున్నర గంటల పాటు ఆపరేషన్ జరిగిందని వెల్లడి
- పవన్‌కు మూడు వారాల పూర్తి విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు
- ప్రజల మధ్యలో ఉన్నప్పుడు ఒత్తిడి కారణంగానే పవన్‌కు గాయమైందని వెల్లడి



## ఇరాన్ ప్రతీకార చర్యలు...

- అమెరికా స్థావరాలపై భీకర దాడులు, హర్మూజ్ మూసివేత
- మరోసారి భగ్గుమన్న పశ్చిమాసియా
- అమెరికా, ఇరాన్ పరస్పర దాడులు
- జోర్డాన్, ఖతార్, ఒమన్‌లోని యూఎస్ సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ దాడులు
- హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ప్రకటన
- తమపై దాడులు పునరావృతమైతే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరిక

### సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో

# స్థానిక ఎన్నికలు

- 'సర్' ముగిసిన వెంటనే నిర్వహిస్తామన్న సీఎం
- సర్ ముగిసిన వెంటనే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఈనెల 15న కూటమి పార్టీల సమన్వయ కమిటీ భేటీ ఉంటుందని వెల్లడి
- టీడీపీ నేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం



**అమరావతి**

ఓటరు జాబితాల సమగ్ర ప్రత్యేక సవరణ ప్రక్రియ పూర్తయిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సెప్టెంబరు నెలాఖరులో లేదా అక్టోబరులో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయన్నారు. కూటమి పార్టీల మధ్య అన్ని స్థాయిల్లో విస్తృత సమన్వయం ఉండాలని స్పష్టంచేశారు. కూటమి పార్టీల రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని ఈ నెల 15న నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ ఇన్‌ఛార్జులు లేని నియోజకవర్గాల్లో త్వరలోనే నియామక ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో సీఎం చంద్రబాబు పార్టీ ముఖ్య నేతలు, జోనల్ కోఆర్డినేటర్‌లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సోషల్ మీడియా వేదికగా గొడ్డలి పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడం, ఓటర్ల జాబితాల సవరణ, పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై నేతలకు సీఎం దిశానిర్దేశం చేశారు. కొందరి ఎమ్మెల్యేల వ్యవహారశైలిపై అసంతృప్తి: రాయలసీమలో ప్రభుత్వం చేస్తున్న - మిగతా3లో

## నకిలీ 'బనారసీ' చీరల ముప్పు

- కోట్ల వ్యాపారం జరుగుతున్నా ఉపాధి కోల్పోతున్న లక్షలాది నేత కార్మికులు!
- నకిలీ బనారస్ చీరలతో తీవ్రంగా దెబ్బతిన్న అసలైన చీరల మార్కెట్
- ఉపాధి కోల్పోయిన 4 లక్షల మంది వరకు నేత కార్మికులు
- ఒరిజినల్ బ్రాండ్‌కు క్యూఆర్ కోడ్ వ్యవస్థ తీసుకురావాలని విజ్ఞప్తి





### మంత్రిగారికే

## షాక్..

- చిల్లర లేదని బస్సు దింపేసిన కండక్టర్!
- మారువేషంలో బీఎంటీసీ బస్సు ఎక్కిన కర్ణాటక రవాణా మంత్రి
- టికెట్ కోసం చిల్లర ఇవ్వలేదని బస్సు దిగిపొమ్మన్న కండక్టర్
- మాస్క్ ధరించడంతో మంత్రిని గుర్తుపట్టని బస్సు సిబ్బంది

# ఫ్లైఓవర్ల కింద విద్యుత్ ఉప కేంద్రాలు

- హైదరాబాద్‌లో నిర్మించేందుకు సన్నాహాలు
- పలు ప్రాంతాల్లో ఫ్లైఓవర్ల కింద సబ్‌స్టేషన్ల ఏర్పాటు
- తొలుత మూడు ప్రాంతాల్లో నిర్మాణం
- స్థల కొరత ఉన్న ప్రదేశాల ఎంపిక
- ప్రజా భద్రత కోసం చర్యలు తీసుకుంటామన్న అధికారులు
- హైదరాబాద్‌లో ఫ్లైఓవర్ల కింద విద్యుత్ ఉప కేంద్రాలు



**హైదరాబాద్**

వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో భూములకు ఏ మేరకు ధరలు పలుకుతున్నాయో ఇటీవల సర్కారు వేలం ద్వారా స్పష్టమవుతోంది. రూ.వందల కోట్ల విలువైన స్థలాలను ప్రైవేట్ భూయజమానులు మల్టీ పర్పస్ కోసం వినియోగించే పద్ధతులనే ప్రభుత్వం కూడా పాటించాలని యోచిస్తోంది. దీని కోసం నగర వ్యాప్తంగా నిర్మించిన భారీ ఫ్లైఓవర్ల కింది ప్రదేశాలను ఎంచుకుంది. పలు ప్రాంతాల్లో వీటి కింద విద్యుత్ ఉప కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటివరకు నగరంలోని ఫ్లైఓవర్ల కింద పూల మొక్కలు పెంచడం, చిన్నారులకు ఆటస్థలాలు, వాహనాల పార్కింగ్ చేయడం కోసం కేటాయించడం చూశాం. ఇకపై ఆ స్థలాల్లో 33/11 విద్యుత్ ఉపకేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. నగరం అంతటా వివిధ ఫ్లైఓవర్ల కింద పది వరకు సబ్‌స్టేషన్లను నిర్మించేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) ప్రణాళికలు రూపొందించింది. మొదట మూడు ప్రాంతాల్లో నిర్మాణం ప్రారంభం కానుంది. ఇందుకోసం ఫ్లైఓవర్ల కింద అనువైన స్థలాలను ఇప్పటికే అధికారులు గుర్తించారు. కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలోకి వచ్చే పది - మిగతా3లో



# వచ్చేస్తోంది బుల్లెట్ ట్రైన్

- హైదరాబాద్‌కు 3 కొత్త కారిడార్లు..
- తొలి సర్వీస్ ఎక్కడి నుంచి ఎక్కడికంటే?
- ౹2027 ఆగస్టు 15 నుంచి దేశంలో తొలి బుల్లెట్ ట్రైన్
- సూరత్-బిలిమోరా మార్గంలో మొదటి సర్వీస్ ప్రారంభం
- హైదరాబాద్ కేంద్రంగా మూడు కొత్త బుల్లెట్ ట్రైన్ కారిడార్లు
- ముంబై-అహ్మదాబాద్ ప్రాజెక్టు పనులు 80 శాతం పూర్తి
- తెలంగాణలో పలు రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ

# వయనాడ్‌ను రాజకీయ మనుగడ కోసమే వాడుకుంటున్నారు

కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించింది. కేరళలోని వయనాడ్‌లో ఇటీవల జరిగిన కొండ చరియలు విరిగిపడిన ఘటనలో బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు ఇద్దరూ వెళ్లలేదని ఆరోపించింది. జులై 7న కేరళలోని వయనాడ్ జిల్లాలో అనక్కంపోయిల్- మెప్పాడి ట్విన్ ట్యూబ్ టన్నెల్ ప్రాజెక్ట్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడటంతో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై స్పందించిన బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి తుహిన్ సిన్హా- ప్రస్తుతం వయనాడ్ లోక్‌సభ ఎంపీగా ఉన్న ప్రియాంక గాంధీ వాద్రా, గతంలో అదే నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన రాహుల్ గాంధీ ఇద్దరూ బాధిత కుటుంబాల్ని పరామర్శించేందుకు వెళ్లలేదని విమర్శించారు. 'సోషల్ మీడియాలో ఒక సంతాప సందేశం పోస్ట్ చేయడం తప్ప బాధితుల వద్దకు వెళ్లి వారిని ఓదార్చే ప్రయత్నం కూడా చేయలేదు. మీరు రాజకీయ పర్యటకులు మాత్రమే. ప్రజలకు అవసరమైన సమయంలో కనిపించరు. అందుకే మీరు పార్ట్ టైమ్ రాజకీయ నాయకులు. ఇది నిజంగా సిగ్గుచేటు' అని తుహిన్ సిన్హా వ్యాఖ్యానించారు. వయవాడ్‌ను గాంధీ కుటుంబం కేవలం తమ రాజకీయ మనుగడ కోసం, రాజకీయ అవసరాల కోసం మాత్రమే ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. 2024 జులైలో వయనాడ్‌లో జరిగిన భారీ కొండ చరియల విపత్తులో వందలాది మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనను కూడా ఆయన ప్రస్తావించారు. అప్పట్లో కూడా రాహుల్ గాంధీ ఆలస్యంగా అక్కడికి వెళ్లారని, ఇప్పుడు మరోసారి ప్రజలు కష్టాల్లో ఉన్న



సమయంలో నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని విమర్శించారు.

**వయనాడ్‌లో రాహుల్ గాంధీ అసలేం చేశారు?**

రాహుల్ 2019లో వయనాడ్ నుంచి ఎంపీగా ఎన్నికై, తర్వాత రాయ్‌బరేలీ నుంచి గెలిచిన వెంటనే వయనాడ్‌ను వదిలేశారని అన్నారు సిన్హా. అమేథీ కూడా దశాబ్దాల పాటు అభివృద్ధికి నోచుకోలేదని, అందుకే రాహుల్ చివరకు ఆ నియోజకవర్గాన్ని కూడా వదిలి వెళ్లాల్సి వచ్చిందని విమర్శించారు. ఇప్పుడు ప్రియాంక గాంధీ కూడా భవిష్యత్తులో దిల్లీకి దగ్గరగా మరో సురక్షితమైన నియోజకవర్గం దొరికితే వయనాడ్‌ను వదిలేస్తారని ఆరోపించారు. పర్యావరణం పరంగా అత్యంత సున్నితమైన ప్రాంతమైన వయనాడ్‌లో కొండ చరియల ప్రమాదాల్ని తగ్గించేందుకు రాహుల్ గాంధీ ఎంపీగా ఉన్న సమయంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని బీజేపీ ప్రశ్నించింది. 2019 నుంచి 2024 వరకు ఎంపీగా ఉన్నా పర్యావరణ పరిరక్షణ, విపత్తు నివారణ చర్యల విషయంలో గాంధీ కుటుంబం విఫలమైందని విమర్శించింది.

**'మోదీ ప్రతిష్ఠ పెంచుతుంటే రాహుల్ కుట్రలు చేస్తున్నారు'**

మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల చేపట్టిన విదేశీ పర్యటనలతో భారత్‌కు దౌత్య పరంగా గొప్ప విజయాల్ని తీసుకొచ్చారని బీజేపీ ప్రశంసించింది. ఇదే సమయంలో విదేశాల్లో ఉన్న రాహుల్ గాంధీపై విమర్శలు చేసింది. బీజేపీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా మాట్లాడుతూ- ప్రధాని మోదీ విదేశీ పర్యటనల ద్వారా భారత ప్రతిష్ఠను మరింత పెంచారని అన్నారు. ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో స్వయంగా మోదీ విధానాల్ని అనుసరిస్తున్నానని చెప్పడం, న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ భారతదేశంలో మోదీ నాయకత్వంలో వచ్చిన మార్పుల్ని ప్రశంసించడం వంటి అంశాల్ని సంబిత్ పాత్రా ప్రస్తావించారు. అంతర్జాతీయ వేదికపై భారత్‌కు గౌరవం మరింత పెరిగిందని, పలు దేశాలతో సంబంధాలు బలోపేతం అయ్యాయని అన్నారు. 'ప్రధాని మోదీ దేశానికి విజయాల్ని తీసుకొచ్చారు. ఇదే సమయంలో విదేశాల్లో ఉన్న రాహుల్ గాంధీ మూసివేసిన గదుల్లో దేశానికి వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారేమో?' అంటూ సంబిత్ పాత్రా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జులై 10న ప్రయాగ్ రాజ్‌లో జరగాల్సిన రాహుల్ గాంధీ కార్యక్రమం వాయిదా పడిందని, పట్నాలోని మరో కార్యక్రమం కూడా రద్దైందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన లండన్, ఐస్‌లాండ్, జర్మనీ వంటి దేశాల్లో పర్యటిస్తున్నారని అన్నారు. ప్రధాని మోదీ విదేశీ పర్యటనల ఫలితాల్ని చూసి దేశ ప్రజలు గర్విస్తున్నారని, ప్రతిపక్షాలు కూడా వాటిని గుర్తించాలని సంబిత్ పాత్రా సూచించారు.

# క్షిపణుల తయారీలో ప్రైవేట్ సంస్థలకు గ్రీన్ సిగ్నల్

దేశ రక్షణ రంగంలో మరో కీలక సంస్కరణకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు సమాచారం. ఇప్పటివరకు ప్రభుత్వ రంగ సంస్థలకే పరిమితమైన క్షిపణుల తయారీలో ఇకపై ప్రైవేట్ సంస్థలకు కూడా అవకాశం కల్పించేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా భారత రక్షణ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్, దేశ సాయుధ బలగాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ చర్యతో స్వదేశీ రక్షణ తయారీ సామర్థ్యం పెరగడంతో పాటు రక్షణ ఎగుమతులు కూడా మరింత వేగం పుంజుకునే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రక్షణ రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని క్రమంగా పెంచుతోంది. యుద్ధ విమానాలు, డ్రోన్లు, నౌకాదళానికి అవసరమైన పరికరాల తయారీలో ప్రైవేట్ సంస్థలకు అవకాశాలు కల్పించింది. ఇప్పుడు అత్యంత వ్యూహాత్మకంగా భావించే క్షిపణుల తయారీలోనూ ప్రైవేట్ రంగాన్ని భాగస్వామ్యం చేయాలని కేంద్రం యోచిస్తోంది. దీంతో ప్రభుత్వ రంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్)పై ఉన్న ఉత్పత్తి భారం తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం భారత సాయుధ బలగాలతో పాటు మిత్రదేశాల నుంచి కూడా స్వదేశీ రక్షణ ఉత్పత్తులకు భారీ స్థాయిలో డిమాండ్ పెరుగుతోంది. అయితే ఆ అవసరాలన్నింటినీ ఒక్క బీడీఎల్ మాత్రమే తీర్చడం కష్టంగా మారుతోంది. ఈ నేపథ్యంలో ప్రైవేట్ కంపెనీలను కూడా తయారీ ప్రక్రియలో భాగం చేయాలని కేంద్రం ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం. మొదటి దశలో గగనతలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించే అస్త్ర మార్క్-2 క్షిపణుల తయారీకి ప్రైవేట్ సంస్థలను ఆహ్వానించనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియలో ఐకామ్, అదానీ గ్రూప్, భారత్ ఫోర్జ్, టాటా గ్రూప్, మహీంద్రా గ్రూప్ వంటి ప్రముఖ సంస్థలు పాల్గొనే అవకాశం ఉందని సమాచారం.

అస్త్ర మార్క్-2 క్షిపణిని డీఆర్‌డీవో అభివృద్ధి చేసింది. ఇది దృశ్య పరిధికి అవతల ఉన్న లక్ష్యాలను కూడా సమర్థంగా ఛేదించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. చైనా అభివృద్ధి చేసి పాకిస్థాన్‌కు అందించిన ప్లా-15జు దీర్ఘశ్రేణి క్షిపణికి దీటుగా ఈ క్షిపణిని రూపొందించారు. భారత వైమానిక దళంలోని తేజస్ మార్క్-1ఏ, మిగ్-29, సుఖోయ్-30 ఎంకేఐ, రఫేల్ యుద్ధ విమానాలకు ఈ క్షిపణిని అనుసంధానించనున్నారు. భారత్ అభివృద్ధి చేసిన అస్త్ర క్షిపణిపై విదేశీ దేశాలు కూడా



ఆసక్తి చూపుతున్నాయి. ఇండోనేసియా ఇప్పటికే ఈ క్షిపణిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో భవిష్యత్తులో రక్షణ ఎగుమతులు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అస్త్ర మార్క్-2తో ప్రారంభమయ్యే ఈ ప్రైవేట్ భాగస్వామ్యాన్ని తర్వాత మరింత విస్తరించాలని కేంద్రం యోచిస్తోంది. రెండో దశలో ప్రళయ్ వంటి శక్తిమంతమైన బాలిస్టిక్ క్షిపణుల తయారీలో కూడా ప్రైవేట్ రంగానికి అవకాశం కల్పించే దిశగా ఆలోచనలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన ప్రళయ్ క్షిపణి అత్యాధునిక సాంకేతికతతో రూపొందింది. డబుల్ ఇంజిన్ వ్యవస్థతో పనిచేసే ఈ క్షిపణి ధ్వని వేగానికి ఆరు రెట్లు అధిక వేగంతో ప్రయాణించి సుమారు 500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను కచ్చితత్వంతో ధ్వంసం చేయగలదు. భవిష్యత్తులో భారత సైన్యానికి ఇది కీలక ఆయుధంగా మారనుంది.

ప్రస్తుతం దేశ రక్షణ వ్యవస్థలో దీర్ఘశ్రేణి భూతల లక్ష్యాలను ఛేదించే క్రూయిజ్ క్షిపణులు, నెక్స్ట్ జనరేషన్ బ్రహ్మోస్, 300 కిలోమీటర్ల పరిధి కలిగిన దీర్ఘశ్రేణి గైడెడ్ రాకెట్ పినాక వంటి అత్యాధునిక ఆయుధ వ్యవస్థలను కూడా భారత్ అభివృద్ధి చేస్తోంది. వీటితో పాటు ప్రళయ్ క్షిపణి కూడా భారత రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయనుంది. ఇటీవలి కాలంలో జరిగిన సైనిక పరిణామాలు కూడా క్షిపణుల ప్రాధాన్యతను మరింత స్పష్టంగా చూపించాయి. ఆపరేషన్ సిందూర్‌తో పాటు ఇరాన్-అమెరికా మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల్లో క్షిపణులు, డ్రోన్లు మౌలిక సదుపాయాలపై ఎంతటి ప్రభావం చూపగలవో ప్రపంచం గమనించింది. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని భారత ప్రభుత్వం రక్షణతో పాటు దాడి చేసే సామర్థ్యాన్ని కూడా వేగంగా పెంచే చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో రష్యా నుంచి భారత్ కొనుగోలు చేసిన ఐదు ఎ-400 గగనతల రక్షణ వ్యవస్థల్లో ఐదో వ్యవస్థ ఈ ఏడాది నవంబర్‌లో భారత్‌కు చేరుకోనున్నట్లు తెలుస్తోంది. అలాగే దేశ భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు మరో ఐదు ఎస్-400 వ్యవస్థల కొనుగోలుకు కూడా కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థలను ఆత్మాహుతి డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణుల దాడుల నుంచి రక్షించేందుకు రష్యాకు చెందిన పాంట్‌సిర్ గగనతల రక్షణ వ్యవస్థను కూడా వినియోగించాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

# నకిలీ 'బనారసీ' చీరల ముప్పు

ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన వారణాసిలోని బనారసీ పట్టు చీరల పరిశ్రమ ప్రస్తుతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దేశ విదేశాల నుంచి లక్షలాది మంది బనారసీ చీరల్ని కొనుగోలు చేస్తున్నప్పటికీ వాటిని నేసే నేత కార్మికుల జీవితాలు మాత్రం దయనీయంగా మారాయి. కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతున్నా క్షేత్రస్థాయిలో నేతన్నల బతుకులు మాత్రం ఛిద్రమవుతున్నాయి. ఈ రంగంలో నకిలీ బనారసీ చీరల మార్కెట్ విస్తరించడంతో అసలైన బనారస్ చీరలకు డిమాండ్ తగ్గి వేలాది, లక్షలాది కుటుంబాలు జీవనోపాధిని కోల్పోతున్నాయి. వారణాసి టెక్స్‌టైల్ పరిశ్రమలోని చీకటి కోణాన్ని, నేతన్నల కన్నీటి గాథలు ఈటీవీ భారత్ తీసుకొచ్చింది. వారణాసిలోని సరయ్యా, జలాలిపురా, లోహ్తా, కాటన్ మిల్ వంటి ప్రాంతాలు ఒకప్పుడు బనారసీ చీరల తయారీకి ప్రధాన కేంద్రాలుగా ఉండేవి. వేల సంఖ్యలో పవర్‌లూమ్ యంత్రాలు నిరంతరం పనిచేస్తూ ఉండేవి. అయితే ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పరిశ్రమకు చెందిన వర్గాల అంచనా ప్రకారం సుమారు 50 వేల నుంచి 60 వేల వరకు పవర్‌లూమ్ యంత్రాలు పనిచేయకుండా నిలిచిపోయాయి. దీంతో 4 లక్షల మందికిపైగా నేత కార్మికులు తమ సంప్రదాయ వృత్తిని వదిలి ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లడం లేదా ఇతర చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.



**నకిలీ బనారసీ చీరలే అసలు సమస్య**

ఈటీవీ భారత్ దీనికి సమాధానాలు తెలుసుకునే ప్రయత్నంలో అసలు కారణం బయటపడింది. అదే బనారసీ చీరల ఫేక్ మార్కెట్. అవును నేత కార్మికులు, వ్యాపార సంఘాల ప్రతినిధుల అభిప్రాయం ప్రకారం పరిశ్రమ సంక్షోభానికి ప్రధాన కారణం నకిలీ బనారసీ చీరల విక్రయమే. సూరత్ సహా ఇతర రాష్ట్రాల్లో తయారయ్యే నకిలీ చీరలను బనారసీ చీరలుగా చలామణీ చేస్తున్నారు. రూపంలో ఈ నకిలీ చీరలు అసలైన వాటిని పోలి ఉండటంతో వినియోగదారులు తేడా గుర్తించలేక మోసపోతున్నారు. ఇలా మార్కెట్లో నకిలీల హవా పెరగడంతో కష్టపడి నేసిన అసలైన బనారసీ చీరలకు సరైన ధర దక్కడం లేదు. పెరిగిన ఖర్చులు- తగ్గిన ఆదాయం

నకిలీ చీరల ముప్పుతో పాటు విద్యుత్ ఛార్జీలు, ముడి సరుకుల ధరలు పెరగడం కూడా నేత కార్మికుల్ని కోలుకోకుండా దెబ్బతీస్తోంది. ఒకప్పుడు చీరలు నేస్తూ కుటుంబాల్ని పోషించిన అనేక మంది ఇప్పుడు పొట్టకూటి కోసం ఇతర వృత్తుల వైపు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. చీరలు నేయడం మానేసి ప్రస్తుతం కిరాణా దుకాణం నడుపుకుంటున్న షంషేర్ మాట్లాడుతూ- '16 నెలల కిందటి వరకు చీరలు నేసేవాడిని. కానీ పని పూర్తిగా తగ్గిపోయింది. రోజుకు రూ. 200 తో కుటుంబాన్ని పోషించడం అసాధ్యంగా మారింది. పిల్లల్ని మంచి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చదివించేవాళ్లం. ఇప్పుడు పరిస్థితి బాలేక మదర్సాలో చదివించాల్సి వస్తోంది. అందుకే ఈ వృత్తిని వదిలేయాల్సి వచ్చింది.' అని ఆవేదన వ్యక్తం చేశారు.

**80 శాతం వ్యాపారంపై ప్రభావం**

నకిలీ చీరల కారణంగా సంప్రదాయ బనారసీ చీరల ప్రతిష్ఠ దెబ్బతింటోందన్నారు బనారసీ చీరల వ్యాపారి రాకేష్. వారణాసికి వచ్చే పర్యటకులు షాపుల్లో కనిపించే ప్రతి చీరను అసలైన బనారసీ చీరగానే భావించి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. దీంతో వినియోగదారులు మోసపోతుండగా, ఒరిజినల్ చీరల వ్యాపారం దాదాపు 80 శాతం వరకు ప్రభావితమైందన్నారు.

## అక్టోబర్ 27న ఇజ్రాయేల్‌లో ఎన్నికలు.. నెతన్యాహు ప్రభుత్వానికి ఆఖరి రోజు అదే..!




పశ్చిమాసియాలో యుద్ధం, అస్థిర పరిస్థితులు కొనసాగుతుండగానే ఇజ్రాయేల్‌లో సార్వత్రిక ఎన్నికలకు తెరలేవనుంది. ఈ ఏడాది అక్టోబర్ 27న ఆ దేశంలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని లీకుడ్ ప్రభుత్వం నాలుగేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్నందున ఎలక్షన్లకు సమయం వచ్చిందని ఆదివారం ఇజ్రాయేల్ మీడియా తెలిపింది. నెతన్యాహు ప్రభుత్వం జూలై 17 వరకే కొనసాగనుంది. ఇజ్రాయేల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వం మరో నాలుగు రోజులే ఉండనుంది. దాంతో, అధికార లీకుడ్ పార్టీ సీనియర్ నాయకుడు అఫిర్ కట్జ్ టైమ్స్ ఇజ్రాయేల్ వార్త సంస్థతో మాట్లాడుతూ.. అక్టోబర్ 27న ఎన్నికలు ఉంటాయని వెల్లడించాయి. 1988 తర్వాత షెడ్యూల్ ప్రకారం నాలుగేళ్లకు జరగనున్న మొట్టమొదటి ఎన్నికలు ఇవే. అంతేకాదు గత 50 ఏళ్లలో పూర్తికాలం అధికారంలో కొనసాగిన ప్రభుత్వంగా బెంజమిన్ నెతన్యాహు సర్కార్ గుర్తింపు సాధించనుంది.

**జూలై 17 నుంచే**

జూలై 17 నుంచే ఎన్నికల ప్రక్రియ మొదలవ్వనుంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితా సెప్టెంబర్ 7 కల్లా సిద్ధం కానుందని ఇజ్రాయేల్ మీడియా పేర్కొంది. 120 ఎంపీ స్థానాలకు 61 సీట్లు గెలుపొందిన పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. అయితే.. నెతన్యాహు నేతృత్వంలోని లీకుడ్ పార్టీకి, గడి ఐసెన్‌కోట్ సారథ్యంలోని యషార్ పార్టీకి ఎన్నికల్లో తలా 23 సీట్లు వస్తాయని ఓ మీడియా సంస్థ అంచనా వేసింది. మరో సంస్థ మాత్రం ఐసెన్‌కోట్ పార్టీకి సంపూర్ణ ఆధిపత్యం లభిస్తుందని తెలిపింది.

## ఇరాన్ ప్రతీకార చర్యలు



మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. తమ దేశ దక్షిణ ప్రాంతాలపై అమెరికా సైన్యం దాడులకు పాల్పడిందని ఆరోపిస్తూ ఇరాన్ తీవ్రంగా స్పందించింది. దీనికి ప్రతీకారంగా జోర్డాన్, ఖతార్, ఒమన్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఆదివారం దాడులు చేసినట్టు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) ప్రకటించింది. అంతటితో ఆగకుండా హర్మూజ్ జలసంధిని తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు మూసివేస్తున్నట్లు స్పష్టం చేసింది. తమ అధికారిక మీడియా సంస్థ సెపాహ్ న్యూస్ ద్వారా ఐఆర్జీసీ ఈ వివరాలు వెల్లడించింది. తమ దక్షిణ తీరప్రాంతాల్లోని పలు సైనిక స్థావరాలు, కమ్యూనికేషన్ టవర్లపై యూఎస్ వైమానిక దాడులు చేసిందని పేర్కొంది. దీనికి ప్రతీకారంగా మూడు దశల్లో దాడులు చేశామని తెలిపింది. మొదటి దశలో జోర్డాన్‌లోని ప్రిన్స్ హసన్ ఎయిర్‌బేస్‌ను లక్ష్యంగా చేసుకుని, అక్కడి కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను, ఎంక్యూ-9 రీపర్ డ్రోన్ల హ్యాంగర్‌ను ధ్వంసం చేశామని వివరించింది. రెండో దశలో ఖతార్‌లోని అల్ ఉదెయిద్ ఎయిర్‌బేస్‌పై దాడి చేసి, కమాండ్ సెంటర్‌తో పాటు ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ నిర్వహణ కేంద్రాలను ధ్వంసం చేశామని పేర్కొంది. మూడో దశలో ఒమన్‌లోని దుక్మ్ పోర్టులో ఉన్న అమెరికా లాజిస్టికల్ కేంద్రాలపై భారీ దాడి చేశామని తెలిపింది. ఇరాన్ సైన్యం కూడా కువైట్, బహ్రెయిన్‌లలోని అమెరికా స్థావరాలపై కమికాజే డ్రోన్లతో దాడులు చేసిందని, రాడార్ సైట్లు, ఆయుధ డిపోలను ధ్వంసం చేసిందని వెల్లడించింది. అమెరికా మళ్లీ దాడులకు పాల్పడితే మరింత తీవ్రమైన ప్రతిచర్యలు ఉంటాయని ఐఆర్జీసీ హెచ్చరించింది. అమెరికా జోక్యం ఆగే వరకు హర్మూజ్ జలసంధి మీదుగా ఏ నౌకనూ అనుమతించబోమని స్పష్టం చేసింది.

## మంత్రిగారికే షాక్..



సాధారణ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు మారువేషంలో బయలుదేరిన కర్ణాటక రవాణా శాఖ మంత్రి భైరతి సురేశ్‌కు చేదు అనుభవం ఎదురైంది. టికెట్ కోసం చిల్లర లేకపోవడంతో ఓ బీఎంటీసీ బస్సు కండక్టర్ ఆయన్ను బస్సు దిగిపొమ్మన్నారు. ఈ సంఘటన బెంగళూరు నగరంలో చోటుచేసుకుంది.

**అసలేం జరిగిందంటే..!**

మంత్రి భైరతి సురేశ్ నగరంలో ప్రజా రవాణా వ్యవస్థను పరిశీలించేందుకు ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా ఆయన మాస్క్ ధరించి, సాధారణ ప్రయాణికుడిలా హెబ్బాల్ నుంచి నాగశెట్టిహళ్లి వెళ్లేందుకు బీఎంటీసీ బస్సు ఎక్కారు. రెండు టికెట్లు కొని, కండక్టర్‌కు రూ. 100 నోటు ఇచ్చారు. అయితే, కండక్టర్ చిల్లర ఇవ్వాలని అడగ్గా, తన వద్ద లేదని మంత్రి బదులిచ్చారు. దీంతో తన వద్ద కూడా చిల్లర లేదని, సరిగ్గా డబ్బులు చెల్లించలేకపోతే బస్సు దిగిపోవాలని కండక్టర్ స్పష్టం చేశారు. మంత్రి మాస్క్ ధరించి ఉండటంతో కండక్టర్ ఆయన్ను గుర్తుపట్టలేకపోయారు. దీనిపై మంత్రి ఏమీ మాట్లాడకుండా మౌనంగా బస్సు దిగిపోయారు. అనంతరం నాగశెట్టిహళ్లి నుంచి కొద్ది దూరం ప్రయాణించేందుకు మంత్రి ఓ ఆటో ఎక్కారు. మీటర్‌లో ఛార్జీ రూ. 30 చూపించగా, డ్రైవర్ రూ. 36 డిమాండ్ చేశాడు. ఎందుకని ప్రశ్నించగా.. మీటర్‌ను త్వరలో సరిచేయిస్తానని సమాధానమిచ్చాడు. చివరికి మంత్రి అతనికి రూ. 40 ఇచ్చి ఆటో దిగారు. ఈ తనిఖీ ద్వారా ప్రజా రవాణాలో సామాన్యులు పడుతున్న ఇబ్బందులను మంత్రి స్వయంగా తెలుసుకున్నారు.

# పచ్చని పొలాల గుండా ప్రాజెక్టు గుబులు పుట్టిస్తున్న బుల్లెట్ రైలు

**బుల్లెట్‌రైలు మార్గానికి మార్కింగ్ వేస్తున్న ప్రభుత్వ యంత్రాంగం**

**పంట పొలాల మధ్య నుంచే ముంబయికి మార్గం**

**శంషాబాద్ మండలం కేబీదొడ్డి గ్రామం పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం**



సాధారణంగా హైదరాబాద్? నుంచి బెంగళురుకు రోడ్డు మార్గంలో ప్రయాణిస్తే 9 నుంచి 11 గంటల్లో చేరుకో గలుగుతాం. రైలు మార్గంలో ప్రయాణించాలంటే సుమారు 10 గంటల సమయం పడుతుంది. అదే బుల్లెట్? రైళ్లు అందుబాటులోకి వస్తే కేవలం రెండు గంటల్లోనే ఆ గమ్యాన్ని చేరుకో గలుగుతాం. అయితే బుల్లెట్? రైల్? కారిడార్ల నిర్మాణానికి అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. హైదరాబాద్ నగర శివారుల్లోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దేశ ఆర్థిక రాజధాని ముంబయికి బుల్లెట్? రైలు మార్గాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పనులకు యంత్రాంగం సిద్ధమవుతోంది. దీనిలో భాగంగానే సంబంధిత అధికారులు ప్రాజెక్టుకు సంబంధించి మార్కింగ్ చేస్తోన్నారు. ప్రస్తుతం హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్ నిర్మాణం జరిగే మార్గమంతా వ్యవసాయ పొలాల మధ్యలో నుంచే వెళ్తోంది. దీంతో అన్నదాతల్లో భయాందోళనలు నెలకొన్నాయి.

**600 ఎకరాల భూమి కేటాయింపు**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా ప్రవేశపెడుతున్న ఏడు బుల్లెట్ రైల్? కారిడార్లలో తెలంగాణలో మూడు రూట్లు ఏర్పాటవుతున్నాయి. ఇదే విషయాన్ని సంబంధిత రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్ కూడా చెప్పారు. శంషాబాద్?లోని రాజీవ్?గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గరిలోని బహదుర్?గూడ ప్రాంతంలో బుల్లెట్? రైల్? ప్రాజెక్టు కోసం ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం 600 ఎకరాల భూమిని కేటాయించింది. ఇక్కడి నుంచి మూడు బుల్లెట్? ట్రైన్? కారిడార్లను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

**పంట పొలాల మధ్య నుంచే మార్కింగ్**

ఇందులో భాగంగానే హైదరాబాద్-అమరావతి-చెన్నై, శంషాబాద్-ముంబయి, హైదరాబాద్-బెంగళూరు కారిడార్లు ఏర్పాటు కానున్నాయి. ఇందులో ముంబయి మార్గానికి సంబంధించి బహదూర్‌గూడ వద్ద మొదలై మొయినాబాద్, చేవెళ్ల, వికారాబాద్ మీదుగా ఈ కారిడార్‌ను నిర్మించనున్నారు. పదిరోజులుగా దీనికి సంబంధించి రైల్వే యంత్రాంగం ప్రాజెక్టు చేపట్టే ప్రాంతాలపై మార్కింగ్‌లు వేస్తున్నారు. శంషాబాద్ మండలంలోని సుల్తాన్‌పల్లి, చౌదరిగూడ, కేబీదొడ్డి గ్రామాలతో పాటు మొయినాబాద్ మండలంలోని సురంగల్, అమ్డాపూర్, కేతిరెడ్డిపల్లి కూడళ్లల్లో మార్కింగ్‌లు వేశారు. రైలు అత్యంత వేగంతో ప్రయాణించనున్న నేపథ్యంలో మార్గంలో వంకరలు లేకుండా చూస్తున్నారు. దీనిలో భాగంగా ఎలాంటి వంకరలు లేకుండా ప్రతి 5 కి.మీ. ఒక చోట మార్కింగ్ వేస్తున్నారు. ఈ మార్కింగ్‌లు పచ్చటి పంట పొలాల మధ్య నుంచే వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నాలుగు వరుసల్లో నిర్మాణాలు**

ప్రస్తుతం మార్కింగ్ చేస్తున్న బుల్లెట్ రైలు మార్గాన్ని నాలుగు వరుసల్లో నిర్మించనున్నట్టు తెలుస్తోంది. దీనికోసం దాదాపు 300 అడుగుల వెడల్పుతో భూసేకరణ చేసే అవకాశం ఉన్నట్టు కనిపిస్తోంది. అయితే ఈ నిర్మాణం చేపట్టే మార్గాల్లో చిన్న, సన్నకారు రైతుల భూములే అధికంగా ఉండటం గమనార్హం. ఒకవేళ ఇదే కార్యరూపం దాలిస్తే అన్నదాతలు భూములు కోల్పోయే ప్రమాదముంది. అయితే రైతులకు ఏమేర పరిహారం అందుతుంది అనే విషయంపై ఇంకా స్పష్టత లేదు. రెవెన్యూ అధికారులకు సైతం ఈ విషయంలో స్పష్టత లేదు. బుల్లెట్ ట్రైన్ మార్గానికి ఇరువైపులా సర్వీసు రోడ్లు సైతం అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉంది. శంషాబాద్ మండలం కేబీదొడ్డి గ్రామం పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంది.

**తెలంగాణకు గేట్‌వేగా**

ఇంతవరకు శంషాబాద్ అంటే కేవలం ఓ అంతర్జాతీయ విమానాశ్రయం మాత్రమే. అయితే ఈ ప్రాంతం తెలంగాణ రవాణా వ్యవస్థకు కేంద్ర బిందువుగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. విమానం, హైస్పీడ్ రైలు, మెట్రో, అంతర్జాతీయ స్థాయి బస్? టెర్మినల్? ఇలా అన్నిరకాలు రవాణాసౌకర్యాలు ఒకే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. రోడ్డు, మెట్రో, హైస్పీడ్? రైలు, విమానం వంటి రవాణా సౌకర్యాలు ఒకే చోట ఉండటం దేశంలో మరెక్కడా లేదు. ఇది పూర్తయితే ఈ ప్రాంతం భవిష్యత్? నగరాలకు ప్రణాళికలకు జాతీయ మోడల్?గా మారుతుంది. అయితే వాటి నిర్మాణ ప్రాంతాల్లోని రైతులు మాత్రం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# భూగర్భ జలాలు అట్టడుగుకు హైదరాబాద్ ప్రజలకు ట్యాంకర్లే దిక్కు!




ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్రంగా నీటి కరవు పీడిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని సాగు, తాగు నీటికే కాకుండా నగరాలు, పట్టణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి ప్రజలను కంటతడి పెట్టిస్తోంది. ఇటీవల హైదరాబాద్? మహానగరంలోని కూకట్‌పల్లికి చెందిన రమేష్, నాలుగేళ్ల కిందట తన ఇంటి నిర్మాణ సమయంలో ఒక బోర్‌వెల్ వేయించారు. 1,000 అడుగుల లోతులో వేయగా, మొదట్లో సమృద్ధిగా నీరు లభించింది. అయితే, ఈ ఏడాది ఏప్రిల్ నాటికి అది ఎండిపోయింది. దాంతో, సమీపంలోనే ఆయన మరో బోర్‌వెల్‌ను 1,200 అడుగుల లోతు వరకు వేయించడానికి దాదాపు రూ.6 లక్షలు ఖర్చు చేశారు.

అల్విన్ కాలనీకి చెందిన ఒక రిటైర్డ్ ఉద్యోగి ఇంటి నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో రెండు వేర్వేరు చోట్ల 1,000 అడుగుల లోతు వరకు బోర్లు వేసినా నీరు పడలేదు. దాదాపు రూ.10 లక్షలు నేల పాలయ్యాయి. ఇప్పుడు ఆయన మరో ప్రదేశంలో మరింత లోతుగా బోరు వేయడానికి ప్రయత్నిస్తున్నారు.

**పెరుగుతున్న నీటి బిల్లుల భారం**

మహానగరంలో వేసవిలో తరచూ నీటి ఎద్దడి ఎదురవడం సహజమే. కానీ, ఈ సంవత్సరం కష్టాలు మరింత తీవ్రమయ్యాయి. ఎల్ నినో ప్రభావం కావచ్చు లేదా వర్షపాతం లోపం కావచ్చు. నగరం మాత్రం ప్రస్తుతం తీవ్ర నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. నగరవాసులు ఇప్పుడు పూర్తిగా వాటర్ బోర్డు సరఫరా చేసే నీరు, ప్రైవేట్ ట్యాంకర్లపైనే ఆధారపడుతున్నారు. దీనివల్ల నీటి బిల్లులు భారీగా పెరిగాయి. వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోయాయి.

**జల మండలి నుంచే 18 వేల ట్యాంకర్లు**

మహానగరంలో 60 శాతం బోరు బావులు వట్టిపోయాయి. మహానగర పరిధిలోకి వచ్చే రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాలు మినహాయించి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాల్లో భూగర్భ జలాలు దారుణ స్థితికి చేరుకున్నాయి. జులై మాసం మధ్యకి చేరుకున్నా కూడా జల మండలి నుంచి రోజుకు 18 వేల నీటి ట్యాంకర్లు బుక్ అవుతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఇక ప్రైవేట్ ఈ సంఖ్యకు రెట్టింపు ట్యాంకర్లు సరఫరా చేస్తుండొచ్చని అంచనా.

**అడ్డగోలుగా బోర్‌వెల్స్ తవ్వకం!**

కోర్ అర్బన్? రీజియన్ (క్యూర్) పరిధిలో దాదాపు 30 లక్షల భవనాలు ఉంటాయని అంచనా. ప్రతి ఇంటి నిర్మాణ సమయంలో ఒక బోర్‌వెల్ వేస్తున్నారు. కొన్నాళ్లకు అది ఎండిపోతే మరొకటి వేస్తున్నారు. దీనివల్ల భూగర్భ జలమట్టాలు నామమాత్రంగా మిగిలాయి. అపార్ట్‌మెంట్లు, బహుళ అంతస్తుల భవనాలలో, సగటున 8.5 అంగుళాల వ్యాసం గల పెద్ద బోర్‌వెల్‌లను సుమారు 2 వేల అడుగుల లోతు వరకు తవ్వుతున్నారు.

**యజమానుల నుంచి ముడుపులు**

నగరవ్యాప్తంగా భారీ బోర్‌వెల్ డ్రిల్లింగ్ యంత్రాలు అనుమతులు లేకుండానే యథేచ్ఛగా పనిచేస్తున్నాయి. బోరు బావులు తవ్వుకునేందుకు అనుమతులను స్వయంగా అధికారులే ఇవ్వలేదని చెబుతున్నప్పటికీ, స్కై టవర్స్?ల్లో భారీ ఎత్తున బోర్లు వేస్తున్నారు. దీనికి తోడుగా బల్క్? కనెక్షన్‌ల కోసం జలమండలి నుంచి అనుమతులు పొందుతున్నారు. బోర్లు తవ్వుతున్న ఆయా యజమానుల నుంచి అధికారులు లంచాలు తీసుకుని, ఈ సమస్యను చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు.

**అస్తవ్యస్తమైన తాగునీటి సరఫరా**

జలమండలి తాగునీటి సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కొన్ని ప్రాంతాలకు ఒక రోజు విడిచి ఒక రోజు నీరు అందుతుండగా, ఇతర కాలనీలకు రెండు రోజులకు ఒకసారి మాత్రమే సరఫరా అవుతోంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి ప్రాంతాలలో, పెద్ద భవనాలకు ఎక్కువ సేపు నీరు అందుతుండగా, పక్కనే ఉన్న కాలనీలకు మూడు రోజులకు ఒకసారి మాత్రమే నీరు వస్తోంది. ఇటీవల, ఆయా ప్రాంతాల నివాసితులు నిరసన చేస్తూ, నీటి ట్యాంకర్లను అడ్డుకున్నారు. నగరంలో చాలా మంది ప్రజలు ప్రైవేట్ ట్యాంకర్లపైనే ఆధారపడుతున్నారు. దీంతో ప్రైవేట్ వ్యాపారులు రూ.కోట్లు దండుకుంటున్నారు. జంట జలాశయాల పరీవాహక ప్రాంతాలలోని శిఖం భూముల్లో అక్రమంగా బోర్లు తవ్వి, విచక్షణారహితంగా నీటిని తోడుతున్నారు. నగరానికి నీటి సరఫరా కోసం వారు వ్యవసాయ బోర్లను కూడా లీజుకు తీసుకుంటున్నారు.

**రోజుకు 500 ఎమ్‌జీడీల భూగర్భ జలం**

క్యూర్ పరిధిలోని మొత్తం 14.50 లక్షల నీటి కనెక్షన్‌లు ఉన్నాయి. రోజువారీగా 550 మిలియన్ గ్యాలరీ పర్ డే (ఎమ్‌జీడీ) నీటిని సరఫరా చేస్తున్నారు. కానీ, రోజూ నగరానికి 1,876 మిలియన్ లీటర్లు అవసరమవుతోంది. ఇందులో సుమారు సుమారు 500 ఎమ్?జీడీల భూగర్భ జలాలను తోడుతున్నారు. నగరంలో ప్రస్తుతం 30 లక్షలకు పైగా బోర్లు వినియోగంలో ఉన్నాయి. కేవలం జలమండలి నుంచే రోజూ 18,500 ట్యాంకర్ల సరఫరా చేస్తున్నారు.

## ప్టెంబర్ లేదా అక్టోబర్‌లో స్థానిక ఎన్నికలు

-మొదటిపేజీ తరువాయి

అభివృద్ధి, ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై 'రాయలసీమ రైజింగ్' పేరుతో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. రాయలసీమలో ప్రభుత్వంపై ప్రజలు సానుకూల దృక్పథంతో ఉన్నారని, కొందరి ఎమ్మెల్యేల వ్యవహారశైలిపై మాత్రం అసంతృప్తిగా ఉన్నట్టు సర్వేలు చెబుతున్నాయన్న విషయం ప్రస్తావనకు వచ్చింది. మరికొన్ని చోట్ల కూడా అలాంటి పరిస్థితి ఉందన్న సీఎం ఎమ్మెల్యేలకూ రీఓరియెంటేషన్ అవసరమన్నారు. ఆగస్టులో రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహిస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ: రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని, శెట్టిపల్లి, వట్టిచెరుకూరు, కంగుంది, గూటుపల్లి గ్రామాల్లో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూసమస్యల్ని పరిష్కరించామని సీఎం తెలిపారు. గత ప్రభుత్వం 22ఏ నిబంధన పేరుతో వివాదాల్లోకి నెట్టిన భూముల్ని దశలవారీగా క్లియర్ చేస్తున్నామని స్పష్టంచేశారు. సాగునీటి ప్రాజెక్టులకు ఇరిగేషన్ క్యాలెండర్ అమలు, యూరియా సరఫరాకు ప్రత్యేక యాప్, అన్నదాత సుఖీభవ నిధుల జమ, ఈ నెలలో చేయనున్న తల్లికి వందనం నిధుల విడుదల వంటి కార్యక్రమాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రభుత్వ పథకాల అమలుని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, స్థానిక అధికారులు, ఉద్యోగులతో పార్టీ యంత్రాంగం సమన్వయం చేసుకుని ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని సీఎం చెప్పారు.

గొడ్డలి పార్టీ చేసే దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి: సామాజిక మాధ్యమాల్ని దుష్ప్రచారానికి, విద్వేష రాజకీయాలకు వేదికగా మారుస్తూ అశాంతిని రేకెత్తించేందుకు గొడ్డలిపార్టీ చేస్తున్న ప్రయత్నాల్ని కూటమి పార్టీల శ్రేణులు ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని చంద్రబాబు సూచించారు. దేశాన్ని, హిందూ మతాన్ని కించపరిచిన, మహిళలను మోసం చేసిన ఆరోపణల పై అరెస్టయిన బచ్చులకూరి జోసెఫ్ అనే యూట్యూబర్‌కు గొడ్డలి పార్టీ అండగా నిలిచిందన్నారు. ఈ విషయాన్ని సమావేశంలో చంద్రబాబుకు నేతలు ప్రస్తావించారు. గొడ్డలి పార్టీ నేతలు సామాజిక మాధ్యమాన్ని విచ్చలవిడిగా వినియోగిస్తారని అన్నారు. సోషల్ సైకోల్లా వ్యవహరిస్తున్నారని నేతలు అభిప్రాయపడ్డారు. గొడ్డలి పార్టీ చేసే దుష్ప్రచారాన్ని గట్టిగా తిప్పి కొట్టాలన్న సీఎం చంద్రబాబు సోషల్ మీడియా వేదికగా ప్రజలకు వాస్తవాల్ని వివరించాలని అన్నారు. నిజాలంటే గొడ్డలి పార్టీకి భయం: కూటమి ప్రభుత్వం ఫ్యాక్షన్ రాజకీయాల్ని నిర్మూలించే దిశగా అడుగులు వేస్తుంటే, వైఎస్సార్సీపీ వాటిని మళ్లీ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని పలువురు నేతలు అభిప్రాయపడ్డారు. వాళ్లు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని, మన వాళ్లూ అదే స్థాయిలో స్పందించాల్సిన అవసరం లేదన్న చంద్రబాబు తప్పుడు ఆరోపణలను ఆధారాలతో ఖండించి వాస్తవాల్ని ప్రజలముందు ఉంచితే చాలని సీఎం స్పష్టంచేశారు. నిజాలంటే గొడ్డలి పార్టీకి భయమని చంద్రబాబు విమర్శించారు. వాస్తవాలు ప్రజలకు అర్థమైతే ఆ పార్టీ సంగతి వారే చూసుకుంటారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అక్రమ కేసులు బనాయించడం, అధికారం కోల్పోయాక అక్రమాలకు పాల్పడినవారిని వెనకేసుకురావడం గొడ్డలిపార్టీకి రాజకీయ సంస్కృతిగా మారిందని టీడీపీ నేతలు అభిప్రాయపడ్డారు. గొడ్డలి పార్టీ చేస్తున్న ఇలాంటి అరాచక చర్యల వల్ల సాధారణ జీవితాలు గడిపే వ్యక్తులతో పాటు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కూడా జైళ్లకు వెళ్లిన ఘటనలను ప్రజలకు గుర్తు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

## పవన్ రెండో భుజానికి కూడా సమస్య ఉందని వైద్యులు చెప్పారు

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ముంబైలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో భుజానికి విజయవంతంగా శస్త్రచికిత్స జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఆదివారం ఆయన ముంబై వెళ్లి ఆసుపత్రిలో పవన్ కల్యాణ్‌ను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పవన్ ఆరోగ్య పరిస్థితిని, వైద్యుల సూచనలను వివరించారు.

**అభిమానుల తాకిడి వల్లే సమస్య**

పవన్ కల్యాణ్ ఎప్పుడూ ప్రజల సేవలోనే ఉంటారని, వారి మధ్యకు వెళ్లినప్పుడు తనను తాను మరిచిపోతారని చంద్రబాబు అన్నారు. "పవన్ ఎక్కడికి వెళ్లినా పెద్ద సంఖ్యలో జనం వస్తారు. ఆ సమయంలో తోపులాట, ఒత్తిడి సర్వసాధారణం. ఈ ఒత్తిడి కారణంగానే ఆయన భుజానికి సమస్య వచ్చింది. ఇది ఈరోజు వచ్చింది కాదు, చాలా కాలంగా ఈ నొప్పితో బాధపడుతున్నారు. చివరకు ఇక్కడికి వచ్చి అత్యుత్తమ వైద్యుల చేత ఆపరేషన్ చేయించుకున్నారు. దాదాపు మూడున్నర గంటల పాటు ఈ ఆపరేషన్ జరిగింది" అని చంద్రబాబు తెలిపారు. ప్రస్తుతం పవన్ వేగంగా కోలుకుంటున్నారని, త్వరలోనే పూర్తి ఆరోగ్యవంతులవుతారనే విశ్వాసం ఉందని చెప్పారు. వైద్యుల సూచన మేరకు పవన్ కల్యాణ్‌కు మూడు వారాల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని చంద్రబాబు పేర్కొన్నారు. ఆ తర్వాత ఫిజియోథెరపీ చేయించుకోవాల్సి ఉంటుందని వివరించారు. "పవన్ రెండో భుజానికి కూడా కొంచెం సమస్య ఉంది. దానికి ప్రస్తుతానికి ఫిజియోథెరపీ, వ్యాయామాలు చేయాలని వైద్యులు సూచించారు. ఆరు నెలల తర్వాత పరిస్థితిని సమీక్షించి, అవసరమైతే తదుపరి చర్యలు తీసుకుంటారు" అని చంద్రబాబు వెల్లడించారు.

**జాతీయ అంశాలపై స్పందన**

ఈ సందర్భంగా చంద్రబాబు పలు జాతీయ అంశాలపై కూడా మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రశంసల వర్షం కురిపించారు. "ప్రధాని మోదీ వల్ల ప్రపంచవ్యాప్తంగా భారతదేశ గౌరవం పెరిగింది. ఆయన కేవలం భారతదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా గౌరవించబడే శక్తివంతమైన నాయకుడు. నేడు ప్రపంచ దేశాలన్నీ ఆర్థిక సమస్యలతో సతమతమవుతుంటే, భారతదేశం మాత్రం స్థిరంగా అధిక వృద్ధి రేటును సాధిస్తోంది. దీనికి కారణం మోదీ నాయకత్వమే. సరైన సమయంలో, సరైన ప్రదేశంలో, సరైన నాయకుడు ఉండటం వల్లే ఇది సాధ్యమవుతోంది. ఆయన నాయకత్వంలో 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందనే పూర్తి విశ్వాసం నాకుంది" అని చంద్రబాబు అన్నారు. వియత్నాం పడవ ప్రమాదంపై మాట్లాడుతూ.. అది చాలా దురదృష్టకరమైన సంఘటన అని, పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని తెలిపారు. మృతదేహాలను వెనక్కి తీసుకువస్తున్నామని, అక్కడున్న వారిని సురక్షితంగా వెనక్కి పంపే ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఇక ఉత్తరప్రదేశ్ లో అయోధ్య ఘటనపై మాట్లాడుతూ.. ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, విచారణ జరుగుతున్నందున కొంత సమయం వేచి చూడాలన్నారు.

పశ్చిమ బెంగాల్‌లో యూసీసీ కమిటీ ఏర్పాటును స్వాగతిస్తూ.. ఒకప్పుడు 'బెంగాల్ ఈరోజు ఆలోచించింది, దేశం రేపు ఆలోచిస్తుంది' అనే వారని, మధ్యలో ఆగిపోయిన ఆలోచన ఇప్పుడు మళ్లీ మొదలైందని, బెంగాల్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందని వ్యాఖ్యానించారు.

రాహుల్ గాంధీ గురించి అడిగిన ప్రశ్నకు, నాయకుల పనితీరును బట్టే ప్రజలు అంచనా వేస్తారని, సమస్యల్లో ఉన్న ప్రజలకు అండగా ఉన్నప్పుడే నాయకులకు విశ్వసనీయత లభిస్తుందని చంద్రబాబు పరోక్షంగా చురకలు అంటించారు. అనంతరం, పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన వైద్యుల నివేదికను చంద్రబాబు మీడియాకు అందించారు.

## పవన్ పై మైండ్ గేమ్ ...

**కాకినాడ :** జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాజకీయ అనుభవ లేమి స్పష్టంగా కనిపిస్తుంది. ఆయనను ట్రాప్ లాగేందుకు కొందరు మిత్ర పక్షాల నేతలే ప్రయత్నిస్తున్నారని జనసేన నేతలు అభిప్రాయపడుతున్నారు. తమ చేతికి మట్టి అంటకుండా పవన్ కల్యాణ్ ను బద్నాం చేయాలని చూస్తున్నారన్న వాదన జనసేన నేతల్లో ఎక్కువగా వినిపిస్తుంది. జనసేన నేతలు సోషల్ మీడియాలోనూ ఇదే రకమైన కామెంట్స్ చేస్తున్నారు. జనసేన అధినేతగా, ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ పై విమర్శలు చేసినప్పుడు ఖచ్చితంగా మిత్ర పక్షాలు అండగా నిలబడాల్సి ఉంటుంది. పవన్ కల్యాణ్ కూటమిలోని మిగిలిన మిత్రపక్షాల నేతలకు ఇబ్బంది పరిస్థితులు వచ్చినప్పుడు పవన్ కల్యాణ్ నేరుగా స్పందిస్తారు. చివరకు హోం మంత్రి అనితపై కామెంట్స్ చేసినా పవన్ వెంటనే స్పందిస్తారు. కానీ అదే పవన్ కల్యాణ్ పై విమర్శలు వచ్చినప్పుడు మాత్రం ఎవరూ స్పందించరు. పవన్ కల్యాణ్ కు ఇది అర్థమవుతుందా? అని కొందరు జనసైనికులు నేరుగా ప్రశ్నిస్తున్నారు. ఇటీవల యూట్యూబర్ రావణ్ విషయంలో అదే జరిగిందని జనసైనికులు గుర్తు చేస్తున్నారు. యూట్యూబర్ రావణ్ పవన్ పై విమర్శలు చేసినప్పుడు మూడు పార్టీల నేతలు స్పందించాలి. రావణ్ కు అనుకూలంగా ప్రకాశ్ రాజ్ వంటి వారు వచ్చి సోషల్ మీడియాలో మాట్లాడుతున్నప్పటికీ పవన్ కల్యాణ్ కు మద్దతుగా కూటమి నేతలు కలసి రాలేదన్నది అందరూ అభిప్రాయపడుతున్నారు. దీనికి కారణం ఏంటి? పవన్ కల్యాణ్ ను ఒక వర్గం నుంచి దూరం చేయాలన్న ప్రయత్నమేనా? లేక రావణ్ ను విమర్శిస్తే ఆ సామాజికవర్గం ఓటర్లను దూరం చేసుకోవడం ఇష్టంలేని కూటమిలోని మిత్రపక్షాలు ఈ వివాదానికి దూరంగా ఉన్నాయి. . తమకు ఏం పట్టనట్లు వ్యవహరించాయి. రావణ్ పై దేశద్రోహం నేరం కింద కేసు నమోదు చేయడంపై కూడా విమర్శలు వచ్చాయి.

# హెల్త్ సెంటర్ల నిర్మాణాల్లో అవినీతి

**-కాంట్రాక్టర్లతో పిఆర్ ఏఈ కుమ్మక్కు**





**కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు మండల పరిధిలో ప్రభుత్వ నిధులతో చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (హెల్త్ సెంటర్లు) నిర్మాణాలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. రూ. 1.44 కోట్ల భారీ వ్యయంతో తాటిపర్తి,మల్లవరం,ఏ. విజయనగరం గ్రామాల్లో ఒక్కొక్కటి రూ. 72 లక్షల అంచనాతో 4 ఆరోగ్య కేంద్రాల పనులు జరుగుతున్నాయి. ఈ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పూర్తిగా గాలికొదిలేశారని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ నిర్మాణాల్లో వినియోగించిన ఐరన్, ఇసుక, సిమెంట్,మెటల్ వంటి మెటీరియల్స్ అన్నీ అత్యంత నాసిరకంగా ఉన్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.ఏఈ పూర్తిగా సహకరించడంతో కట్టడాల్లో సిమెంట్కు బదులు అధికంగా ఇసుక వాడినట్లు తెలిపారు.అలాగే నాసిరకం ఐరన్,ఇటుక వినియోగించినట్లు తీవ్రమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూపాయి పనికి పావలా వంతు కూడా ఖర్చు పెట్టలేదని స్థానికులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.తాటిపర్తి గ్రామంలో నిర్వహిస్తున్న రెండు హెల్త్ సెంటర్ ల పనులు మరీ అధ్వానంగా జరిగినట్లు అక్కడి ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపల్ పరిధిలో వర్కులు చేయకుండానే 3.6 కోట్ల రూపాయల బిల్లులు పొందినట్లు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక కాంట్రాక్టర్ తో పనులు చేయిస్తున్నట్లు తెలుస్తుంది. రెండు హెల్త్ సెంటర్ల పనులు దక్కించుకున్న సదర కాంట్రాక్టర్ అత్యంత నాసిరకంగా పనులు చేసినట్లు తెలుస్తోంది.నిబంధనల ప్రకారం పనులను పర్యవేక్షించాల్సిన పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ అసలు అటువైపే కన్నెత్తి చూడకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.

**10 శాతం లంచం ఒప్పందం**

కాంట్రాక్టర్లతో ఏఈ పూర్తిగా కుమ్మక్కయ్యారని,నాసిరకం పనులకైనా సరే పూర్తిస్థాయిలో బిల్లులు మంజూరు చేసేందుకు ముందస్తు ఒప్పందం కుదిరిందనే బలమైన ఆరోపణలు స్థానికుల నుండి వినిపిస్తున్నాయి.సదరు ఏఈ బిల్లుల క్లియరెన్స్ కోసం కాంట్రాక్టర్ల నుండి ఏకంగా 10 శాతం మేర షేర్ (లంచం) తీసుకునేందుకు డీల్ మాట్లాడుకున్నట్లు సమాచారం. ఈ మిలాఖత్ వల్లే గుత్తేదారులు ఎలాంటి భయం లేకుండా ఇష్టారాజ్యంగా నాసిరకం పనులు చేస్తున్నట్లు తెలుస్తోంది.

**ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్**

ప్రజాధనం వృధా అవుతున్నా, ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన భవనాలు ప్రమాదకరంగా మారుతున్న అధికారులు నమ్మకం నీరత్తినట్లు వ్యవహరించడంపై స్థానికులు ఆగమే అర్థం చేస్తాం ఎప్పటికైనా ఉన్నత అధికారులు తక్షణమే స్పందించి ఈ మూడు గ్రామాల్లో జరుగుతున్న హెల్త్ సెంటర్ల నిర్మాణాలను స్వయంగా పరిశీలించాలని కోరుతున్నారు. అలాగే కాంట్రాక్టర్లతో చేతులు కలిపిన ఏ ఈ పై కూడా శాఖ పరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.క్వాలిటీ కంట్రోల్ పరిశీలన చేసేవరకు బిల్లుల చెల్లింపులు చేయకుండా నిలుపుదల చేయాలని ప్రజలకు కోరుతున్నారు.

## సకాలంలో కంటి పరీక్షలు చేయించుకోవాలి

**- ప్రాథమిక దశలోనే కంటి సమస్యలను గుర్తించడం ముఖ్యం**
**- లేనియెడల చూపు కోల్పేయే ప్రమాదం ఏర్పడుతుంది**
**- మెంబర్ ఆఫ్ ఏపి హెల్త్ కేర్ ప్రొఫెషనల్ కౌన్సిల్ మెంబర్ ప్రభావతి జాగృతి**

**పొందూరు, ప్రజాజ్యోతి న్యూస్:** సకాలంలో కంటి పరీక్షలు చేసుకోవడం ద్వారా దృష్టి సమస్యలతో పాటు అందత్వాన్ని నివారించవచ్చని మెంబర్ అఫ్ ఏపీ హెల్త్ కేర్ ప్రొఫెషనల్ కౌన్సిల్ మెంబర్ మరియు ప్రభావతి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు సప్పటి వసంతరావు అన్నారు. స్థానిక దేవాంగ సంక్షేమ సంఘం, పొందూరు ఆవరణలో పుష్పగిరి కంటి ఆసుపత్రి విజయనగరం సహకారంతో ప్రభావతి జాగృతి చారిటబుల్ ట్రస్ట్, పొందూరు ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్ర శిబిరంలో ఆయన మాట్లాడారు. 40 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా నేత్ర వైద్య నిపుణుల పర్యవేక్షణలో కంటి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా బీపీ, చక్కెర వ్యాధి ఉన్నవారు ప్రతి ఏడాది ఒకసారి సమగ్ర నేత్ర పరీక్షలు చేసుకోవడం ద్వారా శాశ్వత అందత్వ బారిన పడకుండా దృష్టిని కాపాడుకోవచ్చని అన్నారు. చేనేత కార్మికులకు కంటి సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని వాటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు.పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్య బృందంతో కలసి 101 మంది కి నేత్ర పరీక్షలు చేసి 45 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. వీరికి త్వరలో కంటి అద్దాలు అందజేస్తామని అన్నారు. మరో 18 మందికి కంటి శుక్లాలు మరియు ఇతర నేత్ర వైద్య సమగ్ర పరీక్షల కొరకు పుష్పగిరి కంటి ఆసుపత్రి విజయనగరం నకు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ పొట్నూరు నారాయణ మూర్తి, స్థానిక దేవాంగ సంక్షేమ సభ్యులు మొగదాల రమణారావు,మాజీ ఎంపీటీసీ కాలేపు శ్రీనివాసరావు, కాలేపు శ్రీనివాసరావు( కేవిఆర్ సినిమాస్), ఆనం పాపారావు, తూతిక పాపారావు, సప్పటి సత్యారావు, గోవిందరావు,గుణకరరావు, పుష్పగిరి ఆసుపత్రి వైద్య బృందం సాయి, సత్యన్నారాయణ తదితరులు పాల్గొని సేవలు అందించారు.

## అన్నవరంలో వైభవంగా శ్రీ సత్యదేవుని రధ సేవ

**పుష్పాలతో అలంకరించిన రథంపై ఉత్సవ మూర్తులు**



**శంఖవరం జులై 12 (ప్రజాజ్యోతి న్యూస్) రిపోర్టర్ శ్రీనివాస్** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధిలో శనివారం శ్రీ సత్యదేవుని రధ సేవ వైభవంగా నిర్వహించారు.ఆలయ అర్చకులు తొలుత శ్రీస్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పములతో అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులను రధ వాహనంపై ఆశీనులను గావించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణలు చేయించారు.భక్తులు "గోవిందా. గోవిందా" నామస్మరణతో రధాన్ని లాగి తమ భక్తిని చాటుకున్నారు. రధ సేవ అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, పాలకమండలి సభ్యులు, దేవస్థానం సిబ్బంది, ఆలయ ప్రధాన అర్చకులు, వ్రత పురోహితులు, భక్తులు, గ్రామస్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.రధ సేవను తిలకించిన భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ వాతావరణం భక్తి శ్రద్ధలతో నిండిపోయింది.

## భూ పోరాట యోధుడు వెంగమనాయుడు

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరభద్ర స్వామి**




**గుంతకల్లు జూలై 12 (ప్రజా జ్యోతి):** పేద, బడుగు, బలహీనవర్గాల తరపున భూ పోరాటాలు చేసిన గొప్ప భూ పోరాట యోధుడు వెంగమనాయుడు అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరభద్ర స్వామి కొనియాడారు. ఆదివారం స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో వెంగమ నాయుడు 29వ వర్థంతి పురస్కరించుకొని వీరభద్ర స్వామి మాట్లాడుతూ వెంగమనాయుడు భూదాన ఉద్యమంలో, వ్యవసాయ కూలీలకు రేట్లు పెంచేందులకు అనేక ఆందోళన కార్యక్రమా ల్లో స్ఫూర్తిదాయక ఉద్యమా లు చేశారన్నారు. 22 ఏళ్ల పాటు ఉమ్మడి అనంతపురం జిల్లా సీపీఐ కార్యదర్శిగా పనిచేసి గ్రామాల్లో అనేక శాఖలు ఏర్పాటు చేయించా రన్నారు. గుంతకల్లు స్పిన్నింగ్ మిల్లు జరిపించడా నికి అలాగే గుంతకల్లు పట్టణం లో రౌడీ ఆగడాలను అరకట్టే పోరాటాలు నిర్వహిం చారు. సినీ కార్మికల సంఘాని కి జగదీష్ తో పాటు నాయకు డుగా జిల్లా వ్యాప్తంగా సంఘాలను నడపడానికి కీలకపాత్ర పోషించారని, నిర్బంధాలకు సైతం ఎదురొడ్డి పార్టీ కార్యకర్తలకు ధైర్యాన్ని అందించారన్నారు.1997 జులై 12న అనంతపురంలో పట్ట పగలు కిరాతకంగా హత్య చేయబడ్డాం జరిగింది. ఇలాంటి నాయకులను ఆదర్శంగా తీసుకొని మన మందరం కూడా ముందుకు నడవాలని, ఆయన ఆత్మ శాంతి కలిగే విధంగా సిపిఐ పార్టీ నిర్మాణం చేపట్టాలని తెలియజేశారు

## పర్యావరణ సమతుల్యత, వనరుల సంరక్షణ అందరి బాధ్యత.. డాక్టర్ ప్రత్యూష

**ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది.......**




**చాగలమర్రి , జులై 12( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** జనాభా పెరుగుదలకు అనుగుణంగా, పర్యావరణ సమతుల్యత వనరుల సంరక్షణ అందరి బాధ్యత అని ప్రభుత్వ వైద్యశాల వైద్యులు డాక్టర్ ప్రత్యూష అన్నారు. శనివారం ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా వలన కలిగే సవాళ్లు, సమాజంపై దాని ప్రభావం ఉంటుందన్నారు. కుటుంబ నియంత్రణ లింగ సమానత్వం పై ప్రజలు అవగాహన కలిగి ఉండేందుకు సిబ్బంది ప్రతి గ్రామంలో అవగాహన కల్పించాలన్నారు. జనాభాలో భారతదేశం మొదటి స్థానంలో ఉండగా, చైనా దేశం రెండో స్థానంలో ఉందని, తృతీయ స్థానంలో అమెరికా ఉందన్నారు. తల్లి శిశు ఆరోగ్యం కోసం గర్భధారణ మధ్య సరైన విరామం సరైన సమయం అవసరం అన్నారు. తల్లికి కలిగే ప్రయోజనాలు, శిశువుకు కలిగే ప్రయోజనాలు, కుటుంబానికి కలిగే ప్రయోజనాల గురించి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి మాట్లాడుతూ పెరుగుతున్న యాంత్రికరణకు అనుగుణంగా మానవ శక్తి అవసరమని ఆరోగ్యకరమైన జనాభా అవసరమని వారిని ఎంతో జ్ఞానయుక్తంగా పెంచడా నికి తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలన్నారు. మానసిక శారీరక పరిపుష్టి పొంది పెరగడానికి మంచి వాతావరణాన్ని శిశువులకు కల్పించాలన్నారు. హెల్త్ అసిస్టెంట్ మనోహర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సురేంద్రబాబు, ఆరోగ్య కార్యకర్తలు ఉమాదేవి, వసంత, గార్లెట్, హెచ్ఐవి లింక్ వర్కర్ విజయలక్ష్మి, ఆశ వర్కర్లు పెద్దక్క శాంతకుమారి, లక్ష్మీదేవి,పాల్గొన్నారు.

## అన్నవరంలో జనసేనాని పవన్ కళ్యాణ్ ఆరోగ్యం కోసం ఆయుష్ హోమం



**శంఖవరం జూలై 12 (ప్రజాజ్యోతి న్యూస్) రిపోర్టర్ శ్రీనివాస్** శంఖవరం మండలం అన్నవరంలోని ప్రముఖ పుణ్యక్షేత్రంగా పిలవబడుతున్న శ్రీ శ్రీ శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాల కోసం "ఆయుష్ హోమం" నిర్వహించారు.జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మరియు అన్నవరం దేవస్థానం పాలక మండలి సభ్యులు తోలేటి శిరీష దంపతుల ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక పూజా కార్యక్రమం జరిగింది. పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకొని ప్రజాసేవలో మరింత చురుగ్గా ఉండాలని స్వామి వారిని భక్తులు ప్రార్థించారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన తోలేటి శిరీష దంపతులకు ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త, జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్య కిరణ్ (బాబి) హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు కార్యక్రమంలో దేవస్థానం పాలక మండలి సభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పర్వత సురేష్ దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితులు గంజి గోవింద రాజులు తుని బ్లాక్ (ఏటీఎంఏ) కమిటీ వైస్ చైర్మన్ కరణం సుబ్రహ్మణ్యం, రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు అడపా శివరామకృష్ణ, కొండపల్లి శివయ్య ఓటమి నాయకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సముద్రంలో మునిగి విద్యార్థి మృతి

**తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకున్న పంతం సందీప్**



**కాకినాడ జిల్లా (ప్రజా జ్యోతి)** నేమాం గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎల్విన్ పేటకు చెందిన ఓ విద్యార్థి నేమాం సమీపంలోని సముద్ర తీరానికి వెళ్లగా, అక్కడ ప్రమాదవశాత్తు నీట మునిగి మరణించాడు. సరదాగా గడుపుదామని వెళ్లిన విద్యార్థి సముద్ర అలల ఉధృతికి కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోవడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది.ఈ ప్రమాద ఘటనపై సమాచారం అందిన వెంటనే కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ తనయుడు, యువనేత పంతం సందీప్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును స్థానికులను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను కలిసి వారిని ఓదార్చారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబానికి ధైర్యం చెప్పి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్టసమయంలో ప్రభుత్వం మరియు తమ కుటుంబం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## కార్యకర్తలే పార్టీకి ప్రాణం.. మాజీ మ్మెల్యే గంగుల

**గ్రామంలో ఆహ్వానిస్తున్న వైసీపీ, నాయకులు కార్యకర్తలు....**



**చాగలమర్రి , జులై 12( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** కార్యకర్తలే వైయస్సార్సీపికి ప్రాణమని ఆళ్లగడ్డ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రి జేంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గోడిగనూరు గ్రామానికి ఓ శుభకార్యానికి వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికలకు నాయకులు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. రాజన్న రాజ్యం మరలా రావాలంటే వైయస్సార్సీపి అధికారంలోకి రాక తప్పదని ఆయన తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను మరచి సంక్షేమ పథకాలు జాప్యం చేస్తుందన్నారు. ప్రజలు పరిపాలన దక్షత కలిగిన వారిని గుర్తించి వైయస్సార్సీపిని అధికారంలోనికి తీసుకుని వస్తారని జోష్యం చెప్పారు. ఈయన వెంట గ్రామ కార్యకర్తలు, నాయకులు పత్తి నారాయణ, తదితరులు ఉన్నారు.

## నిరుపేద కుటుంబంలో విషాదం

**- నిరుపేద కుటుంబాన్ని వెంటాడిన అనారోగ్య సమస్య**
**- యాసిడ్ త్రాగి చేనేత కార్మికురాలు ఆత్మహత్య**



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:** అనారోగ్య సమస్య ఆ కుటుంబాన్ని చీకటిమయం చేసింది. కొద్ది రోజులుగా వేధిస్తున్న అనారోగ్య సమస్యలు వైద్యుల వద్దకు వెళ్లిన తగ్గుముఖం పట్టలేదు. దీంతో చికిత్స చేసుకొనేందుకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవడంతో అనారోగ్య సమస్య ఎక్కువకావడంతో ఓ చేనేత కార్మికురాలు ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళ్తే పొందూరు మండలం లావేటి వీధికి చెందిన చేనేత కార్మికురాలు అల్లాడ సత్యవతి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. వైద్య చికిత్సలు చేయించినప్ప టికీ అనారోగ్యం కుదుటపడకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురై తీవ్ర మనస్తాపానికి గురై ఆదివారం నాడు యాసిడ్ త్రాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను శ్రీకాకుళం రిమ్స్ కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఈమెకు ఒక కుమారుడు , ఒక కుమార్తె ఉన్నారు. సత్యవతి భర్త సోమేశ్వర రావు పిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్. ఐ సత్యన్నారాయణ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ కు తరలించారు.

## బెంగళూరులో టీడీపీ ఇన్‌ఛార్జ్ మంచూరును కలిసిన బద్వేలు నేతలు



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ జులై 12 (ప్రజాజ్యోతి)** బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ (టిడిపి) నూతన ఇన్‌ఛార్జిగా నియమితులైన మంచూరు సూర్యనారాయణరెడ్డికి శుభాకాంక్షల వెల్లువ కురుస్తోంది. ఆదివారం ఉదయం బెంగళూరులోని ఆయన కార్యాలయంలో టీడీపీ ముఖ్య నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరెడ్డికి ఘనంగా శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... మంచూరు సూర్యనారాయణరెడ్డి నాయకత్వంలో బద్వేలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన నేతృత్వంలో అందరం కలిసికట్టుగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కడప పార్లమెంటు తెలుగుయువత ఉపాధ్యక్షులు, సిమాంక్ హాస్పిటల్ డైరెక్టర్ షేక్ జహంగీర్ భాష, నాయకులు మాచుపల్లి కృష్ణారెడ్డి, బిజివేముల చంద్రశేఖర్ రెడ్డి, బిజీవేముల రమణారెడ్డి, నాగిరెడ్డి రమణారెడ్డి, మహమ్మద్ రఫీ, షేక్ రఫీ, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నాయకత్వంపై విశ్వాసంతో టీడీపీలో చేరిన పది కుటుంబాలు



**రామాపురం జూలై 12 ప్రజా జ్యోతి** రామాపురం మండలం కల్పనాయుని చెరువు గ్రామ పంచాయతీ పరిధిలోని గాలంగుండ్లపల్లి గ్రామానికి చెందిన పది కుటుంబాలు వైసిపి పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అభివృద్ధి, ప్రజాసేవా నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేస్తూ మంత్రి గారి సమక్షంలో పచ్చ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల అభిమానం, విశ్వాసమే తెలుగుదేశం పార్టీకి నిజమైన బలమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీ వైపు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, గుర్తింపు ఉంటుందని, ప్రజాసేవలో కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి సురేంద్ర రెడ్డి, మండల నాయకుడు వెంకటరామిరెడ్డి , గ్రామ టీడీపీ నాయకుడు చరసాల దిలీప్ యాదవ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని పార్టీలో చేరిన కుటుంబాలకు ఘన స్వాగతం పలికారు.

## ఉపాధి కల్పించేందుకే జాబ్‌మేళా.........

నియామకపత్రాలు అందజేస్తున్న దృశ్యం..........



**చాగలమర్రి , జులై 12( ప్రజాజ్యోతి న్యూస్ )** మండలంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకే జాబ్‌మేళా నిర్వహించామని కళాశాల కరస్పాండెంట్ బడిగెంచుల రఘురాం,ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డిలు స్పష్టం చేశారు. ఆదివారం చాగలమర్రి పట్టణంలోని శ్రీవాసవి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప జిల్లాలోని సీసీ కెమెరాలను తయారు చేసే సిపి ప్లస్ ఎయిల్ డిక్షాన్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్ కంపెనీలో ఉపాధి కల్పించేందుకు అద్విక ఎంటర్ ప్రైజెస్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించామన్నారు. ఈ జాబ్‌మేళాకు 20 మంది హాజరు కాగ అందులో 8నంది ఎంపిక అయ్యారని వారికి నియామక పత్రాలు అందజేసామన్నారు. వీరికి బస్సు సౌకర్యం,బోజన వసతి కంపేనీనే ఏర్పాటు చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని జాబ్‌మేళాలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వాసవి విద్యా సమాజం కమిటీ సభ్యులు మాధవ్,ప్రిన్సిపాల్ షాబుద్దీన్, నిర్వహకులు నవీన్‌కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియ పై ప్రజలకు అవగాహన కల్పించిన గుర్రం సూర్యనారాయణ



**గుంతకల్లు జులై 12 (ప్రజా జ్యోతి):** ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై హంపయ్య కాలనీలోని సచివాలయంలో బిజెపి పార్టీ జిల్లా ఎలక్షన్ మానేజ్మెంట్ ఇన్చార్జి గుర్రం సూర్యనారాయణ పాల్గొని సర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గుర్రం సూర్యనారాయణ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ జాబితాలో నమోదు అయ్యేలా చూడాలని సచివాలయం సిబ్బందికి తెలియజేశారు.

## ఆముదాలవలస నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ గా ఎన్ సన్యాసి నాయుడు

**– ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం**



**ఆమదాలవలస , ప్రజాజ్యోతి న్యూస్ :**ఆమదాలవలస నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గా ఎన్ సన్యాసి నాయుడు నూతన బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో పాతపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహించారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఆముదాలవలస ఇన్స్పెక్టర్ గా నూతనంగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమదాలవలస నియోజకవర్గం లో శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగు తుందని ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలకు కృషి చేస్తామన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మహిళల భద్రత యువతలో చట్టాలపై అవగాహన కల్పించడం ట్రాఫిక్ నియంత్రణ ,ప్రమాదాల నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల న్నారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని ఎలాంటి సమస్యలైన నిర్భయంగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

# పంచాయతీ రాజ్ అవార్డులపై కూటమి ప్రభుత్వం క్రెడిట్ చోరీ చేస్తోంది

**వైకాపా పంచాయతీ రాజ్ విభాగం నియోజకవర్గం అధ్యక్షులు కసాపురం తిక్కస్వామి**



**గుంతకల్లు జూలై 12 (ప్రజా జ్యోతి):** వైస్సార్సీపీ గుంతకల్లు నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు సమన్వయకర్త వై.వెంకట రామి రెడ్డి ఆదేశాలు మేరకు ఆదివారం వైస్సార్సీపీ గుంతకల్లు నియోజకవర్గం పంచాయతీ రాజ్ విభాగం నియోజకవర్గం అధ్యక్షులు కసాపురం తిక్కస్వామి పత్రిక ప్రకటన చేయటం జరిగింది. ఈ సందర్భంగా కసాపురం తిక్కస్వామి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు పంచాయతీ రాజ్ విభాగంలో వచ్చిన ఐదు జాతీయ అవార్డులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో గ్రామీణాభివృద్ధి, పారదర్శక పాలన, పంచాయతీల బలోపేతానికి చేపట్టిన సంస్కరణల ఫలితమే అన్నారు. 2023, 2024 సంవత్సరాల్లో రాష్ట్ర పంచాయతీ రాజ్ వ్యవస్థ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది.గ్రామ సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ వ్యవస్థ,గ్రామ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు, పారదర్శక నిధుల వినియోగం వంటి అంశాలే ఈ అవార్డులకు ప్రధాన కారణం అన్నారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వాస్తవాలను ప్రజల నుంచి దాచిపెట్టి,జగన్ గారి హయాంలో వచ్చిన అవార్డులను తమ ప్రభుత్వ ఘనతగా ప్రచారం చేసుకోవడం దారుణమైన క్రెడిట్ చోరీఅని తెలిపారు. ఇది ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ ప్రచారం తప్ప మరొకటి కాదు అన్నారు. అభివృద్ధి చేసిన వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైస్ జగన్ గుర్తింపు ఇవ్వకుండా, ఇతరుల కృషిని తమ విజయంగా చెప్పుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం అన్నారు. వాస్తవాలను వక్రీకరించి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలను వైఎస్సార్సీపీ పంచాయతీ రాజ్ విభాగం తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. ప్రజలు నిజాలను గుర్తించాలని, జగన్ పాలనలో జరిగిన అభివృద్ధిని ఎవరూ చెరిపివేయలేరని, చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఎంత చేసినా సత్యం ప్రజల ముందుకు వస్తుందని అన్నారు. జగన్ చేసిన అనేక అభివృద్ధి కార్యక్రమాలు చంద్రబాబు క్రెడిట్ చోరీ చేస్తున్నారని,క్రెడిట్ చోరీ చేయటంలో చంద్రబాబుకి సాటి ఎవరు రారుని,ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చంద్రబాబు చేస్తున్న మోసాలు ప్రజలు గమనిస్తున్నారాని రాబోయే రోజుల్లో ప్రజలు కచ్చితంగా బుద్ధి చోబుతారు తెలిపారు.

# వసతి గృహాల్లో మెరుగైన సేవలే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ**

**గన్నేరుకొయ్యపాడు వసతి గృహాన్ని సందర్శించిన**

**వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు**

**ఎటపాక, జూలై 12 (ప్రజాజ్యోతి):**వసతి గృహాల్లో మెరుగైన సేవలు అందించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని గౌరీదేవిపేట పంచాయతీ గన్నేరుకొయ్యపాడులోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో ప్రభుత్వం మంజూరు చేసిన నాణ్యమైన ఏకరూప దుస్తులను ఆదివారం ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు.

**విద్యార్థుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యతో పాటు మెరుగైన వసతి, పోషకాహారం, ఇతర సౌకర్యాలను కల్పిస్తూ విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేస్తోందని తెలిపారు.

**మెరుగైన మెనూ.. అదనంగా రూ.99 కోట్ల వ్యయం**

గత ప్రభుత్వ హయాంలో వసతి గృహాల పరిస్థితి నిర్లక్ష్యానికి గురైందని విమర్శించిన ఆయన, ప్రస్తుతం విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మెనూ విధానాన్ని మెరుగుపరిచిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇందుకోసం అదనంగా రూ.99 కోట్ల వ్యయాన్ని భరిస్తూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నట్లు చెప్పారు.

**విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు**


ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని స్థాయిలో నాణ్యమైన ఏకరూప దుస్తులను విద్యార్థులకు అందించడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు.

**వంటశాల, భోజన మెనూ పరిశీలన**

అనంతరం వసతి గృహంలోని భోజన మెనూ, విద్యార్థులకు తయారు చేసిన వంటకాలను వైస్ ఎంపీపీ పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉలవల శివకనకరాజు, గౌరీదేవిపేట తెలుగుదేశం గ్రామ కమిటీ అధ్యక్షుడు అమరవరపు రాము, లక్ష్మీపురం జనసేన నాయకుడు మూల సతీష్, మల్లెల లక్ష్మణరావు, వార్డెన్ నవీన్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# కనుల పండుగగా గుంతకల్లు మస్తానయ్య స్వామి ఉరుసు





**గుంతకల్లు జూలై 12 (ప్రజా జ్యోతి):** గుంతకల్లులోని పాత గుంతకల్లులో జరిగే హజరత్ సయ్యద్ షా అలీ అక్బర్ మస్తానయ్య స్వామి ఉరుసు గుంతకల్లు మతసామరస్యా నికి ప్రతీకగా 391 ఉత్సవాలు ఈనెల 10, 11, 12 తేదీలలో కనుల పండుగగా మస్తానయ్య స్వామి ఉరుసు జరిగింది. ఉరుసు ఉత్సవాల్లో శుక్రవారం జులై 10 గంధం ఊరేగింపు ఉరుసు సందర్భంగా స్వామివారికి గంధం సమర్పించి, భక్తులు స్వామి వారిని ఘనంగా ఊరేగింపు నిర్వహిం చారు. జూలై 11 శనివారం షంషీర్ (ఉరుసు) ఉత్సవాల ప్రధాన ఘట్టంలో స్వామివారిని గుర్రంపై రాత్రి వేళల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం ఈ పండుగ రోజున భక్తులు స్వామి వారి దివిటీల్లో ఎండు కొబ్బరిని కాల్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. కేవలం గుంతకల్లు పట్టణమే కాక ఆంధ్రప్రదేశ్ నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఉరుసు సందర్భంగా దర్గా పరిసరాలు సర్వాంగ సుందరంగా అలంకరించి, మిఠాయిలు మరియు బొమ్మల అంగళ్లు, జాయింట్ వీల్స్, ఏర్పాటు చేస్తారు.

## ఆక్వా రైతుల సదస్సును జయప్రదం చేయండి

**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రజా జ్యోతి రిపోర్టర్ బి ఎస్ వి ప్రసాద్** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రివర్యులు శ్రీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ నెల15వ తారీఖున జరగబోయే భీమవరం లో ఆక్వా రైతులు సభ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలి అని ఈ రోజు లిఆచంట నియోజకవర్గం ఇంచార్జ్ మాజీ మంత్రివర్యులు చెరుకువాడ శ్రీ రంగనాథరాజు గారి ఆదేశాలు మేరుకు ఆచంట నియోజకవర్గం ఆక్వా రైతులు తో,ముఖ్య నాయకులు కార్యకర్తలు విస్తృతస్థాయి సమావేశాలు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా లినరసాపురం పార్లమెంట్ పరిశీలకులు శ్రీ ముదునూరి మురళికృష్ణం రాజు పార్లమెంట్ ఇంచార్జ్



గూడూరు ఉమాబాల ,జడ్పిటిసి గుంటూరు పెద్దిరాజు,వైయస్సార్సీపి ఎంబీసీ విభాగ రాష్ట్ర అధ్యక్షులు పెండర్ వీరన్న, జడ్పిటిసిలు ఎంపీటీసీలు ఆక్వా రైతులు మరియు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# సకాలంలో కంటి పరీక్షలు చేయించుకోవాలి

- ప్రాథమిక దశలోనే కంటి సమస్యలను గుర్తించడం ముఖ్యం
- లేనియెడల చూపు కోల్పేయే ప్రమాదం ఏర్పడుతుంది
- మెంబర్ ఆఫ్ ఏపి హెల్త్ కేర్ ప్రొఫెషనల్ కౌన్సిల్ మెంబర్ ప్రభావతి జాగృతి

**పొందూరు, ప్రజాజ్యోతి న్యూస్:**దసకాలంలో కంటి పరీక్షలు చేసుకోవడం ద్వారా దృష్టి సమస్యలతో పాటు అందత్వాన్ని నివారించవచ్చని మెంబర్ అఫ్ ఏపీ హెల్త్ కేర్ ప్రొఫెషనల్ కౌన్సిల్ మెంబర్ మరియు ప్రభావతి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు సప్పటి వసంతరావు అన్నారు. స్థానిక దేవాంగ సంక్షేమ సంఘం, పొందూరు ఆవరణలో పుష్పగిరి కంటి ఆసుపత్రి విజయనగరం సహకారంతో ప్రభావతి జాగృతి చారిటబుల్ ట్రస్ట్, పొందూరు ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్ర శిబిరంలో ఆయన మాట్లాడారు. 40 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా నేత్ర వైద్య నిపుణుల పర్యవేక్షణలో కంటి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా బీపీ, చక్కెర వ్యాధి ఉన్నవారు ప్రతి ఏడాది ఒకసారి సమగ్ర నేత్ర పరీక్షలు చేసుకోవడం ద్వారా శాశ్వత అందత్వ బారిన పడకుండా దృష్టిని కాపాడుకోవచ్చని అన్నారు. చేనేత కార్మికులకు కంటి సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని , వాటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు.పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్య బృందంతో కలసి 101 మంది కి నేత్ర పరీక్షలు చేసి 45 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. వీరికి త్వరలో కంటి అద్దాలు అందజేస్తామని అన్నారు. మరో 18 మందికి కంటి శుక్లాలు మరియు ఇతర నేత్ర వైద్య సమగ్ర పరీక్షల కొరకు పుష్పగిరి కంటి ఆసుపత్రి విజయనగరం నకు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ పొట్నూరు



నారాయణ మూర్తి, స్థానిక దేవాంగ సంక్షేమ సభ్యులు మొగదాల రమణారావు,మాజీ ఎంపీటీసీ కాలేపు శ్రీనివాసరావు, కాలేపు శ్రీనివాసరావు( కేవిఆర్ సినిమాస్), ఆనం పాపారావు, తూతిక పాపారావు, సప్పటి సత్యారావు, గోవిందరావు,గుణకర రావు, పుష్పగిరి ఆసుపత్రి వైద్య బృందం సాయి, సత్యన్నారాయణ తదితరులు పాల్గొని సేవలు అందించారు.

# జూలై 14న “కలెక్టరేట్ పికెటింగ్” జయప్రదం చేయండి.

- యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ పిలుపు



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ జులై 12 (ప్రజా జ్యోతి)** ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12 వ పిఆర్సీని తక్షణమే అమలు చేయాలని, పెండింగ్ డిఏ లను, ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జూలై 14వ తేదీ చేపట్టిన కడప “కలెక్టరేట్ ముట్టడిని” జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం ప్రొద్దుటూరులోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాదన విజయకుమార్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వంపై ఉద్యోగులు అనేక ఆశలు పెట్టుకున్నారని, అయితే ప్రభుత్వం ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న తీరుతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర నిరుత్సాహంతో ఉన్నారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేసి, సమస్యలను పరిష్కరించడాన్ని విస్మరిస్తున్నారన్నారు. 12వ పిఆర్సీ గడువు ముగిసి మూడేళ్లు అవుతున్నా పిఆర్సీని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. 11వ పిఆర్సీని సైతం అప్పటి వైసిపి ప్రభుత్వం మూడున్నరేళ్లు ఆలస్యంగా అమలు చేయడంతో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులతో పాటు సర్వీసులో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు జరుగుతున్న నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం తక్షణం 12వ పిఆర్సీ కమిషన్ ను ఏర్పాటు చేసి, పిఆర్సీ అమలయ్యే వరకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 29 శాతం మధ్యంతర భృతిని చెల్లించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను కూటమి ప్రభుత్వం కొంతమేరకు చెల్లించినప్పటికీ, ఇంకా 25 వేల కోట్ల రూపాయల పైబడి బకాయిలు పేరుకపోయాయ న్నారు. వీటి చెల్లింపులలో నిర్దిష్టమైన కాల వ్యవధి లేకపో వడం వల్ల పూర్తిస్థాయిలో బకాయిల చెల్లింపులు జరగడం లేదన్నారు. నాలుగు డిఏలు పెండింగ్ ఉన్నా పాలకులు కనీసం స్పందించడం లేదని విమర్శించారు. మూడు సంవత్సరాలుగా సరెండర్ లీవ్ బకాయిల చెల్లింపులు లేవని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు, పాత పెన్షన్ అమలు లాంటి విధానాలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. 2004 కు ముందు ఉద్యోగ నియామక ప్రక్రియ పూర్తయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలుపై ప్రభుత్వ ఉత్తర్వుల జారీలో జాప్యం తగదన్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రి మండలి ఆమోదం సైతం పొందినప్పటికీ ఉత్తర్వులను విడుదల చేయడంలో కాలయాపన ఎందుకని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉద్యోగులకు ఇచ్చిన హెల్త్ కార్డులపై ఉద్యోగులకు వైద్యం అందడం లేదని ఆరోపించారు. నగదు చెల్లించి వైద్యం పొందిన మెడికల్ బిల్లులు ఎన్టీఆర్ ట్రస్ట్ ఆమోదం పొందినప్పటికీ వాటి చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నదని విమర్శించారు. దీనిపై కమిటీ నియమించినా ఎలాంటి పురోగతి లేదని పేర్కొన్నారు. కరోనా మహమ్మారిలో మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టడంలో ప్రభుత్వ అలసత్వం సరికాదన్నారు. తక్షణం కారుణ్య నియామకాలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలను కారణంగా చూపి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణత సాధించాలనడం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో చర్చించి విద్యాహక చట్టం-2009 సెక్షన్ 23(1) కి సవరణకు కృషి చేయాలని కోరారు. చట్ట సవరణ జరిగే వరకూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ పరీక్షను, ఆఫ్ లైన్ విధానంలో నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ, తక్షణం 12 వ పిఆర్సీ కమిషన్ ను ఏర్పాటు చేయాలని, పిఆర్సీ అమలయ్యే వరకు 29 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని, పెండింగ్ డిఏ లను విడుదల చేయాలని, ఆర్థిక బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ జూలై 14వ తేది ఫ్యాప్టో ఆధ్వర్యంలో చేపట్టిన కడప కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రభుత్వం స్పందించాలని, లేకపోతే తగు మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు ఎన్.కంబగిరి, ఎం.శ్రీనువాసులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పి.శశి కిరణ్ కుమార్, కె.చెంచి రెడ్డి, పి.నాగరాజు, వి.వి.రమణా రెడ్డి, కె.ఈశ్వరయ్య, ఎ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడలో ముగిసిన ఏపీ టెట్ అవగాహన సదస్సు,శిక్షణ తరగతులు

--తెలుగు అంశాలపై నిపుణుడిగా సేవలందించిన యన్. కన్నబాబు మాష్టారు

--రెండు రోజుల పాటు కొనసాగిన అవగాహన,శిక్షణ కార్యక్రమం

**కాకినాడ జిల్లా జూలై 12 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** సామాజిక విద్యా సేవలో భాగంగా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 11, 12 తేదీలలో నిర్వహించిన ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష అవగాహన సదస్సు, శిక్షణ తరగతులు విజయవంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యర్రవరం ప్రధానోపాధ్యాయులు, ప్రముఖ తెలుగు విద్యావేత్త యన్. కన్నబాబు మాష్టారు తెలుగు అంశానికి సంబంధించిన పాఠ్యాంశాలు, బోధనా పద్ధతులపై ప్రత్యేక శిక్షణ అందించారు.ఉపాధ్యాయ అర్హత పరీక్షలో తెలుగు విభాగంలో ఉత్తమ మార్కులు సాధించేందుకు పాటించాల్సిన వ్యూహాలు, తక్కువ సమయంలో సమర్థవంతంగా సిద్ధమయ్యే విధానం, పరీక్షా విధానం, ప్రశ్నల స్వభావం తదితర అంశాలను వివరించారు.తెలుగు భాషా చరిత్ర, తెలుగు సాహిత్య చరిత్ర, అన్యదేశ్య పదాలు, పదజాలం, వ్యాకరణ అంశాలు, తెలుగు బోధనా పద్ధతులను సులభమైన రీతిలో వివరించి అభ్యర్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు.కార్యక్రమం ముగింపు సందర్భంగా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి



చక్రవర్తి, జిల్లా అధ్యక్షులు సీహెచ్. సూరిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ. నాగేశ్వరరావు (నగేష్), కార్యక్రమ నిర్వాహకులు ఎం.వి. సాయిరాం, ఎన్. గోవిందరాజులు, ఏలేశ్వరం మండలానికి చెందిన జిల్లా కార్యదర్శి సోమరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు యన్. కన్నబాబు మాష్టారును ఘనంగా అభినందించి సత్కరించారు.ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ, ఉపాధ్యాయ అర్హత పరీక్షలో విజయం సాధించేందుకు అవసరమైన అంశాలను స్పష్టంగా వివరించిన కన్నబాబు మాష్టారు సేవలు అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచాయని తెలిపారు.

## ధర్మవరం శివారులో పేకాట స్థావరంపై పోలీసుల దాడి..

--రూ.9,700 నగదు స్వాధీనం

--ఎనిమిది మంది అరెస్ట్..

--జూదాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

-- ఎస్సై లక్ష్మీకాంతం



**కాకినాడ జిల్లా జూలై 12 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు,పెద్దాపురం డీఎస్పీ ఏబీజీ తిలక్ సూచనలతో ప్రత్తిపాడు సీఐ బి సూర్య అప్పారావు పర్యవేక్షణలో ప్రత్తిపాడు ఎస్సై లక్ష్మీకాంతం తన సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి నిర్వహించారు.ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే ముందస్తు సమాచారం అందుకున్న ప్రత్తిపాడు ఎస్సై లక్ష్మీకాంతం తన సిబ్బందితో కలిసి దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి రూ.9,700 నగదును స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్సై లక్ష్మీకాంతం మాట్లాడుతూ ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట,బొమ్మ బొరుసు ,గుండాట,కోడిపందాలు వంటి జూదాలు,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


## భీమవరంలో 15న జగన్ సభ-ఏర్పాట్లను పరిశీలించిన ప్రసాదరాజు,మురళీ కృష్ణంరాజు



**పశ్చిమగోదావరి జిల్లా జూలై 12 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** ఈ నెల 15న భీమవరంలో నిర్వహించనున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్లు వేగం పుంజుకున్నాయి.సభ విజయవంతానికి చేపడుతున్న ఏర్పాట్లలో భాగంగా ఆదివారం సభా స్థలాన్ని జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాద్ రాజు పరిశీలించారు.ఈ సందర్భంగా నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీ కృష్ణంరాజు, చింతలపాటి శ్రీనివాసరాజు, భీమవరం పట్టణ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు, రాష్ట్ర కార్యదర్శి ఏ.ఎస్. రాజు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.సభకు భారీగా ప్రజలు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని వేదిక, వాహన పార్కింగ్, ప్రజల రాకపోకలు, ఇతర ఏర్పాట్లపై నాయకులు అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు.సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు

## ప్రత్తిపాడులో రూ.3.80 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు గ్రామస్తుల కృతజ్ఞతలు





**:కాకినాడ జిల్లా పిఠాపురం రూరల్ మండలం (ప్రజా జ్యోతి)** బి. ప్రత్తిపాడు గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం భారీ నిధులు కేటాయించింది. గ్రామంలో రూ.3 కోట్ల 80 లక్షల అంచనా వ్యయంతో అత్యంత నాణ్యమైన సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా అధ్వానంగా ఉన్న రోడ్ల సమస్యకు ఈ పనులతో శాశ్వత పరిష్కారం లభించనుండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**మారనున్న గ్రామ రూపురేఖలు**

గ్రామంలో గత కొంతకాలంగా దెబ్బతిన్న రహదారుల వల్ల స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా వర్షాకాలంలో బురదమయంగా మారే రోడ్ల వల్ల రాకపోకలు నరకంగా మారేవి. ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన ఈ భారీ అభివృద్ధి పనులతో తమ గ్రామానికి కొత్త కళ రాబోతోందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను జనసేన పార్టీ నాయకులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడా రాజీ పడకుండా, పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పనులు జరిగేలా సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులతో మాట్లాడుతున్నారు. ఈ పనులు త్వరలోనే పూర్తి కానుండటంతో వర్షాల సీజన్‌లో కూడా ప్రయాణాలు సులభతరం అవుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు.

**ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు**

తమ నియోజకవర్గ శాసనసభ్యుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతోనే గ్రామానికి ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరయ్యాయని గ్రామస్తులు కొనియాడారు. గ్రామాభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు, అలాగే పనులను వేగవంతం చేసిన అధికారులకు గ్రామస్తులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## విహారయాత్ర విషాదం.. దారలమ్మ పిక్నిక్ పాయింట్‌లో నీటిలో మునిగి యువ వైద్యుడు మృతి



**మోతుగూడెం, జూలై 12:** మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం విషాద ఘటన చోటుచేసుకుంది. విహారయాత్రకు వచ్చిన యువ వైద్యుడు మహంకాళి ఉదయకిరణ్ (23) ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు.ఏలూరు జిల్లా గణపవరం మండలానికి చెందిన ఉదయకిరణ్ ప్రస్తుతం ఏలూరులోని అశోక్ కిడ్నీ హాస్పిటల్‌లో డ్యూటీ డాక్టర్‌గా పనిచేస్తున్నాడు. స్నేహితులతో కలిసి మారేడుమిల్లి, మోతుగూడెం ప్రాంతాలకు విహారయాత్రకు వచ్చిన ఆయన, మోతుగూడెం సమీపంలోని దారలమ్మ గుడి పిక్నిక్ పాయింట్ వద్ద నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు.సమాచారం అందుకున్న వెంటనే మోతుగూడెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికులు, స్నేహితులతో కలిసి గాలింపు చేపట్టారు. అనంతరం ఉదయకిరణ్‌ను నీటి నుంచి వెలికితీయగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు.మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పర్యాటక ప్రాంతాల్లో నీటి ప్రవాహం అధికంగా ఉన్న ప్రాంతాల్లో సందర్శకులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## పొందూరు మేజర్ పంచాయతీలో ఫాగింగ్ కార్యక్రమం

- దోమల నివారణకు ప్రత్యేక చర్యలు
- సీజనలు వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన



**పొందూరు ప్రజాజ్యోతి న్యూస్:**సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా పొందూరు మేజర్ పంచాయతీ ఆవరణంలో పంచాయతీ ఈ.ఓ పొన్నాడ జగదీష్ ఆధ్వర్యంలో శనివారం నాడు ఫ్యాగింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ పరిధిలో ప్రధాన వీధులు కాలనీలు దోమలు అధికంగా ఉండే ప్రాంతాల్లో ఫ్యాగింగ్ చేపట్టి దోమల నివారణకు చర్యలు చేపట్టారు. వర్షాకాలన్నీ దృష్టిలో ఉంచుకుని డెంగ్యూ ,మలేరియా ,చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని పరిశు భ్రత పాటించాలని సూచించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను ఎప్పటికప్పుడు చేపడుతూ పంచాయతీని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తామన్నారు.

## యంగ్ స్టార్ యూత్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:** పొందూరు మండల కేంద్రంలో యంగ్ స్టార్ యూత్ క్లబ్ నూతన కార్యవర్గ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈ ఎన్నికలో యంగ్ స్టార్ యూత్ క్లబ్ గౌరవాధ్యక్షులు గా భాసా ఆనందమోహన్ ,అధ్యక్షులుగా మన్నాన వెంకటరావు ఉపాధ్యక్షులు గా రాంబిల్లి అప్పారావు ,ప్రధాన కార్యదర్శి గా పాలిశెట్టి సూర్యప్రకాశరావు ఎన్నుకోబడ్డారు. సహాయ కార్యదర్శి గా బలివాడ శివకుమార్ ,కోశాధికారిగా నాళం పైడిరాజు సాహితీ కార్యదర్శిగా గిడిజాల భాస్కరరావు ,కార్యదర్శులుగా మల్లిక రమణమూర్తి, ధర్మవరపు పోలినాయుడు ,సోషల్ సర్వీస్ కార్యదర్శిగా ఆట్ల చంద్రశేఖరరావు ,క్రీడా కార్యదర్శిగా చదువుల శోభన్ బాబు ,ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అనకాపల్లి రంగారావు ,కార్యాలయ కార్య దర్శిగా ఎరుబోతు లక్ష్మణరావు ,ముఖ్య సలహాదారులుగా గుడ్ల చంద్రశేఖరరావు, గుంటుకు జగన్నాధరావు ,కోరుకొండ విజయ్ కుమార్ ,అనకాపల్లి శివకుమార్,మొగదాల రమణారావు ,కార్యవర్గ సభ్యులుగా కుమిలి రాజేష్ ,పొగిరి చంద్రరావు ,బొద్దూరు హరిబాబు వడగ సూర్యారావు ,మాసాడ భోగిరాజు ,కోరుకొండ రాజశేఖర్,బొద్దేపల్లి జనార్ధనరావు, దండా. శ్రీనివాసరావు తదితరులు ఎన్నికయ్యారు.

## పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని అన్నవరంలో ప్రత్యేక పూజలు



**కాకినాడ జిల్లా జూలై 12 ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని కోరుతూ అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో మహా ఆయుష్ హోమం, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు.అన్నవరం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు తోలేటి శిరీష ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు పాలచర్ల నాగేంద్ర చౌదరి, పర్వత సురేష్, గోవిందరాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో కొనసాగాలని స్వామివారిని ప్రార్థించారు.

# సీనియర్ పాత్రికేయులు ఆర్ రాంబాబు కు ఘన సన్మానం

### - ఎమ్మెల్యే గోండు శంకర్,ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం



**శ్రీకాకుళం , ప్రజాజ్యోతి న్యూస్:**శ్రీకాకుళం పట్టణం లో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల ఫోరం జిల్లామహాసభల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆమదాలవలస ఎమ్మెల్యే ,రాష్ట్ర పి.యూ.సి చైర్మెన్ కూన రవికుమార్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గోండు శంకర్, పలాస ఎమ్మెల్యే ,గౌతు శిరీష,ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వర రావు ,మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరికి ఏపీ.జి.ఎఫ్ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్యంలో పాత్రికేయుల పాత్రను ఎమ్మెల్యే లు కొనియాడారు. అనంతరం ఎన్నో ఏళ్లుగా పాత్రికేయ రంగంలో సేవలందిస్తున్న సీనియర్ పాత్రికేయులు రాయిపిల్లి రాంబాబు తో పాటు పలువురు సీనియర్ పాత్రికేయులను ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఎమ్మెల్యే గోండు శంకర్, ఏపి.జి.ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శాసపు జోగినాయుడు జిల్లా అధ్యక్షులు గజ్జి షణ్ముఖ రావు పలువురు ప్రజాప్రతినిధులు ఘనంగా శాలువాతో సత్కరించి మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్ స్టేట్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ ఏపి.జె.ఎఫ్ వ్యవస్థాపకులు కృషాంజనేయులు స్టేట్ ప్రెసిడెంట్ శివ ప్రసాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషణ్ రావు ట్రెజరర్ శ్రీనివాస రావు ఉపాధ్యక్షులు యగ్ర ,గౌతు సూర్యనారాయణ, ఏపీ.జి.ఎఫ్ జిల్లా నాయకులు ఐ న్యూస్ వాసు ,సీనియర్ ,యువ పాత్రికేయులు వివిధ పత్రికలు ఎలక్ట్రానిక్ డిజిటల్ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యానికి జర్నలిస్టులే వెన్నెముక

### - ఏపి.జి.ఎఫ్ జిల్లా మహాసభల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కూన రవికుమార్
### - ప్రజా స్వామ్య విలువలను పరిరక్షించడంలో మీడియా పాత్ర గొప్పది
### - మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా జర్నలిస్టులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి
### - ఎమ్మెల్యే కూన రవికుమార్





**శ్రీకాకుళం , ప్రజాజ్యోతి న్యూస్:** ప్రజాస్వామ్యానికి జర్నలిస్టులే వెన్నుముక అని రాష్ట్ర పి.యూ.సి చైర్మెన్ , ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు.శ్రీకాకుళం పట్టణంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల ఫోరం (ఏపీ.జె.ఎఫ్) జిల్లా మహాసభలకు ఎమ్మెల్యే కూన రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు ఫోరం ప్రతినిధులు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు కీలకమైన వారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టులు వారధిగా పనిచేస్తున్నారని కొనియాడారు.వాస్తవాలను నిష్పక్షపాతంగా ప్రజలకు అందించడం ద్వారా ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడంలో మీడియా పాత్ర ఎంతో గొప్పదని ఆయన అన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా జర్నలిస్టులు తమ నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకుంటూ సమాజానికి సేవలందించాలని ఆకాంక్షించారు.జర్నలిస్టుల సంక్షేమం, వారి వృత్తి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. మీడియా ప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ జిల్లా మహాసభల్లో ఏపీ.జెఎఫ్ జిల్లా, రాష్ట్ర నాయకులు, సీనియర్ జర్నలిస్టులు, వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ డిజిటల్ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కూటమిప్రభుత్వం నిర్లక్ష్యానికి మహిళా రైతు బలి

### - ధ్వజమెత్తిన వైసిపి నియోజకవర్గ సమన్వయ కర్త చింతాడ రవికుమార్




**ఆమదాలవలస ప్రజాజ్యోతి న్యూస్ :**టెక్కలి నియోజవర్గంలో యూరియా కొరతపై ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయ కర్త చింతాడ రవికుమార్ ధ్వజమెత్తారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం లో యూరియా కొరత తీవ్ర ఆందోళన కలిగిస్తుందని చింతాడ రవికుమార్ ఆరోపించారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టెక్కలి నియోజకవర్గం లో యూరియా కోసం ఒక మహిళ ప్రాణాలు కోల్పోయిందని పేర్కొన్నారు. వ్యవసాయం శాఖ మంత్రి ప్రాతినిత్యం వహిస్తున్న నియోజకవర్గం లో రైతుకు యూరియా అందకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు రైతు వ్యవసాయం చేయవద్దని మాట్లాడుతున్నారని ఎరువులు వాడితే క్యాన్సర్ వస్తుందని చెప్పడం సరికాదని అన్నారు .మరి ఇతర రసాయనక పురుగుమందులు వాడితే క్యాన్సర్ రాదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు సకాలంలో ఎరువులు అందించడం విషయములు లో విఫలమయ్యారన్నారు.ప్రస్తుతం ఎకరానికి ఒక బస్తా యూరియా మాత్రమే ఇస్తే రైతులకు ఎలా సరిపోతుందని ప్రశ్నించిన ఆయన ప్రభుత్వం సరఫరా ప్రైవేట్ డీలర్లకు మళ్లించడం వల్ల అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. నిర్మించిన ధర కంటే సుమారు 40% ఎక్కువ యూరియాను విక్రయిస్తున్నారని , రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో సచివాలయాలు ద్వారా ఎరువులు పంపిణీ చేయడంలో రైతు సకాలంలో అందేదని ఇప్పుడు అదే విధానాన్ని ఎందుకు నిలిపివేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులు తెల్లారుజామున నుంచి క్యూలో నిలబడి సాయంత్రం వరకు ఒక బస్తా యూరియా కోసం ఎదురు చూడవలసిన పరిస్థితి నెలకొందని కొందరు అదనపు డబ్బులు చెల్లించి వస్తుందన్నారు. ఈ విధానాన్ని నివారించి రైతుకు తగినంత ఎరువులు పారదర్శకంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రవికుమార్ ప్రిమాండ్ చేశారు. అలాగే క్యూ లైన్ లో ఎరువు కొరకు నిలబడి చనిపోయిన రైతు మహిళా నష్టపరిహారం కూడా చెల్లించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆ మహిళ చనిపోయిన కారణం ఈ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే అని ఇది ప్రభుత్వ హత్య అని అన్నారు.

# జిల్లాలోనే 3వ స్థానంలో నిలిచిన మండలం!..



వరరామచంద్రాపురం తహసీల్దార్ వై సరస్వతి!..

**వి.ఆర్.పురం,జులై12(ప్రజాజ్యోతి ప్రతినిధి)**మండల పరిధిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన"సర్ " కార్యక్రమం 100 శాతం ఈ.ఎఫ్.ల డిజిటైజేషన్‌లో పోలవరంజిల్లాలో వి.ఆర్. పురం మండలంలో వంద శాతం పూర్తిస్థాయిలో విజయవంత మైందని, మండల తహశీల్దార్ (ఎం.ఆర్.ఓ) మరియు మండ ల ఎన్నికల అధికారి వై సరస్వతి,గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈసందర్భంగా తహసీల్దార్ సరస్వతి,మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సిబ్బంది అందించిన నిరంతరసేవలవల్ల, ప్రక్రియలో మనమండలం జిల్లా స్థాయిలోనే మూడవ స్థానం కైవసం చేసుకుని ఆదర్శంగా నిలిచిందని ఆమె ఆనందం వ్యక్తంచేశారు.? సిబ్బంది సమిష్టి కృషికే దక్కినగౌరవంగా భావించాలని పేర్కొన్నారు. బృహత్తర కార్యక్రమాన్ని విజయ వంతం చేయడం వెనుక రెవెన్యూ మరియుఎన్నికల విభాగం సిబ్బంది సమిష్టి కృషి దాగిఉందన్నారు.ముఖ్యంగా మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ యం రామకృష్ణ,సీనియర్ అసిస్టెంట్ ఆర్ రామయ్య,జూనియర్ అసిస్టెంట్ ఎ కన్నారావుల, సమర్థవంత మైన పర్యవేక్షణలో ఈప్రక్రియ అత్యంత పారదర్శకంగా సాగిందని ఆమె అన్నారు.?మండల వ్యాప్తంగా ఉన్న 29 మంది బూత్ లెవెల్ ఆఫీస్స్ అహర్నిశలూ శ్రమించి క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటినీ సందర్శించి ఓటర్ల వివరాలను పక్కాగా సేకరించారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించడమే ధ్యేయంగా,ఎలాంటి తప్పులకు తావులేకుండా ఈ పూర్తి చేశామని వివరించారు.ఈ విశేష కృషి వల్లే జిల్లాస్థాయిలో మన మండలానికి తగిన గుర్తింపు లభించిందని ఆమె పేర్కొన్నారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు జిల్లాస్థాయిలో తృతీయ స్థానం సాధించడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన రెవెన్యూ సిబ్బందికి, విధి నిర్వహణలో అంకితభావం ప్రదర్శించిన 29 మంది బీ.ఎల్.ఓ.,లకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా అధికారుల తనిఖీలకు పూర్తిస్థాయిలో సహకరించి, వివరాలు అందజేసిన మండల ప్రజలకు,స్థానిక ప్రజాప్రతినిధులకు తమవిభాగం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తహశీల్దార్ వై. సరస్వతి,పేర్కొన్నారు.

## ఓటు హక్కు....ప్రజాస్వామ్యానికి రక్షణ కవచం....

వైసీపీ యువ నాయకుడు కొండా అమరేష్

16 గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లలో 'ఎస్.ఐ.ఆర్' ప్రక్రియ పరిశీలన



**హోళగుంద, జూలై 12, ప్రజా జ్యోతి న్యూస్ –** ప్రజాస్వామ్యానికి రక్షణ కవచం లాంటి ఓటు హక్కును కాపాడుకోవడం మనందరి బాధ్యత అని,ప్రతి ఒక్కరు బాధ్యతగా ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో తమ ఓటు వెరిఫికేషన్ చేసుకోవాలని వైసీపీ యువ నాయకుడు కొండ అమరేష్ సూచించారు. ఆదివారం మండల పరిధిలోని గజ్జహళ్లి , వందవాగిలి, ఇంగాళదహల్ , పెద్ద గోనెహల్, ఎం డి హళ్లి, లింగంపల్లి, నేరనికి, తండా, యల్లార్తి, చిన్నహ్యాట, పెద్దహ్యాట, కోగిలతోట, ముద్దటమాగి, సమ్మతగిరి, సులువాయ్,హొళగుంద గ్రామాలలో ప్రతి బూత్ లో వెరిఫికేషన్ ప్రక్రియను కొండా అమరేష్ పరిశీలించారు.గత 20 రోజులు హొలగుంద మండలంలోలి జరుగుతున్న ఎస్ ఐ ఆర్ వెరిఫికేషన్ ప్రక్రియను కొండా అమరేశ్ గ్రామానికి సంబంధించిన నాయకులు కార్యకర్తలతో కలిసి పలు పోలింగ్ బూత్‌లను సందర్శించి, వెరిఫికేషన్ ప్రక్రియ సక్రమంగా జరుగుతున్న తీరును పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ....ప్రతి ఓటు ఎంతో విలువైనది ప్రతి ఓటరు తమ ఓటు వివరాలను తప్పనిసరిగా బి ఎల్ ఓ లకు సహకరించి అవసరమైన వెరిఫికేషన్ పూర్తి చేయాలనీ కోరారు.ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత. ఓటు హక్కును కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ చైతన్యంతో ముందుకు రావాలనీ పిలుపునిచ్చారు. పార్టీ అందుబాటులోకి తీసుకువచ్చిన మై బూత్ మై ఓటర్ యాప్ గురించి సూచించారు.

# సంపాదకీయం

## అర్ధ సత్యాల ఆర్థికశాస్త్రం మీద మార్క్సు విమర్శ!

'పెరిగిన ఇళ్ళ అమ్మకాలు'/ 'విద్యుత్తు వాహనాల విక్రయాలు 3 లక్షలు దాటొచ్చు' / 'పెంపుడు కుక్కల ఆహారం మార్కెట్లోకి విడుదల'/ '110 కోట్ల భారీ బడ్జెట్టు సినిమా'/ 'ఒక్క మే నెలలోనే 700 కోట్ల డాలర్ల విలువ గల చమురు దిగుమతులు'. ఈ వార్తల్లో వున్న ఇళ్ళూ, వాహనాలూ, కుక్కల ఆహారమూ, సినిమా, చమురూ--అన్నీ 'సరుకులే!'. వీటిని అమ్మితే వచ్చేది 'డబ్బు'. పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రం అంతా సరుకులూ--డబ్బూ చుట్టే తిరుగుతుంది. కానీ, ఆర్థిక శాస్త్రవేత్తలు కొందరు వాటి గురించి తప్పుగానూ, కొందరు అరకొరగానూ అర్థం చేసుకుని పెద్ద పెద్ద గ్రంథాలు రాశారు. ఆ గ్రంథాలలో ఉన్న శాస్త్రాన్ని 'రాజకీయ అర్థ శాస్త్రం' ('పొలిటికల్ ఎకానమీ') అనడం 17వ శతాబ్దంలో మొదలై, దాదాపు 250 ఏళ్ళ తర్వాత, 'ఆర్థిక శాస్త్రం' ('ఎకనామిక్స్') అనే పేరు స్థిరపడింది. ఆర్థిక శాస్త్రం అన్నా 'అర్థ శాస్త్రం' అన్నా ఒకటే! ఈ రాజకీయ ఆర్థిక శాస్త్రం, 19వ శతాబ్దంలో మార్క్సు రంగప్రవేశం చేసేవరకూ, అనేక పరిమితులతో, చాలా సార్లు తప్పులతో ఉండేది. అందుకే మార్క్సు, 'రాజకీయ అర్థశాస్త్రం మీద విమర్శకు ఒక చేర్పు' అని 1859లో రాశాడు. మార్క్సూ ఎంగెల్సుల రచనలు అనేకం తెలుగులోకి వచ్చాయి గానీ, ఈ రచన మాత్రం ఇప్పుడే అనువాద రూపంలో మనకు అందుబాటులోకి వచ్చింది. అంటే, తెలుగునాట కమ్యూనిస్టు పార్టీ అంటూ మొదలైన 100 సంవత్సరాల తర్వాత ఎ.గాంధీ ద్వారా అందింది. దీనికి గాంధీ క్లుప్తంగా పెట్టిన పేరు: 'కార్ల్ మార్క్స్ 1859 అర్థ శాస్త్ర విమర్శ'. జర్నలిస్టుగా, అనువాదకుడిగా, పీకాక్ క్లాసిక్స్ ప్రచురణల ఎడిటర్‌గా, ఎ.గాంధీ చాలా మందికి తెలుసుననుకుంటున్నాను. 77 ఏళ్ళ వయసులో, కంటిచూపు సమస్య తీవ్రంగా ఉన్నా, ఎంతో శ్రమపడి, గాంధీ ఈ అనువాదాన్ని తీసుకొచ్చారు. ఈ పుస్తకంలో, మార్క్సు రాసిన మొట్టమొదటి వాక్యం: "మొదటి చూపుకి, పెట్టుబడిదారీ సమాజ సంపద అపారమైన సరుకుల పోగులా కనిపిస్తుంది. ఆ సంపదని కొలిచే యూనిట్ ఒక సరుకు." పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రం మీద మార్క్సు చేసిన పరిశోధన అంతా ఈ సరుకు గురించీ, డబ్బు గురించీ మొదలవుతుంది. మార్క్సు ఈ పుస్తకంలో, క్రీస్తు పూర్వం నాటి అరిస్టాటిల్ నించీ మొదలు పెట్టి, తన కంటే కొద్దికాలం ముందు వరకూ ఉండిన ఆర్థిక శాస్త్రవేత్తల రచనలను, అనేక డజన్ల రచనలను, విమర్శనాత్మకంగా పరిశీలించాడు. ఈ పుస్తకంలో ప్రధానమైన విషయాల్ని చాలా క్లుప్తంగా ఇలా చెప్పవచ్చు. (1) సరుకుకి రెండు లక్షణాలుంటాయి. ఒకటి-- ఉపయోగపు విలువ; ఇంకోటి మారకం విలువ. ప్రతీ సరుకు ఏదో ఒక ఉపయోగాన్ని ఇస్తుంది. అది దాని ఉపయోగపు విలువ. ప్రతీ సరుకూ ఇంకో సరుకుతో మారుతుంది. ఒక సరుకుని ఇచ్చి ఇంకో సరుకుని తీసుకోగలం. దానికి కారణం, ప్రతీ సరుకులోనూ ఉండే మారకం విలువ. సరుకులు మారకం అవుతున్నాయంటే, వాటి మధ్య 'విలువ' అనే సమాన లక్షణం ఉందని అర్థం. (2) మారకం విలువ అంటే, ఒక సరుకు తయారు చేయడానికి పట్టిన శ్రమ కాలం. విలువ అంటే శ్రమే. (3) విలువకి ఉన్న జనరల్ రూపం 'డబ్బు'. ప్రపంచ ధనంగా ఉన్న బంగారం కూడా ఒక సరుకే. బంగారాన్ని తయారు చెయ్యడానికి పట్టే శ్రమ కాలమే దాని మారకం విలువ. (4) మార్క్సు పూర్వపు ఆర్థికవేత్తల పొరపాటు దృష్టిలో, వస్తువులకు, వాటి శరీర ధర్మాలు ఎలా ఉంటాయో, 'విలువ' కూడా అంతే సహజంగా ఉంటుంది. అరిస్టాటిల్ వంటి మేధావి కూడా, రెండు వస్తువుల మధ్య 'విలువ' అనే సమాన లక్షణం ఉండబట్టే, అవి మారకం అవుతాయని అస్పష్టంగానైనా గ్రహించాడు గానీ, విలువ అంటే, 'శ్రమే' అనే విషయాన్ని సరిగా అర్థం చేసుకోలేకపోయాడు. (5) మారకాలలోకి వెళ్ళని వస్తువులు కూడా శ్రమలతో తయారైనప్పటికీ, విలువలు లేకుండా ఉంటాయి. ఎందుకంటే, ఆ వస్తువుల్ని తయారు చేసిన మనుషులు, వాటిని తామే ఉపయోగించుకుంటారు గానీ, ఇతరులతో మారకం చేసుకోరు. (6) డబ్బు అనేది, సరుకు విలువకి ఒక జనరల్ రూపం. అందుచేత, అది విలువ కొలతగా కూడా ఉంటుంది. దానికి వేరు వేరు దేశాలలో, వేరు వేరు పేర్లు ఉంటాయి. పేర్లు వేరైనా, దేశాల మధ్య జరిగే సరుకుల మారకాల సంబంధాలన్నీ డబ్బు సంబంధాలే. (7) ఈ పుస్తకం లోనే ఒకచోట మార్క్సు అన్నట్టు: "ఒకరితో ఒకరికున్న ఈ (పెట్టుబడిదారీ) ప్రపంచ జీవుల సంబంధాలు, మౌలికంగా సరుకు యజమానుల మధ్య ఉండే సంబంధాలే తప్ప వేరు కావు. సరుకులు మత, రాజకీయ, జాతీయ, భాషాపరమైన అడ్డంకుల్ని పట్టించుకోవు. ధరే వాటి సార్వత్రిక భాష. డబ్బే వాటి బంధం....(సరుకుల యజమానుల ప్రకారం) ఈ యావత్తు ప్రపంచం కలిసిపోయేది, మార్కెట్టులోనే, అంటే, ప్రపంచ మార్కెట్టులోనే!" ఆర్థిక శాస్త్రానికి సంబంధించిన కొన్ని పదాల్నీ, ఇంగ్లీషులో ఉన్న పెద్ద పెద్ద వాక్యాల్నీ తెలుగులోకి తేలికైన పద్ధతిలో తేవడం చాలా కష్టమైన పని! కొత్త కోణంలో, ఆర్థిక విషయాల్ని చెప్పే ఈ పుస్తకాన్ని కొన్ని ఫుట్ నోట్లతో, వివరణలతో ఇచ్చివుంటే, ఎక్కువ మంది పాఠకులకు తేలికయ్యేది.

# జూలై 31, ఆగస్టు 1, 2 పీలేరు లో సీపీఐ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు విజయవంతం చేయాలి

**ఆగస్టు 6 నుంచి 15 వరకు ప్రజా సమస్యలపై జిల్లాలో పాదయాత్రలు విజయవంతం చేయాలి**

**ఎస్.ఐ.ఆర్‌కు మూడు నెలల గడువు పొడిగించాలి సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మహేష్**

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలి**



**పీలేరు జూలై 12 ప్రజా జ్యోతి** ప్రజా సమస్యల పరిష్కారం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతర పోరాటాలు కొనసాగిస్తుందని, జూలై 31, ఆగస్టు 1, 2 తేదీలలో పీలేరు లో జరుగుతున్న సీపీఐ నిర్వహించే జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు మరియు ప్రజా ఉద్యమాలను విజయవంతం చేయాలని సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మహేష్ పిలుపునిచ్చారు.ఆదివారం పీలేరు ఏఐటీయూసీ కార్యాలయంలో సీపీఐ పీలేరు నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం నర్సింహులు అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ జూలై 31, ఆగస్టు 1, 2 తేదీలలో పీలేరులో నిర్వహించే సీపీఐ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు పార్టీ కార్యకర్తలకు సిద్ధాంతపరమైన అవగాహన, ప్రజా ఉద్యమాల నిర్మాణానికి దిశానిర్దేశం చేసే ముఖ్యమైన వేదిక అని తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని కోరారు.ఆగస్టు 6 నుంచి 15వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా ప్రజా సమస్యలపై నిర్వహించే పాదయాత్రలను విజయవంతం చేయాలని, తాగునీరు, సాగునీరు, ఉపాధి, రహదారులు, విద్య, వైద్యం, రైతులు, కార్మికులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలని పిలుపునిచ్చారు.ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియకు కేవలం పరిమిత గడువు ఇవ్వడం వల్ల అనేక మంది అర్హులైన ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించే దిశగా ఎస్.ఐ.ఆర్‌కు కనీసం మూడు నెలల గడువు పొడిగించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, కార్మిక వ్యతిరేక చట్టాలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 1న నిర్వహించే "చలో ఢిల్లీ" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు, ప్రజలకు పిలుపునిచ్చారు. అన్నమయ్య జిల్లా అభివృద్ధిని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించిన మహేష్, జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న కడప--బెంగళూరు రైల్వే లైన్ పనులను వేగవంతం చేసి, వెంటనే పూర్తి చేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ రైల్వే మార్గం ఏర్పడితే రాయలసీమ ప్రాంత అభివృద్ధికి, ఉపాధి అవకాశాల పెరుగుదలకు, పారిశ్రామిక ప్రగతికి గణనీయమైన ఊతం లభిస్తుందని పేర్కొన్నారు.ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఐ ప్రధాన లక్ష్యమని, ప్రజలతో కలిసి ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని మహేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జనార్దన్, సాంబశివ, పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్ వెంకటేష్,సహాయ కార్యదర్శి నర్సింహులు ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యురాలు కవిత, యశోదమ్మ, బేబీ, దామోదర్, తరుణ్,వేళాయుదం, రఘునాథ్ రెడ్డి, మురళి, తదితరులు పాల్గొన్నారు

# గుటుపల్లె వక్ఫ్ భూముల సమస్య పరిష్కారానికి మాజీ మంత్రి బుగ్గన కృషి

**: వైఎస్సార్‌సీపీ నాయకులు**



**బేతంచెర్ల: జూలై 12,(ప్రజా జ్యోతి) బేతంచెర్ల:** గుటుపల్లె రెవెన్యూ పరిధిలోని భూములను వక్ఫ్ బోర్డు నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నిరంతరం కృషి చేశారని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు.2023లో గుటుపల్లె గ్రామానికి చెందిన భూములను వక్ఫ్ బోర్డు భూములుగా నమోదు చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు, బ్యాంకు రుణాలు నిలిచిపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారని తెలిపారు.రైతుల సమస్యను గుర్తించిన మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, 2023 నుంచి ఇటీవల హైకోర్టు తీర్పు వెలువడే వరకు అధికారులతో పలుమార్లు చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేశారని వెల్లడించారు.ఈ విషయాన్ని గుటుపల్లె మాజీ సర్పంచ్ శ్రీరాములు, మాజీ ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల మాజీ డైరెక్టర్ బాబు రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పుసులూరు మురళీకృష్ణ, మండల కన్వీనర్ కుంచా తిరుమలేశ్వర రెడ్డి తెలిపారు. రైతుల హక్కుల పరిరక్షణ కోసం బుగ్గన చేసిన కృషిని గ్రామ ప్రజలు గుర్తుంచుకుంటారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రంగస్వామి, కే ఎన్ శ్రీనివాసులు, సి రమణ, బి గోపాల్, వైబి సోమశేఖర్, వైబి సూర్య ప్రకాష్, వై మధుమోహన్ రెడ్డి, సంజీవుడు, వెంకట శివుడు, బెల్లం చంద్రారెడ్డి, లింగారెడ్డి, బెల్లం రామచంద్రారెడ్డి, తిరుమలేశ్వర రెడ్డి, గొల్ల వారధి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దాపురం డిఎస్పీ కార్యాలయంలో జూన్ నెల నేరాలపై సమగ్ర సమీక్ష

--పెండింగ్ కేసులు త్వరగా పూర్తి చేయాలి..

--నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

--పెద్దాపురం డిఎస్పీ ఏబీజీ తిలక్ ఆదేశాలు



**కాకినాడ జిల్లా జూలై 12 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** పెద్దాపురం సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో ఆదివారం జూన్ నెల నేరాల సమీక్షా సమావేశాన్ని సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఏబీజీ తిలక్ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ పరిధిలో నమోదైన కేసులు, వాటి దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల స్థితిగతులపై సమగ్రంగా సమీక్షించారు. లాంగ్ పెండింగ్ కేసులను ప్రాధాన్యంగా తీసుకుని త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి ఫైనలైజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రేవ్ కేసుల్లో దర్యాప్తు పురోగతిపై ఆరా తీసిన ఆయన, నాన్-బెయిలబుల్ వారంట్ల అమలును వేగవంతం చేయాలని సూచించారు.ఫైర్ క్రాకర్స్ అక్రమ తయారీ, రవాణా, విక్రయాలపై కఠిన నిఘా ఉంచి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసులు, సోషల్ మీడియా కేసులు, ప్రాపర్టీ కేసుల పురోగతిని సమీక్షించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.దొంగతనాల నియంత్రణకు ఈ-బీట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, యూఐ ప్రాపర్టీ కేసుల ఛేదన కోసం ప్రత్యేక క్రైమ్ బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మిస్సింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు మహిళలు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.రౌడీషీటర్లు, అలవాటు నేరస్తులపై ఉక్కుపాదం మోపాలని, ఓవర్‌లోడ్ స్కూల్ ఆటోలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. పాఠశాలలు, కళాశాలల వద్ద ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ నివారణకు పెట్రోలింగ్ పెంచాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడంతో పాటు మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో పెద్దాపురం సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు చెన్నకేశవరావు,బి సూర్య అప్పారావు, బి తిరుపతిరావు, ఆళ్ల కృష్ణభగవాన్ వై ఆర్ కె. శ్రీనివాస్, ప్రత్తిపాడు, కిర్లంపూడి, జగ్గంపేట ఏలేశ్వరం పెద్దాపురం, రౌతులపూడి ఎస్సైలు ఎస్ లక్ష్మీకాంతం, జి సతీష్ కుమార్, టి రఘునాధ రావు,ఎన్ రామలింగేశ్వరరావు, పాపారావు, వెంకటేశ్వరరావు, ఇన్వెస్టిగేషన్ వింగ్ అధికారులు, ఎస్‌డీపీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సీనియర్ పాత్రికేయులు ఆర్ రాంబాబు కు ఘన సన్మానం

**- ఎమ్మెల్యే గోండు శంకర్,ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం**



**శ్రీకాకుళం , ప్రజాజ్యోతి న్యూస్:** శ్రీకాకుళం పట్టణం లో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల ఫోరం జిల్లామహాసభల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఆమదాలవలస ఎమ్మెల్యే ,రాష్ట్ర పి.యూ.సి చైర్మెన్ కూన రవికుమార్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గోండు శంకర్, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష,ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వర రావు ,మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి,నర్తు నరేంద్ర ముఖ్య అతిథిధులుగా పాల్గొన్నారు. వీరికి ఏపీ.జె.ఎఫ్ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్యంలో పాత్రికేయుల పాత్రను ఎమ్మెల్యే లు కొనియాడారు. అనంతరం ఎన్నో ఏళ్లుగా పాత్రికేయ రంగంలో సేవలందిస్తున్న సీనియర్ పాత్రికేయులు రాయిపిల్లి రాంబాబు తో పాటు పలువురు సీనియర్ పాత్రికేయులను ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఎమ్మెల్యే గోండు శంకర్, ఏపి.జె.ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శాసపు జోగినాయుడు జిల్లా అధ్యక్షులు గజ్జి షణ్ముఖ రావు ,పలువురు ప్రజాప్రతినిధులు ఘనంగా శాలువాతో సత్కరించి మెమెంటోలను అందజేశారు.ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్ స్టేట్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ ఏపి.జె.ఎఫ్ వ్యవస్థాపకులు కృషాంజనేయులు ,జయం పత్రికా ఎడిటర్ కొరికాన వేణు స్టేట్ ప్రెసిడెంట్ శివ ప్రసాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషణ్ రావు ట్రెజరర్ శ్రీనివాస రావు ఉపాధ్యక్షులు యల్ర గౌతు సూర్యనారాయణ,ఏపీ.జె.ఎఫ్ జిల్లా నాయకులు ఐ న్యూస్ వాసు సీనియర్ ,యువ పాత్రికేయులు వివిధ పత్రికలు ఎలక్ట్రానిక్ డిజిటల్ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మొటిమంత బెంగ

**ముఖం మీద చిన్న మొటిమ కనిపిస్తే చాలు. గిల్లేంతవరకూ కొందరికి చేయి ఆగదు. గట్టిగా నలిపి పిండేసేంత వరకూ నిద్ర పట్టదు. నిజానికి మొటిమలు ఆరోగ్యానికేమీ హాని చేయవు. చాలావరకివి వాటంతటవే తగ్గుతాయి. మరీ ఎక్కువగా, పెద్దగా అయితే చూడటానికి కాస్త ఇబ్బంది కలిగిస్తాయంతే. కానీ కొందరు.. ముఖ్యంగా యుక్తవయసువారు చిన్న మొటిమ కనిపించినా పెద్ద సమస్యగా భావిస్తారు.**

### ఇది మొటిమల అవగాహన మాసం

ముఖం మీద చిన్న మొటిమ కనిపిస్తే చాలు. గిల్లేంతవరకూ కొందరికి చేయి ఆగదు. గట్టిగా నలిపి పిండేసేంత వరకూ నిద్ర పట్టదు. నిజానికి మొటిమలు ఆరోగ్యానికేమీ హాని చేయవు. చాలావరకివి వాటంతటవే తగ్గుతాయి. మరీ ఎక్కువగా, పెద్దగా అయితే చూడటానికి కాస్త ఇబ్బంది కలిగిస్తాయంతే. కానీ కొందరు.. ముఖ్యంగా యుక్తవయసువారు చిన్న మొటిమ కనిపించినా పెద్ద సమస్యగా భావిస్తారు. తెగ ఆందోళన పడిపోతుంటారు. మనో వేదనకూ గురవుతుంటారు. మొటిమల మీద లెక్కలేనన్ని అపోహలూ రాజ్యమేలుతుండటం, సరైన అవగాహన లేకపోవటమే దీనికి కారణం.

అప్పటివరకూ నునుపుగా ఉన్న ముఖం మీద ఏంటీ మొటిమలు? ఒకట్రెండు కాస్తా చూస్తుండగానే సంఖ్య పెరుగుతూ వస్తోందేంటి? అందానికి, ఆకర్షణకు అత్యంత ప్రాధాన్యమిచ్చే యుక్తవయసువారిలో ఇలాంటి ఆలోచనలే ముసురుకుంటుంటాయి. ఇంతకీ ఇవి ఎలా పుట్టుకొస్తాయి? ఆశ్చర్యంగా అనిపించినా చర్మం నిగనిగలాడుతూ కనిపించటానికి తోడ్పడే చమురు గ్రంథులే మొటిమలకు కారణం! శరీరం మీద చర్మం అంతటా సన్నటి వెంట్రుకలు, వాటి కుదుళ్లుంటాయి. ప్రతి కుదురులో వెంట్రుక మొదలు (ఫాలికల్), చమురు గ్రంథులు (సెబేషియస్ గ్లాండ్స్) ఉంటాయి. గ్రంథుల నుంచి ఉత్పత్తయ్యే చమురు సన్నటి రంధ్రాల ద్వారా బయటకు వస్తుంది. ముఖం, ఛాతీ, వీపు, భుజాలు, చేతుల మీద ఈ గ్రంథులు పెద్ద సంఖ్యలో ఉంటాయి. ఇవి వాచి, ఉబ్బి.. గుల్లల మాదిరిగా పైకి పొడుచుకు రావటమే మొటిమలకు మూలం. కొందరిలో జన్యుపరంగా టెస్టోస్టిరాన్ వంటి లైంగిక హార్మోన్లు గ్రంథులను ప్రేరేపితం చేయటం వల్ల మరింతగా చమురు ఉత్పత్తి అవుతుంది. మరోవైపు చర్మ రంధ్రాల్లో ప్రొపిని బ్యాక్టీరియం ఆక్నెస్ అనే బ్యాక్టీరియా చమురును కొవ్వు ఆమ్లాలుగా విడగొడుతుంటుంది. ఈ ఆమ్లాలు వెంట్రుక కుదురును ప్రేరేపించే క్రమంలో కెరటిన్ పదార్థం ఎక్కువగా ఉత్పత్తి అయ్యి, చర్మ రంధ్రాలు మూసుకుపోవచ్చు. దీంతో అక్కడ ఉబ్బుగా, గుల్ల మాదిరిగా ఏర్పడి.. మొటిమ తలెత్తుతుంది. ఇది క్రమంగా పెద్దగా అవుతూ రావొచ్చు. కొన్నిసార్లు చర్మ రంధ్ర మార్గం పగిలి, వాపు మొదలవ్వచ్చు. ఫలితంగా అక్కడ ఎర్రబడి, మొటిమ పొక్కులా పొడుచుకొస్తుంది. లోపల చీము చేరటం, చితకటం, గుంతలు పడటం.. అన్నీ దీని పర్యవసానాలే.

### నాలుగు రకాలు

సాధారణంగా మనం మొటిమలన్నింటినీ ఒకే గాటన కట్టేస్తుంటాం. కానీ తెలుపు లేదా నలుపు గుల్లలు (బ్లాక్‌హెడ్స్, వైట్‌హెడ్స్), చీము గుల్లలు (పశ్చులే), తిత్తులు (సిస్ట్స్).. ఇలా మొటిమలు రకరకాలుగా ఉంటాయి. తీవ్రతను బట్టి వీటిని నాలుగు రకాలుగా చెప్పుకోవచ్చు.

**గ్రేడ్ 1:** చాలా సన్నగా, చిన్నగా ఉండేవి (కొమెడోన్స్). వైట్‌హెడ్స్, బ్లాక్‌హెడ్స్ ఇలాంటివే.

**గ్రేడ్ 2:** బ్లాక్‌హెడ్స్ ఇన్‌ఫెక్షన్‌కు గురై, చీము పట్టడం (పశ్చు లర్).

**గ్రేడ్ 3:** గుల్లలు ఇన్‌ఫెక్షన్‌తో వాచి, గడ్డ మాదిరిగా అవటం (నాడ్యులర్).

**గ్రేడ్ 4:** గడ్డ మరీ పెద్దగా, లావుగా ఉబ్బటం (నాడ్యులోసిస్టిక్).

ఆడవారిలో ఎక్కువ

మగవారిలో కన్నా ఆడవారికి మొటిమలు ఎక్కువగా వచ్చే అవకాశముంది. ఎందుకంటే వీరిలో హార్మోన్ల వ్యత్యాసాలు ఎక్కువ. ఆడవారిలో అండాశయాల్లో నీటి తిత్తులు (పీసీఓఎడీ), నెలసరి సరిగా రాకపోవటం, థైరాయిడ్ పనితీరు దెబ్బతినటం, టెస్టోస్టిరాన్ హార్మోన్ మోతాదులు అస్తవ్యస్తం కావటం వంటివీ మొటిమలు ఎక్కువగా వచ్చేలా చేయొచ్చు.

ఏ వయసులోనైనా..

మొటిమలు యుక్తవయసులోనే వస్తుంటాయని, ఆ తర్వాత వాటంతటవే పోతాయని చాలామంది భావిస్తుంటారు. నిజానికి వీటికి ఒక వయసంటూ లేదు. శిశువుల దగ్గరి నుంచి వృద్ధుల వరకూ ఎవరికైనా రావొచ్చు. కానీ సగటున 10-25 ఏళ్ల వయసులో ఎక్కువగా చూస్తుంటాం. అలాగని అక్కడితోనే ఆగిపోతాయని కచ్చితంగా చెప్పలేం. కొందరికి 20ల్లో, 30ల్లో, 40ల్లోనూ రావొచ్చు. కొందరు మహిళలకు యుక్తవయసులో కొద్దిగానే మొటిమలు వచ్చినా పెద్దయ్యాక తీవ్రంగానూ వేధించొచ్చు.



### ముఖం మీదే కాదు..

మొటిమలు చాలావరకూ.. 99% ముఖం మీదే వస్తుంటాయి. నుదురు, బుగ్గలు, ముక్కు మీద ఇవి కనిపిస్తుంటాయి. చమురు గ్రంథులు లేకపోవటం వల్ల పెదవులు, పెదవుల పైభాగంలో మాత్రం రావు. కొందరికి ముఖం మీదే కాదు.. ఛాతీ, వీపు, చేతుల మీద కూడా రావొచ్చు.

### గిల్లితే తగ్గవు

మొటిమలను గిల్లి, నొక్కి పిండితే త్వరగా తగ్గుతాయని కొందరు అనుకుంటుంటారు. ఇది నిజం కాదు. గిల్లితే మొటిమలు మరింత స్పష్టంగా కనిపిస్తాయి. శాశ్వతంగా మచ్చలు పడొచ్చు. ఇన్‌ఫెక్షన్ మరింత లోతుకు చొచ్చుకెళ్లి ముఖం మీద గుంతలు పడే ప్రమాదముంది. ఒకసారి గుంత పడితే పూర్తిగా మామూలు స్థాయికి తీసుకొచ్చే చికిత్సలేవీ లేవు. కాకపోతే గుంతల లోతును తగ్గించి, అంతగా కనిపించకుండా చేయొచ్చు.

### గట్టిగా రుద్ది కడిగితే పోవు

ముఖాన్ని గట్టిగా, రుద్ది కడిగితే మొటిమలు పోతాయనుకోవటం అపోహ. దీంతో మొటిమలు తగ్గటం అటుంచి, మరింత ఎక్కువవుతాయి. ఇన్‌ఫెక్షన్ లోపలికి వెళ్లిపోయి, గుంతలు పడే అవకాశముంది. గట్టిగా రుద్దటం కన్నా రోజుకు రెండు సార్లు మృదువగా తేలికైన, పరిమళం లేని క్లీన్సర్‌తో ముఖాన్ని కడుక్కోవటం మంచిది. వేలి చివర్లతో క్లీన్సర్‌ను ముఖానికి రాసుకోవాలి. అనంతరం గోరువెచ్చటి నీటితో కడుక్కోవాలి.

కొందరు చర్మం రంధ్రాలు విప్పారతాయనే భావనతో ఆవిరి స్నానాలు చేస్తుంటారు. కానీ వీటితో మొటిమలు మరింత ఎక్కువవుతాయి.

### ఆహారంతో పరోక్ష సంబంధం

రాత్రిపూట జంక్‌ఫుడ్ తిన్నా.. ఎక్కువ కేలరీల ఆహారం తిన్నా మొటిమలు ఎక్కువగా పుట్టుకురావొచ్చు. ఎందుకంటే శరీరం వాడుకోకుండా మిగిలిన కేలరీలు ఒంట్లో కొవ్వుగా మారతాయి. వీటి నుంచి టెస్టోస్టిరాన్ వంటి లైంగిక హార్మోన్లు పుట్టుకొచ్చి మొటిమలను ప్రేరేపిస్తాయి. అందువల్ల సాయంత్రం ఆరు గంటల తర్వాత జంక్‌ఫుడ్, పెద్దమొత్తంలో పిండి పదార్థాలు.. పాల పదార్థాలు (పెరుగు మినహాయించి) తీసుకోవటం మానెయ్యాలి. స్వీట్లు, చాక్లెట్లు, కొవ్వు పదార్థాల వంటివి తగ్గించుకోవాలి.

ఆరోగ్యకరమైన ఆహారంతో మొటిమల తీవ్రతను తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా విటమిన్ ఏతో కూడిన పాలు (పగటిపూట), క్యారెట్, క్యాబేజీ, చిలగడ దుంపలు.. ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు గల చేపలు, అక్రోట్లు.. జింక్‌తో కూడిన పదార్థాలు మొటిమలు ఉద్ధృతం కాకుండా కాపాడతాయి.

### పౌడర్ కారణం కాదు

కొందరు ముఖానికి పౌడర్ రాసుకుంటే చర్మ రంధ్రాలు మూసుకుపోయి మొటిమలు వస్తాయని భావిస్తుంటారు. ఇది అపోహే. కాకపోతే గాఢమైన కెమికల్ పీల్స్‌తో చమురు గ్రంథులు ఇంకాస్త పెద్దగా అవ్వచ్చు. ఫలితంగా మొటిమలు ఉద్ధృతమవుతాయి. కొన్ని స్టెరాయిడ్ క్రీములతోనూ ఇవి ఎక్కువ కావొచ్చు. కాబట్టి కెమికల్ పీల్స్ వాడకపోవటం మంచిది. సన్‌స్క్రీన్, మాయిశ్చరైజర్లయినా సరే.. నాన్ కొమెడోజెనిక్ రకానికి చెందినవే ఉపయోగించాలి.

### ఒత్తిడికి దూరంగా

మానసిక ఒత్తిడి, ఆందోళనలు మొటిమలకు కారణం కాకపోయినా అప్పటికే ఉన్నవి ఉద్ధృతమయ్యే అవకాశముంది. కాబట్టి మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలి. ధ్యానం, ప్రాణాయామం చేయాలి.

### చికిత్స అవసరమా?

మొటిమలు ఆరోగ్యానికేమీ హాని కలిగించవు. కానీ వీటితో గుంతలు పడితే జీవితాంతం అలాగే ఉంటాయి. కాబట్టి చికిత్స తీసుకోవటం మంచిది. కొత్తగా మొటిమలు వస్తున్నా పెద్దగా ఆందోళన అవసరం లేదు. కానీ ఉన్నవి తగ్గకపోతుంటే మాత్రం చికిత్స అవసరం. అలాగే చీము పట్టటం, గడ్డలు ఏర్పడటం, ముఖమంతా నల్లటి మచ్చల్లా మారుతున్నా తాత్సారం చేయరాదు. చికిత్స ఉద్దేశం- మొటిమలు ఉద్ధృతం కాకుండా చూడటం.. తీవ్ర స్థాయి నుంచి స్వల్ప స్థాయికి తీసుకురావటం. సాధారణంగా ఒక వయసు వచ్చేసరికి మొటిమలు నియంత్రణలోకి వస్తాయి. అప్పటివరకూ డాక్టర్ పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటే గుంతలు, మచ్చలు పడకుండా చూసుకోవచ్చు.

### ఏంటీ చికిత్స

మామూలు వైట్, బ్లాక్‌హెడ్స్‌కు రెటినాల్ క్రీములు మేలు. ఇవి గడ్డకట్టిన కెరటిన్ విడిపోయేలా, చర్మ రంధ్రాలు తెరచుకునేలా చేస్తాయి.

చీము పడితే డాక్సీసైక్లిన్, అజిత్రోమైసిన్ వంటి యాంటీబయాటిక్స్ ఇవ్వాల్సి ఉంటుంది.

మరీ తీవ్ర మొటిమలకు రెటినాయిడ్, విటమిన్ ఏ మాత్రలు ఉపయోగపడతాయి. ఇవి చమురు ఉత్పత్తిని తగ్గించి, రంధ్రాలు తిరిగి తెరచుకునేలా చేస్తాయి. అయితే వీటిని 21 నుంచి 25 ఏళ్ల మధ్య వయసువారికే ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇప్పుడు డాక్టర్ సలహా తీసుకోకుండా తమకు తామే విటమిన్ ఏ మాత్రలను వేసుకోవటం ఎక్కువైంది. ఇది ప్రమాదకరం. యుక్తవయసులో ఇవి ఎదుగుదలను, చూపును దెబ్బతీయొచ్చు. సంతానం కోసం ప్రయత్నిస్తున్నవారు, గర్భిణులు, బాలింతలు వీటిని వాడటం మంచిది కాదు. కాబట్టి రక్త పరీక్ష చేయించుకొని, డాక్టర్ పర్యవేక్షణలోనే ఒక వయసు వచ్చేవరకూ వాడి, మానెయ్యాలి.

రెటినాల్ క్రీములు పడనివారికి శాల్సిలిక్ యాసిడ్ పీల్స్ మేలు చేస్తాయి.

మందులతో ఫలితం కనిపించవారికి, మందులు వాడటం కుదరనివారికి లేజర్ చికిత్సతో ఫలితం కనిపిస్తుంది. చికిత్సలతో రాత్రికి రాత్రే మొటిమలు తగ్గుతాయని అనుకోవద్దు. ఇవి పని చేయటానికి 4-8 వారాలు పడుతుంది.

### మచ్చలు, గుంతలు పడితే?

మొటిమలతో మచ్చలు, గుంతలు పడితే చర్మం రకం, వయసు, జీవనశైలి, మచ్చల రకాన్ని బట్టి డెర్మారోలర్, కెమికల్ పీల్, మైక్రోనీడ్లింగ్ రేడియో ఫ్రీక్వెన్సీ, ఫ్రాక్షనల్ సీవో2 లేజర్, ఎర్బియం యాగ్ లేజర్.. వీటిల్లో ఏదో ఒకదాంతో చికిత్స చేయొచ్చు. లేజర్లు చర్మం కిందుండే కొలాజెన్‌ను దెబ్బతీస్తాయి. తర్వాత అక్కడ కొత్త కొలాజెన్ ఏర్పడుతుంది. ఈ క్రమంలో మచ్చలు, గుంతలు తగ్గుతాయి. అయితే గుంతలు పూర్తిగా పోవని గుర్తించాలి. 60-70% మాత్రమే పూడతాయి. గుంతలు ముఖానికి ఇబ్బంది కలిగించటం లేదని అనుకునేంతవరకూ చికిత్స తీసుకోవచ్చు.



## గురకకు మాత్ర

జ్వరం మాత్ర మాదిరిగా గురకకూ ఓ మాత్ర ఉంటే బాగుంటుంది కదా. నిద్రలో కాసేపు శ్వాసకు ఆటంకం కలిగించే స్లీప్ అప్నియాతో బాధపడే చాలామంది ఇలాగే అనుకుంటారు. రోజూ ముఖానికి సీప్యాప్ పరికరం ధరించటం తప్పుతుంది మరి. నిజంగా పరిశోధకులు అలాంటి మాత్రే రూపొందించారు. దీని పేరు ఏడీ109. ఆరాక్సీబ్యుటీనిన్, ఆటమోజెటిన్ అనే మందులను కలిపి తయారుచేసిన ఇది మంచి ఫలితం చూపిస్తున్నట్టు మూడో దశ ప్రయోగ పరీక్షలో బయటపడింది. దీన్ని వాడిన వారిలో అప్నియా తీవ్రత 44% వరకు తగ్గినట్టు తేలింది. సుమారు 42% మందిలో తీవ్ర సమస్య కాస్తా ఒక మాదిరి సమస్యగా మారింది కూడా. దాదాపు 18% మందిలో గురక లక్షణాలేవీ కనిపించకపోవటం గమనార్హం.

## గుండెకు బెండ అండ



బెండకాయ అనగానే జిగురుగా ఉంటుందని చాలామంది వద్దంటుంటారు. నిజానికి దీనిలో గుండె ఆరోగ్యానికి, గ్లూకోజు తగ్గటానికి, జీర్ణక్రియ సజావుగా సాగటానికి తోడ్పడే పోషకాలెన్నో ఉంటాయి. ఇందులో కొలెస్ట్రాల్ అసలే ఉండదు. అరకప్పు ఉడికించిన బెండకాయలో 6 గ్రా. పిండి పదార్థాలు, 6 కేలరీలు, 2 గ్రా. పీచు, 5 గ్రా. ప్రొటీన్, 8 మి.గ్రా. సోడియం, 8 మైక్రో గ్రా. ఫోలేట్, 32 మైక్రో గ్రా. విటమిన్ కె, 6 మి.గ్రా. క్యాల్షియం, 8 మి.గ్రా. మెగ్నీషియం, 13 మి.గ్రా. విటమిన్ సి, 2 మి.గ్రా. మ్యాంగనీసు ఉంటాయి. రోజూ బెండకాయ తినేవారిలో ట్రైగ్లిజరైడ్లు, మొత్తం కొలెస్ట్రాల్, ఎల్‌డీఎల్ (చెడ్డ కొవ్వు), రక్తంలో గ్లూకోజు మోతాదులు తక్కువగా ఉంటున్నట్టు 9 ప్రయోగ పరీక్షల సమీక్ష చెబుతోంది. అంతేకాదు, హెచ్‌డీఎల్ (మంచి కొవ్వు) గణనీయంగా పెరుగుతుండటం విశేషం. ఇవన్నీ గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచేవే. బెండకాయలోని వృక్ష రసాయనాలు విశృంఖల కణాల (ఫ్రీ రాడికల్స్) ఉద్ధృతి తగ్గటానికి తోడ్పడతాయి. ఇలా వాపు ప్రక్రియను అదుపులో పెట్టి, క్యాన్సర్ల ముప్పు తగ్గటానికి దోహదం చేస్తాయి. అలాగే రక్తపోటునూ అదుపులో పెడతాయి. బెండలోని పీచు పదార్థం చక్కెర, పిండి పదార్థాలను త్వరగా జీర్ణం కాకుండా అడ్డుకోవటం ద్వారా రక్తంలో గ్లూకోజు మోతాదులు నియంత్రణలో ఉండేలా చూస్తుంది.

ఇందులో జిగురు ద్రవంలాంటి పెక్టిన్ అనే పీచు దండిగా ఉంటుంది. ఇది పేగుల్లో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందటానికి తోడ్పడుతుంది. అందువల్ల మలబద్ధకం గలవారికి మేలు చేస్తుంది. పెద్ద పేగు క్యాన్సర్ ముప్పునూ తగ్గిస్తుంది.

## సిగరెట్లు అప్పుడప్పుడు కాల్చినా తీవ్ర జబ్బుల ముప్పు



సిగరెట్లు రోజూ, చాలా ఏళ్లుగా తాగితేనే ఆరోగ్యానికి హానికరమని చాలామంది భావిస్తుంటారు. వారాంతాల్లోనో, వేడుకల్లోనో, ఒత్తిడికి గురైనప్పుడో ఒకటీ అరా కాల్చితే పెద్దగా ఇబ్బందేమీ ఉండదని అనుకుంటుంటారు. కానీ ఇలా అప్పుడప్పుడూ సిగరెట్లు కాల్చటమూ తీవ్ర జబ్బుల ముప్పు పెరగటానికి కారణమవుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. పొగాకులో క్యాన్సర్ కారకాలు, విషతుల్య పదార్థాల వంటి 7వేలకు పైగా రసాయనాలుంటాయి. రోజూ తాగేవారికీ, అప్పుడప్పుడూ కాల్చేవారికీ మధ్య మోతాదులో తేడా ఉండొచ్చు గానీ హాని కారకాల ప్రభావం విషయంలో శరీరం ఈ వ్యత్యాసాన్ని విడమరచుకోలేదు. ఒకటి అరా కాల్చినా కీలక అవయవాలు, వ్యవస్థల మీద ప్రభావం పడుతుంది. పొగాకు నుంచి వెలువడే పొగకు గుండె రక్తనాళాల వ్యవస్థ అతిగా స్పందిస్తుంది. పొగ తాగిన మరుక్షణంలోనే రక్తనాళాలు సంకోచిస్తాయి. గుండె వేగం, రక్తపోటు పెరుగుతాయి. పొగలోని కార్బన్‌మోనాక్సైడ్ మూలంగా రక్తంలో ప్రసారమయ్యే ఆక్సిజన్ స్థాయులు తగ్గుతాయి. దీంతో గుండె మరింత బలంగా పనిచేయాల్సి వస్తుంది. అసలే పొగ అలవాటులేని వారితో పోలిస్తే అప్పుడప్పుడు సిగరెట్లు తాగినవారికీ గుండె జబ్బు ముప్పు గణనీయంగా పొంచి ఉంటున్నట్టు పరిశోధనలు చెబుతున్నాయి. వీరికి గుండెపోటు ముప్పే కాదు.. పక్షవాతం, రక్తనాళాల లోపలి గోడ పొర దెబ్బతినటం, రక్తనాళాల్లో త్వరగా పూడికలు ఏర్పడటం, రక్తం గడ్డలు ఏర్పడటం వంటి ప్రమాదాలూ ఎక్కువే. లక్షణాలు బయటపడే సరికే లోపల జరగాల్సిన అనర్థం జరిగిపోతుంది. ఒక్క గుండె మాత్రమేనా? ఊపిరితిత్తులూ దెబ్బతింటాయి. క్యాన్సర్ల ముప్పూ పెరుగుతుంది. కాబట్టి సిగరెట్లు, చుట్టలు, బీడీల విషయంలో సురక్షితమైన మోతాదంటూ ఏదీ లేదని గుర్తుంచుకోవాలి.

# 175/175.. పవన్ సరికొత్త వ్యూహం!



జనసేన పార్టీని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలనే వ్యూహానికి పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పదును పెడుతున్నారు. ఇందులో భాగంగా పార్టీని పోలింగు బూతు స్థాయిలో బలపేతం చేయాలనే నిర్ణయానికి వచ్చారని అంటున్నారు. 2014లో పార్టీ ప్రారంభించిన నుంచి జనసేనాని సెంట్రిక్ గానే పార్టీ కార్యకలాపాలు నడిచాయి. మధ్యలో కొందరు కార్యకర్తలు పార్టీలో చేరిన క్షేత్రస్థాయిలో పార్టీ విస్తరణపై ఇప్పటివరకు ఫోకస్ చేయలేదు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి ఆదరణ ఉన్నప్పటికీ పోలింగు బూతు స్థాయిలో ఓటర్లను సమన్వయం చేసే కేడర్ లేక జనసేన బలం కొంతవరకే పరిమితం అన్న అంచనాలు ఏర్పడ్డాయి. దీంతో పవన్ కీలక నిర్ణయం తీసుకున్నారు.

మరికొద్ది రోజుల్లో స్థానిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జనసేన పార్టీకి పోలింగు బూతు లెవల్ లో కమిటీలు వేయాలని పవన్ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేన ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల్లో వాటా పొందుతోంది. స్థానిక ఎన్నికల్లో కూడా జనసేనకు ప్రాతినిధ్యం పెరగాలని, క్షేత్రస్థాయి కార్యకర్తలకు స్థానికంగా గౌరవం దక్కాలంటే స్థానిక ఎన్నికల్లో గెలవడం అత్యావసరమని జనసేనాని భావిస్తున్నారని అంటున్నారు. దీంతో ఇటీవల పార్టీలో చేరికల కమిటీని నియమించడంతోపాటు పార్టీలో తొలి నుంచి కష్టపడిన కార్యకర్తలను గుర్తించేందుకు మరో కమిటీని నియమించారు.

ఈ విధంగా పార్టీని బలోపేతం చేయడానికి పవన్ దశలవారీగా చర్యలు తీసుకుంటుండటం రాజకీయంగా చర్చనీయాంశం అవుతోంది. జనసేన పార్టీ స్థాపించి ఇప్పటికి 12 ఏళ్లు అవుతోంది. ఈ పుష్కర కాలంలో పార్టీ విస్తరణపై పవన్ ఎప్పుడు ఇంతలా దృష్టి పెట్టలేదని అంటున్నారు. దీంతో వచ్చే మూడు నెలలో జనసేన పార్టీ భవిష్యత్తు కీలక మలుపు తీసుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకుంది. ఇంకా మరో మూడేళ్లు పదవీ కాలం ఉండటం, స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉండే అంచనాలు వ్యక్తమవుతుండటంతో జనసేనాని వ్యూహం సత్ఫలితాలు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

ఈ నేపథ్యంలో జనసేన కేడర్ లో జోష్ కనిపిస్తోంది. అదే సమయంలో ఇతర పార్టీల నుంచి పదవుల ఆశతో ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు జనసేనలో చేరే అవకాశం ఉందని అంటున్నారు. మొత్తంగా జనసేనాని వ్యూహానికి తగినట్లు పార్టీని రాష్ట్రంలో 175 నియోజకవర్గాలకు విస్తరించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. స్థానిక ఎన్నికల లోగా 175 నియోజకవర్గాల్లోనూ బూత్ కమిటీలు నియమించాలనే లక్ష్యంతో జనసేన నేతలు పావులు కదుపుతున్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లో ఈ బూతు కమిటీలే పార్టీకి కీలకంగా మారే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఈ పరిణామం ఒక విధంగా విపక్షంతోపాటు కూటమిలోని ప్రధాన పార్టీలు అప్రమత్తం అవ్వాల్సిన పరిస్థితులు సూచిస్తున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు.

# విశాఖలో భూప్రకంపనలు.. అతి చేస్తున్న మీడియా



ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున స్వల్ప భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. బంగాళాఖాతంలో సంభవించిన ఈ భూకంపం ప్రభావం విశాఖపట్నంతో పాటు కాకినాడ నుంచి విజయనగరం వరకు పలు ప్రాంతాల్లో స్వల్పంగా కనిపించింది. ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ రిపోర్ట్ ప్రకారం.., ఆదివారం తెల్లవారుజామున 5:05 గంటల సమయంలో రిక్టర్ స్కేలుపై 4.5 తీవ్రతతో ఈ భూకంపం సంభవించింది. కాకినాడ తీరానికి దాదాపు 225 కిలోమీటర్ల దూరంలో, సముద్ర గర్భంలో 10 కిలోమీటర్ల లోతున దీని కేంద్రం ఉన్నట్లు అధికారులు ధృవీకరించారు. ఈ భూప్రకంపనలు చాలా స్వల్పంగా ఉండటంతో ఎటువంటి ప్రాణనష్టం గానీ.. ఆస్తి నష్టం గానీ సంభవించలేదు. తెల్లవారుజామున 5 గంటల సమయం కావడంతో అత్యధిక శాతం మంది ప్రజలు గాఢ నిద్రలో ఉండటం వల్ల అసలు భూప్రకంపనలు వచ్చాయనే విషయమే చాలామందికి తెలియలేదు. మేల్కొని ఉన్న కొద్దిమంది మాత్రమే స్వల్పంగా భూమి కంపించినట్లు గుర్తించారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. భయపడాల్సిన పరిస్థితి అస్సలు లేదని అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి. అయినా ఈ చిన్న విషయాన్ని కొందరు సామాజిక మాధ్యమాల్లో, వార్తల్లో పెద్దదిగా చూపే ప్రయత్నం చేశారు. వాస్తవం ఇలా ఉంటే కొన్ని మీడియా సంస్థలు మాత్రం వ్యూస్, టీఆర్పీ రేటింగుల కోసం ఈ ఘటనపై తీవ్రంగా –అతి– చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. --వైజాగ్ లో భారీ భూకంపం-- అంటూ దారుణమైన, భయానకమైన హెడ్డింగులతో లైవ్ ప్రోగ్రామ్‌లు, తప్పుడు థంబ్‌నైల్స్ పెట్టి సోషల్ మీడియాలో, యూట్యూబ్ ఛానెళ్లలో హల్చల్ చేయడం స్థానిక ప్రజలకు అస్సలు నచ్చడం లేదు. వాస్తవ తీవ్రతను దాచిపెట్టి... కేవలం క్లిక్ బైట్స్– విజిబిలిటీ పెంచుకోవాలనే కొన్ని మీడియా ఛానెళ్ల మూర్ఖత్వాన్ని నెటిజన్లు, విశ్లేషకులు తప్పుపడుతున్నారు. ఇలా మీడియా అతి చేయడం విశాఖ విషయంలో ఇదే మొదటిసారి కాదు. ఇటీవల పరవాడ పరిసరాల్లోని ఫార్మా కంపెనీలలో జరిగిన కొన్ని చిన్నపాటి, చెదురుముదురు ప్రమాదాలపైనా కొన్ని మీడియా సంస్థలు ఇలాగే ఘోరమైన హెడ్డింగులు పెట్టి టీఆర్పీ గేమ్స్ ఆడటానికి ప్రయత్నించాయి. పరిశ్రమల్లో జరిగిన చిన్న సాంకేతిక లోపాలను కూడా నగరానికేదో ముప్పు ముంచుకొచ్చినట్లు కలరింగ్ ఇస్తూ వార్తలు ప్రసారం చేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఉన్నది ఉన్నట్టుగా చెప్పకుండా అబద్ధపు హైప్ క్రియేట్ చేయడం బాధ్యతారాహిత్యమే అవుతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి విపత్తులు లేదా ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రజలను అప్రమత్తం చేయడం, వారికి ధైర్యం చెప్పడం మీడియా ప్రాథమిక బాధ్యత. అంతేకాని చిన్నపాటి స్వల్ప ప్రకంపనలను కూడా భారీ భూకంపాలుగా చిత్రీకరించి సమాజంలో అనవసర భయాందోళనలు సృష్టించడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. తప్పుడు ప్రచారాలకు అడ్డుకట్ట వేస్తూ..బాధ్యతాయుతమైన జర్నలిజం వైపు మీడియా అడుగులు వేయాలని..రేటింగుల పిచ్చిని పక్కనపెట్టి వాస్తవాలను మాత్రమే ప్రజల ముందుంచాలని విశ్లేషకులు హితవు పలుకుతున్నారు.

**భూకంపంపై ప్రజా స్పందన :**

విశాఖపట్నం తీరంలో సంభవించిన స్వల్ప భూప్రకంపనలపై సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు భిన్నమైన అనుభవాలను, అభిప్రాయాలను షేర్ చేస్తున్నారు. విశాఖ నగరంలోని మద్దిలపాలెం, మధురవాడ, సీతమ్మధార, ఎన్ఏడి, కూర్మన్నపాలెం.. అలాగే విజయనగరం వంటి పరిసర ప్రాంతాల ప్రజలు తెల్లవారుజామున 5:00 నుండి 5:15 గంటల మధ్యలో తమకు ఎదురైన అనుభవాలను లైవ్ చాట్‌లో రాసుకొచ్చారు. కొందరు నిద్రలో ఉన్నప్పుడు వింత శబ్దాలు వచ్చాయని.. మరికొందరు బెడ్‌రూమ్‌లోని మంచం, అల్మారా

కొన్ని సెకన్ల పాటు కదిలాయని పేర్కొన్నారు. ఉదయాన్నే పూజ చేసుకుంటున్న సమయంలో లైట్‌గా షేక్ అవ్వడంతో మొదట భ్రమ అనుకున్నామని... కానీ మీడియా లైవ్ చూశాకే అది భూకంపమని తెలిసిందని కొందరు నెటిజన్లు ధృవీకరించారు. ఈ ప్రకంపనలపై కొందరు నెటిజన్లు ఆందోళన వ్యక్తం చేయగా.. మరికొందరు మాత్రం --ఇది చాలా స్వల్ప తీవ్రత కలిగింది..అంతా పిచ్చ లైట్, భయపడాల్సిన పనిలేదు-- అంటూ ధైర్యం చెప్పారు. ఇదే సమయంలో ఈ ప్రకృతి పరిణామాన్ని కొందరు దైవచింతనతో –పాపపుణ్యాలతో ముడిపెడుతూ కామెంట్లు చేయడం గమనార్హం. సమాజంలో పాపాలు పెరిగిపోవడం వల్లే భగవంతుడు ఇలాంటి హెచ్చరికలు ఇస్తున్నాడని... ఇప్పటికైనా మనుషులు మంచితనంతో నడుచుకోవాలని దైవభక్తితో కూడిన హితవులు పలికారు. మొత్తానికి మీడియా చూపిస్తున్న అతితో సంబంధం లేకుండా, నెటిజన్లు తమ స్వంత అనుభవాలను షేర్ చేయడంతో వాస్తవం ఏమిటో అవగతమవుతోంది.

## హర్మూజ్ మళ్లీ మూసివేత.. ప్రపంచానికి చమురు సంక్షోభం.. అట్టుడుకుతున్న పశ్చిమాసియా!


పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. అమెరికా, ఇరాన్ మధ్య దశాబ్దాలుగా సాగుతున్న వైరం ఇప్పుడు క్లైమాక్స్‌కు చేరినట్లు కనిపిస్తోంది. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని మరోసారి మూసివేస్తున్నట్లు ఇరాన్ సంచలన ప్రకటన చేసింది. గల్ఫ్ రీజియన్‌లో అమెరికా సైనిక జోక్యం పూర్తిగా ముగిసేవరకు తమ అనుమతి లేకుండా ఏ ఒక్క నౌకను కూడా ఈ మార్గం గుండా వెళ్లనిచ్చేది లేదని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ తెగేసి చెప్పింది. ఇరాన్ తీసుకున్న ఈ దూకుడు నిర్ణయంతో అంతర్జాతీయంగా ఒక్కసారిగా ఆందోళన వ్యక్తమవుతోంది.

**ఉద్రిక్తతలకు కారణమైన నౌకపై కాల్పుల ఘటన**

ఇరాన్ ఈ అధికారిక ప్రకటన చేయడానికి కొద్ది గంటల ముందే గల్ఫ్ తీరంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. సైప్రస్ జెండాతో ప్రయాణిస్తున్న ఒక వాణిజ్య నౌక, తమ హెచ్చరికలను బేఖాతరు చేస్తూ అనధికారిక మార్గంలో ప్రయాణించిందని ఇరాన్ ఆరోపించింది. దీనిపై స్పందించిన ఇరాన్ బలగాలు సదరు నౌకపై కాల్పులు జరిపాయి. ఈ ఘోర దాడిలో నౌకలోని ఓ సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ధ్రువీకరించింది. ఈ ఘటనపై అమెరికా రక్షణ మంత్రి తీవ్రంగా స్పందించారు. ఇరాన్ అనాగరిక చర్యలను ఎంతమాత్రం సహించబోమని, దీనికి ఆ దేశం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

**అమెరికా మూడో విడత దాడులు.. 140 లక్ష్యాలు ధ్వంసం!**

రక్షణ మంత్రి హెచ్చరించిన కొద్ది సేపటికే అమెరికా రంగంలోకి దిగింది. ఇరాన్‌పై వరుసగా మూడో విడత భారీ వైమానిక దాడులను ప్రారంభించింది. ఈసారి అమెరికా సైన్యం ముఖ్యంగా హర్మూజ్ తీర ప్రాంతాలు, అలాగే ఇరాన్ వ్యూహాత్మక ప్రాంతమైన బుషెహర్



ప్రావిన్స్‌ను టార్గెట్ చేసింది. ఇరాన్‌కు చెందిన దాదాపు 140 సైనిక, వ్యూహాత్మక లక్ష్యాలను విజయవంతంగా ధ్వంసం చేసినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. అమెరికా వైమానిక దాడుల వల్ల తమ సైనిక స్థావరాలతో పాటు పలు కీలక మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఇరాన్ ప్రభుత్వ అధికారిక మీడియా అంగీకరించింది.

**అమెరికా బేస్‌లపై ఇరాన్ ప్రతీకార డ్రోన్ దాడులు**

అమెరికా దాడులకు ఇరాన్ కూడా అంతే దీటుగా బదులిచ్చింది. గల్ఫ్ దేశాలలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. కువైట్, బహ్రెయిన్, ఖతార్‌లలోని అమెరికా మిలిటరీ క్యాంపులను తాము విజయవంతంగా లక్ష్యంగా చేసుకున్నట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది. ముఖ్యంగా ఖతార్‌లోని అతిపెద్ద అమెరికా సైనిక స్థావరం 'అల్ ఉదైద్ ఎయిర్ బేస్' లోని కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థను తాము నాశనం చేశామని ఇరాన్ ప్రకటించింది. దీనితో పాటు జోర్డాన్‌లోని ప్రిన్స్ హసన్ ఎయిర్ బేస్‌పైన కూడా దాడులు చేసినట్లు పేర్కొంది. అయితే ఈ దాడుల తీవ్రతపై అమెరికా గానీ, ఖతార్ గానీ ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

**భారత్‌కు పెరగనున్న ముప్పు?**

ఇరాన్ కేవలం సైనిక స్థావరాలనే కాకుండా, ఒమన్‌లోని వ్యూహాత్మక దుఖ్మ్ ఓడరేవు పై కూడా దాడులు జరిపినట్లు ప్రకటించడం ప్రపంచ దేశాలను కలవరపెడుతోంది. ఈ పోర్టు భారత్ సహా ఆసియాలోని అనేక దేశాలకు చమురు సరఫరా చేయడంలో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తోంది. ఇక్కడ ఉద్రిక్తతలు పెరిగితే భారత్‌కు ఇంధన సరఫరా కష్టతరంగా మారే ప్రమాదం ఉంది.

**గ్లోబల్ ఎకానమీపై ప్రభావం ఎంత?**

ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే ముడి చమురులో దాదాపు ఐదో వంతు 20% కేవలం ఈ హర్మూజ్ జలసంధి గుండానే రవాణా అవుతుంది. ఒకవేళ ఇరాన్ గనుక ఈ మార్గాన్ని దీర్ఘకాలం పాటు మూసివేస్తే అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు రికార్డు స్థాయికి చేరతాయి. షిప్పింగ్ కంపెనీలకు రవాణా వ్యయం, ఇన్సూరెన్స్ ప్రీమియంలు భారీగా పెరుగుతాయి. ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరిగి, ఆర్థిక మాంద్యానికి దారితీసే ప్రమాదం ఉంది. ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న ఈ యుద్ధ వాతావరణం కేవలం ఆ ప్రాంతానికే పరిమితం కాకుండా.. ప్రపంచ రాజకీయ, ఆర్థిక వ్యవస్థలను ఏ తీరానికి చేరుస్తుందోనన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# ఇరాన్ సీక్రెట్ మిషన్ లీక్? ప్రపంచానికి డేంజర్ బెల్




మధ్యప్రాచ్యంలో గత కొంతకాలంగా కొనసాగుతున్న ఉద్రిక్తతలు ఇప్పుడు మరో కొత్త మలుపు తిరిగాయి. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల తర్వాత ఇరాన్ కాస్త వెనక్కి తగ్గినట్లు కనిపించినా.. తెరవెనుక మాత్రం సంచలన వ్యూహాలకు తెరలేపినట్లు తెలుస్తోంది. ఇరాన్ నిశ్శబ్దంగా తన సైనిక, అణు సంబంధిత మౌలిక సదుపాయాల పునరుద్ధరణ పనులను ప్రారంభించిందా? అనే ప్రశ్న ఇప్పుడు అంతర్జాతీయ సమాజంలో తీవ్ర చర్చకు దారితీస్తోంది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఉపగ్రహ చిత్రాలు ఇరాన్‌లోని కొన్ని అత్యంత రహస్య ప్రాంతాల్లో భారీగా పెరిగిన అనుమానాస్పద కదలికలను బట్టబయలు చేశాయి.

**పార్చిన్ మిలిటరీ కాంప్లెక్స్‌లో ఏం జరుగుతోంది?**

ఈ తాజా వివాదంలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న ప్రధాన ప్రాంతం పార్చిన్ మిలిటరీ కాంప్లెక్స్. గతంలో పశ్చిమ దేశాల నిఘా సంస్థలు ఈ ప్రాంతాన్ని ఇరాన్ అణ్వాయుధ పరిశోధనలకు కేంద్రంగా గుర్తించాయి. ఇటీవల జరిగిన దాడుల్లో ఇక్కడి కొన్ని విభాగాలు దెబ్బతిన్నాయి. అయితే తాజా శాటిలైట్ చిత్రాల ప్రకారం దెబ్బతిన్న సైనిక నిర్మాణాలను వేగంగా నిర్మాణం చేస్తున్నారు. భారీ యంత్రాలతో నేలను సమతలీకరిస్తూ కొత్త నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. మిలిటరీ కాంప్లెక్స్ పరిసరాల్లో రాత్రింబవళ్లు వాహనాల రాకపోకలు విపరీతంగా పెరిగాయి. ఈ పరిణామాలు చూస్తుంటే ఇరాన్ తన వ్యూహాత్మక సైనిక సదుపాయాలను తిరిగి పూర్వ స్థితికి తెచ్చేందుకు అత్యంత రహస్యంగా మిషన్ మోడ్‌లో పనిచేస్తోందనే అనుమానాలు బలపడుతున్నాయి.

**క్షిపణి స్థావరాలపై నిఘా వర్గాల కన్ను**

కేవలం పార్చిన్ మాత్రమే కాకుండా, తబ్రీజ్, కెర్మాన్‌షా సమీపంలోని కీలక క్షిపణి, వైమానిక స్థావరాల్లో కూడా పునరుద్ధరణ పనులు ముమ్మరంగా సాగుతున్నట్లు అంతర్జాతీయ నిఘా వర్గాలు గుర్తించాయి. ముఖ్యంగా భూగర్భ సైనిక స్థావరాల వద్ద భారీ కార్గో వాహనాల కదలికలు భద్రతా నిపుణులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇరాన్‌లోని ప్రధాన అణు కేంద్రాలైన నతాంజ్, ఫోర్డో, ఇస్ఫహాన్ ప్రాంతాల్లో ప్రస్తుతానికి పెద్దఎత్తున పునర్నిర్మాణ పనులు జరుగుతున్నట్లు ఎలాంటి స్పష్టమైన ఆధారాలు లభించలేదు. అయినప్పటికీ సైనిక స్థావరాల పునరుద్ధరణ వేగం పశ్చిమ దేశాల్లో కలవరం రేపుతోంది.

**అంతర్జాతీయ ఒప్పందాలకు తూట్లు?**

ఈ రహస్య కార్యకలాపాలు గతంలో అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన అణు అవగాహన ఒప్పంద నిబంధనలపై పెద్ద ప్రశ్న మార్క్‌ను ఉంచుతున్నాయి. ఇరాన్ తన అణు కార్యక్రమాలను కేవలం శాంతియుత అవసరాలకే పరిమితం చేయాలని, అణ్వాయుధాల తయారీ జోలికి వెళ్లకూడదనేది అంతర్జాతీయ నిబంధన. ఒకవేళ ఇరాన్ ఇప్పుడు గీత దాటి సైనిక బలాన్ని పెంచుకుంటే, అది ఒప్పంద ఉల్లంఘనే అవుతుందని పశ్చిమ దేశాలు గట్టిగా వాదిస్తున్నాయి.

**తదుపరి పరిణామాలు ఎలా ఉండబోతున్నాయి?**

ప్రస్తుతానికి ఈ ఆరోపణలపై ఇరాన్ ప్రభుత్వం ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. కానీ అమెరికా, యూరప్ దేశాల భద్రతా విశ్లేషకులు ఈ ఉపగ్రహ చిత్రాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. భవిష్యత్తులో ఈ రహస్య మిషన్‌కు సంబంధించి మరిన్ని పక్కా ఆధారాలు లభిస్తే.. ఇరాన్‌పై అంతర్జాతీయ సమాజం కొత్త ఆర్థిక ఆంక్షలు విధించే అవకాశం ఉంది. దౌత్యపరమైన ఒత్తిళ్లు పెంచి ఇరాన్‌ను ప్రపంచ దేశాల ముందు ఒంటరిని చేసే వ్యూహాన్ని రచిస్తున్నారు. ఒకవైపు శాంతి చర్చలు నడుస్తున్నట్లు కనిపిస్తున్నా, మరోవైపు భూగర్భంలో జరుగుతున్న సైనిక ఏర్పాట్లు మధ్యప్రాచ్యంలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. ఈ ఉపగ్రహ చిత్రాల వెనుక ఉన్న అసలు నిజాన్ని తేల్చడానికి ప్రపంచ దేశాలు ఇప్పుడు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.

# ఫిన్‌లాండ్‌లో హైదరాబాద్ విద్యార్థి మిస్సింగ్ కేసులో బిగ్ ట్విస్ట్..

ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన హైదరాబాద్ విద్యార్థి అదృశ్యం కేసు ఇప్పుడు సరికొత్త మలుపు తిరిగింది. ఫిన్‌లాండ్‌లో అనుమానాస్పద స్థితిలో కనిపించకుండా పోయిన వనస్థలిపురానికి చెందిన మణిదీప్‌రెడ్డి కేసులో అక్కడి పోలీసులు కీలక ప్రకటన చేశారు. అయితే పోలీసుల వాదనను మణిదీప్ కుటుంబ సభ్యులు పూర్తిగా తోసిపుచ్చుతున్నారు. తమ కుమారుడి అదృశ్యం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందంటూ వారు సంచలన ఆరోపణలు చేస్తున్నారు.

**అసలేం జరిగింది?**

హైదరాబాద్‌లోని వనస్థలిపురానికి చెందిన మణిదీప్‌రెడ్డి ఇంజినీరింగ్ ఉన్నత విద్యాభ్యాసం కోసం ఫిన్‌లాండ్ వెళ్లారు. అయితే ఈ ఏడాది మే 5న ఆయన అనుమానాస్పద పరిస్థితుల్లో అదృశ్యమయ్యారు. ఆ రోజు నుంచి మణిదీప్ ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, స్నేహితులు ఎంతగానో ప్రయత్నించినప్పటికీ ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో తాజాగా ఫిన్‌లాండ్ పోలీసుల నుండి మణిదీప్ తల్లిదండ్రులకు ఒక ఈమెయిల్ వచ్చింది. సముద్రతీరంలో ఒక మృతదేహం లభ్యమైందని, బయోమెట్రిక్ పరీక్షల ఆధారంగా అది మణిదీప్‌రెడ్డిదేనని పోలీసులు ఆ ఈమెయిల్‌లో పేర్కొన్నారు. ఆధారాలుగా మృతదేహం వద్ద దొరికిన కొన్ని వ్యక్తిగత కార్డుల ఫోటోలను కూడా జత చేశారు.

**65 రోజుల తర్వాత ఎలా దొరుకుతుంది? తల్లిదండ్రుల తీవ్ర అనుమానాలు**

ఫిన్‌లాండ్ పోలీసుల ఈ ప్రకటనను మణిదీప్ తండ్రి ముత్యంరెడ్డి తీవ్రంగా ఖండిస్తున్నారు. పోలీసుల ఇమెయిల్‌పై ఆయన స్పందిస్తూ పలు కీలక ప్రశ్నలను లేవనెత్తారు. మే 5న అదృశ్యమైన తమ కుమారుడి మృతదేహం, దాదాపు 65 రోజుల తర్వాత సముద్రతీరంలో ఎలా లభిస్తుందని ఆయన ప్రశ్నించారు. అంత కాలం నీటిలో ఉంటే మృతదేహం గుర్తుపట్టేలా ఎలా ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. ఫిన్‌లాండ్‌లోని చట్టాల ప్రకారం నిర్దిష్ట గడువులోగా కేసులను క్లోజ్ చేయాల్సి ఉంటుందని, ఆ నిబంధనల వల్లే పోలీసులు వేరే ఎవరిదో మృతదేహాన్ని తమ కుమారుడిదిగా చూపిస్తూ కేసును త్వరగా ముగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తమ కుమారుడి కోసం తాము స్వయంగా ఫిన్‌లాండ్ వెళ్దామనుకుంటే అక్కడి ప్రభుత్వం తమకు వీసా మంజూరు చేయలేదని ముత్యంరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఫిన్‌లాండ్‌కు చెందిన ఒక వ్యక్తిపై తమకు గట్టి అనుమానాలు ఉన్నాయని, ఆ విషయాన్ని పోలీసులకు చెప్పినా వారు సరిగ్గా దర్యాప్తు చేయలేదని స్పష్టం చేశారు.

**భారత ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి**

“మా అబ్బాయి ఆచూకీ కోసం ఇప్పటికే మేము భారతదేశంలో హైకోర్టును ఆశ్రయించి పిటిషన్ దాఖలు చేశాం. ఈ వ్యవహారంలో భారత ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలి. ఫిన్‌లాండ్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పూర్తి స్థాయి నిష్పక్షపాత దర్యాప్తు జరిగేలా చూడాలి” అని ముత్యంరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వేడుకున్నారు.

# హైబీపీ ఎంత ఉందో లెక్కించాలంటే ఒక్కసారి రీడింగ్ సరిపోదు.. మరి ఏం చేయాలి..?

రక్తపోటు (హైబీపీ) గుండె జబ్బులకు ప్రధాన ప్రమాద కారకాలలో ఒకటి. అయినప్పటికీ చాలామంది సంవత్సరానికి ఒకసారి ఆరోగ్య పరీక్ష చేయించుకునే సమయంలో మాత్రమే రక్తపోటును పరీక్షించుకుంటారు. అయితే ఒక్కసారి తీసిన బీపీ రీడింగ్‌పై మాత్రమే ఆధారపడటం సరైన నిర్ణయం కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రక్తపోటు అసలు స్థాయిని తెలుసుకోవాలంటే క్రమం తప్పకుండా కొలవడం అవసరమని సూచిస్తున్నారు. ఆసుపత్రి లేదా వైద్యుల క్లినిక్‌లో కొలిచే రక్తపోటు కొన్నిసార్లు వాస్తవ పరిస్థితిని ప్రతిబింబించదు. దీనికి ప్రధాన కారణం వైట్ కోట్ సిండ్రోమ్. కొంతమంది ఆసుపత్రి వాతావరణంలో ఆందోళన, భయం లేదా ఒత్తిడికి గురవుతారు. ఈ మానసిక ఒత్తిడి కారణంగా తాత్కాలికంగా రక్తపోటు పెరిగి, సాధారణం కంటే ఎక్కువ రీడింగ్ నమోదయ్యే అవకాశం ఉంటుంది.




### ఇలా చేయాలి..

ఈ కారణంగా సంవత్సరానికి ఒకసారి తీసిన ఒక్క రీడింగ్ ఆధారంగా ఆరోగ్య నిర్ణయాలు తీసుకోవడం కంటే, ఇంట్లోనే క్రమం తప్పకుండా రక్తపోటును పరీక్షించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. దీనివల్ల నిజమైన సగటు రక్తపోటు స్థాయిని తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీనికోసం 2-2-7 పద్ధతిని అనుసరించాలని సూచిస్తున్నారు. ఈ విధానంలో ఇంట్లో ఉపయోగించే ఆర్మ్ బ్లడ్ ప్రెజర్ మానిటర్‌తో ఉదయం, సాయంత్రం రోజుకు రెండుసార్లు రక్తపోటు కొలవాలి. ఇలా వరుసగా ఏడు రోజుల పాటు నమోదైన అన్ని రీడింగ్‌లను రాసి, వాటి సగటును లెక్కించాలి. ఈ సగటు విలువే వ్యక్తి వాస్తవ రక్తపోటు స్థాయిని మరింత కచ్చితంగా తెలియజేస్తుంది.

### అత్యంత సులభంగా నియంత్రించవచ్చు..

ప్రతి రీడింగ్‌ను తేదీ, సమయంతోపాటు నమోదు చేసుకోవడం వల్ల వైద్యుడికి కూడా సరైన సమాచారం అందుతుంది. అవసరమైతే చికిత్స లేదా మందుల విషయంలో మరింత సరైన నిర్ణయం తీసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. రక్తపోటుతో బాధపడుతున్న వారిలో చాలామందికి తమకు ఈ సమస్య ఉందనే విషయం కూడా తెలియదని నిపుణులు చెబుతున్నారు. హైబీపీ గుండె జబ్బులకు దారితీసే ప్రమాద కారకాలలో అత్యంత సులభంగా నియంత్రించగలిగే అంశమని పేర్కొంటున్నారు. అయితే దాన్ని నియంత్రించాలంటే ముందుగా దానిని గుర్తించడం అవసరం. అందుకే రక్తపోటును క్రమం తప్పకుండా కొలుస్తూ, స్థాయిలపై అవగాహన కలిగి ఉండడం దీర్ఘకాలిక గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

## ఏ వ్యాధులు ఉంటే ఏ ఆహారం ప్రమాదమో తెలుసా.. తెలియదంటే ఇప్పుడు తెలుసుకోండి..!




సంపూర్ణ ఆరోగ్యానికి సమతుల ఆహారం పునాది లాంటిదని అందరికీ తెలుసు. అయితే మనం తీసుకునే ప్రతి ఆహారం అందరిపైనా ఒకే రకమైన ప్రభావం చూపదు. కొన్ని రకాల అనారోగ్య సమస్యలు (Health Issues) ఉన్నప్పుడు ఆరోగ్యకరమైనవిగా భావించే ఆహారపదార్థాలు కూడా హాని కలిగించవచ్చు. వ్యాధిని బట్టి ఆహార నియమాలను జాగ్రత్తగా పాటించడం చికిత్సలో ఒక కీలకమైన భాగంగా వైద్యులు సూచిస్తున్నారు. సరైన ఆహారాన్ని ఎంచుకోవడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించుకోవచ్చు. మరి ఏ వ్యాధులు ఉంటే ఏ ఆహారాలు తీసుకోకూడదో ఇప్పుడు తెలుసుకుందాం.. మధుమేహం, అధిక రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులతో బాధపడేవారు చాలా అప్రమత్తంగా ఉండాలి. మధుమేహం ఉన్నవారు స్వీట్లు, చక్కెర పానీయాలు, మైదా ఉత్పత్తులకు దూరంగా ఉండాలి. అధిక గ్లైసెమిక్ ఇండెక్స్ కారణంగా ఇవి రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను వేగవంతంగా పెంచుతాయి. అధిక రక్తపోటు బాధితులు ఉప్పు, ప్యాకేజ్డ్ స్నాక్స్, ఊరగాయలు వంటి సోడియం అధికంగా ఉండే పదార్థాలను మానుకోవాలి. లేదంటే శరీరంలో నీరు నిల్వ ఉండి రక్తపోటు మరింత పెరిగే ప్రమాదం ఉంది. గుండె జబ్బులు ఉన్నవారు డీప్ ఫ్రైడ్ ఫుడ్స్, ప్రాసెస్ చేసిన మాంసం, బేకరీ పదార్థాలకు దూరంగా ఉండటం శ్రేయస్కరం. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను పెంచి, రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోవడానికి కారణమవుతాయి. ఇక కిడ్నీలో రాళ్ల సమస్య ఉన్నవారు పాలకూర, రాగులు, జీడిపప్పు, డార్క్ చాక్లెట్ వంటివి తినకపోవడమే మంచిది. వీటిలోని ఉండే ఆక్సలేట్లు కాల్షియంతో కలిసి రాళ్లు ఏర్పడే ప్రమాదాన్ని పెంచుతాయి. గౌట్ సమస్యతో బాధపడేవారు రెడ్ మీట్, కొన్ని రకాల సముద్ర చేపలు, మద్యానికి దూరంగా ఉండాలి. వీటిలోని ప్యూరిన్లు శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని పెంచి కీళ్ల నొప్పులు, వాపులకు దారితీస్తాయి. ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారు చక్కెర పానీయాలు, జంక్ ఫుడ్, మద్యపానాన్ని పూర్తిగా మానుకోవాలి. ఇవి కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని ప్రోత్సహిస్తాయి. గ్యాస్ట్రిక్, యాసిడ్ రిఫ్లక్స్ ఉన్నవారు కారం, మసాలాలు, కాఫీ వంటివి తగ్గిస్తే ఉపశమనం లభిస్తుంది. హైపోథైరాయిడిజం సమస్య ఉన్నవారు గోయిట్రోజెన్లు ఉండే క్యాబేజీ, క్యాలీఫ్లవర్ వంటి ఆహారాలను వైద్యుల సలహా మేరకు పరిమితంగా తీసుకోవాలి. ఇవి థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తిపై ప్రభావం చూపవచ్చు. కాబట్టి ఆహారం విషయంలో మీ ఆరోగ్య పరిస్థితిని బట్టి ఏది తినాలో, ఏది తినకూడదో తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఏవైనా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతుంటే, వైద్యులు లేదా డైటీషియన్ సలహా మేరకు ఆహార ప్రణాళికను రూపొందించుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

## రోజూ మనం వాడే టూత్‌పేస్టులతో క్యాన్సర్ వస్తుందా.. నిపుణులు ఏం చెబుతున్నారు..?



దేశంలో క్యాన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రోజువారీగా ఉపయోగించే అనేక వస్తువులపై భయాలు, అపోహలు కూడా వేగంగా వ్యాపిస్తున్నాయి. అలాంటి వాటిలో టూత్‌పేస్ట్ కూడా ఒకటి. టూత్‌పేస్ట్‌లో ఉండే కొన్ని రసాయనాలు క్యాన్సర్‌కు కారణమవుతాయని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. టూత్‌పేస్ట్ క్యాన్సర్‌కు కారణమవుతుందనేది పూర్తిగా అపోహ మాత్రమేనని చెబుతున్నారు. ఈ అపోహకు కారణం ఒకేలా వినిపించే రెండు వేర్వేరు రసాయనాలను గందరగోళానికి గురి చేయడమేనని వివరిస్తున్నారు. చాలా టూత్‌పేస్ట్‌లలో సోడియం లారిల్ సల్ఫేట్ (Sodium Lauryl Sulphate -- SLS) అనే పదార్థం ఉంటుంది. ఇది టూత్‌పేస్ట్‌లో నురుగు ఏర్పడటానికి, దంతాలను శుభ్రం చేయడంలో సహాయపడుతుంది. అయితే కొందరు దీనిని సోడియం లారెత్ సల్ఫేట్ (Sodium Laureth Sulphate -- SLES)తో పొరపాటు పడుతున్నారని నిపుణులు చెబుతున్నారు. SLES తయారీ ప్రక్రియలో ఏర్పడే కొన్ని ఉప ఉత్పత్తులు విషపూరిత ప్రభావాలకు సంబంధించిన చర్చల్లో ఉంటాయి. ఈ రెండు రసాయనాల పేర్లు ఒకేలా ఉండటంతోనే టూత్‌పేస్ట్ క్యాన్సర్‌కు కారణమనే అపోహ వ్యాపించిందని అంటున్నారు.


### క్యాన్సర ప్రమాదం ఉంటుందా..

SLS వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అయితే కొంతమందిలో ఇది నోటి లోపలి పొరను స్వల్పంగా చికాకు పెట్టే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా తరచూ నోటి పుండ్లు రావడం, నోటి లోపలి చర్మం అత్యంత సున్నితంగా ఉండటం లేదా దంతాలను తోమేటప్పుడు మంటగా అనిపించడం వంటి సమస్యలు ఉన్నవారిలో ఈ ప్రభావం కనిపిస్తుంది. ఇలాంటి సమస్యలు ఎదురయ్యే వారు SLS లేని టూత్‌పేస్ట్‌ను ఉపయోగిస్తే అసౌకర్యం తగ్గే అవకాశం ఉంటుంది. అయితే ఇలాంటి సున్నితత్వం లేని వారిలో SLS సాధారణంగా సురక్షితంగానే ఉంటుంది.

### పరిశ్రమల్లో వినియోగించినా..

కొంతమంది నానా పరిశ్రమల్లో కూడా ఉపయోగించే రసాయనం కాబట్టి అది ప్రమాదకరమని భావిస్తుంటారు. అయితే ఒక పదార్థాన్ని పరిశ్రమల్లో ఉపయోగిస్తున్నారనే కారణంతోనే అది మన ఆరోగ్యానికి హానికరమని చెప్పలేమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మనం ప్రతిరోజూ ఉపయోగించే నీరు కూడా అనేక పరిశ్రమల్లో వినియోగిస్తారని, కాబట్టి ఒక పదార్థం పారిశ్రామిక వినియోగంలో ఉందనే ఒక్క కారణంతో దానిని విషపూరితమని భావించడం సరైన విధానం కాదని పేర్కొంటున్నారు. అలాగే ప్రతి టూత్‌పేస్ట్ అందరికీ ఒకేలా సరిపోదని నిపుణులు చెబుతున్నారు. దంతాలు, చిగుళ్ల సున్నితత్వం, నోటి ఆరోగ్య పరిస్థితులను బట్టి టూత్‌పేస్ట్‌ను ఎంపిక చేసుకోవడం మంచిదని, అవసరమైతే దంతవైద్యుడి సలహా తీసుకోవాలని సూచిస్తున్నారు.

## ప్రసవానంతరం మహిళలు ఎలాంటి ఆహారాలను తీసుకోవాలి.. ఏయే సమస్యలు ఉంటాయి..?



ప్రసవం తర్వాత మహిళ శరీరం పూర్తిగా కోలుకోవడానికి, అలాగే శిశువుకు తల్లిపాలు అందించడానికి సరైన పోషకాహారం అత్యంత కీలకం. గర్భధారణ సమయంలో పోషకాహారంపై ఎంత శ్రద్ధ అవసరమో, ప్రసవానంతరం కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ దశలో సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల శరీర పునరుద్ధరణ వేగవంతమవడంతోపాటు శక్తి పెరుగుతుంది, తల్లిపాల ఉత్పత్తికి కూడా మేలు జరుగుతుంది. ప్రసవం తర్వాత శరీరం తీవ్రమైన శారీరక ఒత్తిడిని ఎదుర్కొంటుంది. సాధారణ ప్రసవమైనా, సిజేరియన్ అయినా శరీరానికి కోలుకునే సమయం అవసరం. ఈ సమయంలో ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల కండరాల పునరుద్ధరణ, గాయాలు త్వరగా మానడం, శరీర కణజాలం మరమ్మత్తు కావడంలో సహాయపడుతుంది. గుడ్లు, పనీర్, పప్పులు, టోఫూ, చికెన్ వంటి ఆహారాలను రోజువారీ భోజనంలో చేర్చుకోవడం మంచిది.

### ఐరన్, క్యాల్షియం ఉండే ఆహారాలు..

ప్రసవ సమయంలో రక్తనష్టం జరగడం వల్ల ఐరన్ లోపం ఏర్పడే అవకాశం ఉంటుంది. అందుకే శరీరంలోని ఐరన్ నిల్వలను పునరుద్ధరించేందుకు పాలకూర, బీట్‌రూట్, బెల్లం, ఖర్జూరం, లీన్ మీట్ వంటి ఐరన్ సమృద్ధిగా ఉన్న ఆహారాలను తీసుకోవాలి. దీంతో రక్తహీనత ప్రమాదం కూడా తగ్గుతుంది. మంచి కొవ్వులు (హెల్తీ ఫ్యాట్స్) కూడా ప్రసవానంతర పోషకాహారంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. డ్రై ఫ్రూట్స్, గింజలు, విత్తనాలు వంటి ఆహారాల్లో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు శరీరానికి అవసరమైన శక్తిని అందించడమే కాకుండా హార్మోన్ల సమతుల్యతకు కూడా తోడ్పడతాయి. అలాగే ఎముకల ఆరోగ్యానికి పెరుగు, పాలు, నువ్వులు, రాగి వంటి కాల్షియం అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం మంచిది. ప్రసవం తర్వాత, ముఖ్యంగా తల్లిపాలు ఇస్తున్న మహిళలకు తగినంత నీరు తాగడం చాలా అవసరం. శరీరంలో ప్రతి కణం సక్రమంగా పనిచేయడానికి, జీర్ణక్రియ మెరుగుపడడానికి, తల్లిపాల ఉత్పత్తి సక్రమంగా సాగడానికి హైడ్రేషన్ కీలకం. రోజుకు సుమారు 2.5 నుంచి 3 లీటర్ల వరకు ద్రవాలు తీసుకోవాలి. సాధారణ నీటితోపాటు కొబ్బరి నీరు, మజ్జిగ, చికెన్ సూప్, పప్పు సూప్ వంటి పోషక విలువలు కలిగిన ద్రవాలను కూడా ఆహారంలో చేర్చుకోవచ్చు.

### తక్కువ మొత్తంలో ఎక్కువ సార్లు..

ప్రసవానంతరం రోజుకు మూడు పెద్ద భోజనాల కంటే తక్కువ మోతాదులో తరచూ ఆహారం తీసుకోవడం మంచిది. ఇలా చేయడం వల్ల శరీరానికి నిరంతరం శక్తి అందుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా తగ్గిపోవడాన్ని నివారించవచ్చు. దీంతో ప్రసవానంతర అలసట కూడా తగ్గే అవకాశం ఉంటుంది. ఈ సమయంలో ప్రాసెస్ చేసిన స్నాక్స్, శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు, అధిక కాఫీ, మద్యం వంటి వాటిని వీలైనంత వరకు తగ్గించాలి. వీటి బదులుగా తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, గింజలు వంటి ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం మంచిది. ఫైబర్ తక్కువగా తీసుకుంటే మలబద్ధకం సమస్య వచ్చే అవకాశం ఉంటుంది. సాంప్రదాయ ఆహారాల్లో అజ్వైన్ (వాము), మెంతులు, జీలకర్ర, గోండ్ వంటి పదార్థాలు కూడా ప్రసవానంతర కాలంలో ఉపయోగకరంగా ఉంటాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడంతోపాటు కడుపు ఉబ్బరం తగ్గించడంలో సహాయపడతాయి. గోండ్ లడ్డూలు, వాము నీరు, మెంతులతో చేసిన వంటకాలు ప్రసవం తర్వాత కోలుకునే ప్రక్రియకు తోడ్పడతాయి.

# డబ్బు గుంజేందుకే నా పరువు తీశారు: పంజాబ్ కింగ్స్ ప్లేయర్

## తప్పుడు ఎఫ్ఐఆర్‌తో తనను బ్లాక్‌మెయిల్ చేశారన్న శశాంక్ సింగ్

## డబ్బు గుంజడానికే పరువు తీసే కుట్ర జరిగిందని ఆరోపణ

## పనిలో పెట్టుకున్న వ్యక్తికి 9 కేసుల నేర చరిత్ర ఉందని వెల్లడి

## మా వాదన వినకుండానే కేసు నమోదు చేశారంటూ ఆవేదన




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ క్రికెటర్ శశాంక్ సింగ్ తనపై, తన కుటుంబంపై ఇటీవల నమోదైన కేసుపై తాజాగా స్పందించాడు. సెలబ్రిటీగా తనకున్న పేరును దెబ్బతీసి, డబ్బు గుంజేందుకే ఓ వ్యక్తి తప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని సంచలన ఆరోపణలు చేశాడు. తనపై దాడి జరిగిందంటూ ఓ వంట మనిషి పెట్టిన కేసు పూర్తిగా కట్టుకథ అని, ఇది పరువు తీసి డబ్బు రాబట్టేందుకు పన్నిన కుట్ర అని సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘ పోస్ట్ ద్వారా వివరించాడు.గత నెలలో భోపాల్‌లోని తమ నివాసంలో పనిచేసే వంట మనిషిపై దాడి చేసి, ఫోన్ లాక్కున్నారని శశాంక్ సింగ్, ఆయన తండ్రి, రిటైర్డ్ స్పెషల్ డీజీపీ శైలేష్ సింగ్‌పై రతిబాద్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలను శశాంక్ పూర్తిగా ఖండించాడు. "నిజానిజాలు తెలుసుకోకుండా వేలమంది నన్ను దూషించారు. ఒక నిరుపేదను కొట్టిన వ్యక్తిగా నన్ను చిత్రీకరించారు. ఈ ఘటన నన్ను మార్చేసింది, జీవితాంతం గుర్తుంచుకునే పాఠాలు నేర్పింది" అని ఆవేదన వ్యక్తం చేశాడు.తమ వద్ద పనికి చేరిన వ్యక్తి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండేదని, ఇంట్లో తిరుగుతూ ఫొటోలు తీసి ఇతరులకు పంపేవాడని శశాంక్ తెలిపాడు. దీంతో మూడో రోజే అతడిని పనిలో నుంచి పంపించేశామని, అప్పుడు అతను ఆరోగ్యంగానే వెళ్లాడని స్పష్టం చేశాడు. "ఆ తర్వాత అతడు తీవ్రంగా గాయపడినట్లు వీడియోలో చూసి మేం షాక్ అయ్యాం. పోలీసు రికార్డుల ప్రకారం అతనిపై అప్పటికే హత్యాయత్నం, గృహ చౌర్యం, దాడి, బెదిరింపులు, ఎస్సీ/ఎస్టీ చట్టం కింద కేసులు సహా మొత్తం 9 ఎఫ్ఐఆర్‌లు నమోదై ఉన్నాయి. తన గుర్తింపును దాచుకోవడానికి మూడు వేర్వేరు పేర్లు వాడుతున్నాడు" అని శశాంక్ వెల్లడించాడు.ఒక తప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ద్వారా తనపై ఒత్తిడి తెచ్చి, డబ్బు రాబట్టుకోవాలన్నదే అతని ప్రణాళిక అని తాను నమ్ముతున్నానని శశాంక్ పేర్కొన్నాడు. "సాధారణ బాధితులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికే ఇబ్బంది పడుతుంటే, మా వైపు వాదన వినకుండానే ఇంత వేగంగా కేసు ఎలా నమోదు చేశారని ఆశ్చర్యపోయాను" అని అన్నాడు. ఏప్రిల్ 30న కూడా తాను ఇలాంటి పనే చేశానని వస్తున్న వార్తలను కొట్టిపారేశాడు. ఆ రోజు తాను ఐపీఎల్ మ్యాచ్ ఆడుతున్నానని, కనీస నిజ నిర్ధారణ లేకుండా వార్తలు రాసి పరువు తీస్తున్నారని విమర్శించాడు.ఈ అనుభవంతో కొన్ని కఠినమైన పాఠాలు నేర్చుకున్నానని చెబుతూ, ప్రజలకు శశాంక్ ఒక ముఖ్యమైన సూచన చేశాడు. "ఇంట్లో పనిచేసే వారిని నియమించుకునే ముందు రిజిస్టర్డ్ ఏజెన్సీల ద్వారా, పూర్తి పోలీసు వెరిఫికేషన్ తర్వాతే తీసుకోవాలి. జాలి అనేది ఇంగితజ్ఞానాన్ని భర్తీ చేయకూడదు. సత్యానికి సమయం పట్టినా, చివరికి అదే గెలుస్తుంది" అని చెప్పుకొచ్చాడు.

# భారత జట్టులో భారీ మార్పులు.. గంభీర్ నమ్మిన బంటులపై వరుసగా వేటు?



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత జట్టు ఓటముల పరంపర కొనసాగుతున్న వేళ తెరవెనుక మరో పెద్ద సంక్షోభం స్టార్ట్ అయింది. ఐర్లాండ్ చేతిలో 2--0తో, ఇంగ్లాండ్ చేతిలో 4--0 తేడాతో టీ20 సిరీస్‌లను ఘోరంగా ఓడిపోవడంతో.. ఇండియా కోచింగ్ స్టాఫ్‌లో అనిశ్చితి నెలకొంది. జట్టు ప్రదర్శనపై బీసీసీఐ త్వరలోనే రివ్యూ మీటింగ్ నిర్వహించనుండగా, ఆలోపే హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు బిగ్ షాక్ తగిలింది. గంభీర్ కి ఎంతో నమ్మకంగా జట్టులోకి తీసుకున్న సపోర్ట్ స్టాఫ్?లోని ఇద్దరు తప్పుకోవాలని చూస్తున్నారు. ప్రస్తుత ఇంగ్లాండ్ టూర్ ముగిసిన వెంటనే అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డోస్కాట్, ఫాస్ట్ బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ భారత్‌ను వీడబోతున్నట్లు తెలుస్తుంది.

**భారత్‌ని వీడి ఐపీఎల్‌లోకి:**

గత 2024లో గౌతమ్ గంభీర్ భారత జట్టుకు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడు, ఈ ఇద్దరు కోచ్‌లు జట్టులో జాయిన్ అయ్యారు. ఇండియన్ బౌలింగ్, బ్యాటింగ్ విభాగాలను బలోపేతం చేయడం కోసం గంభీర్ స్వయంగా వీరిద్దరిని తుది జట్టులోకి తీసుకున్నాడు. కానీ, ర్యాన్ టెన్ డోస్కాట్ టీమిండియాతో కొనసాగడానికి అంతగా ఇంట్రెస్ట్ చూపించలేదు.. ఏడాది పాటు జట్టుతో కలిసి ప్రయాణించిన తనకు ఇబ్బందిగా మారిందని ఆయన బీసీసీఐకి తెలిపినట్లు టాక్. దీనికి తోడు ఆయన ఒక ప్రముఖ ఐపీఎల్ ఫ్రాంచైజీతో కోచింగ్ పదవి కోసం చర్చలు జరుపుతున్నట్లు వార్త కథనాలు నడుస్తున్నాయి. మరోవైపు బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ కూడా వన్డే సిరీస్ ముగిసిన తర్వాత తన భవిష్యత్తుపై తుది నిర్ణయం తీసుకునే ఛాన్స్ ఉంది.

**జింబాబ్వే టూర్‌కు గంభీర్ ఔట్:**

ఇంగ్లండ్ టూర్ ముగిసిన వెంటనే ఇండియన్ టీమ్ జూలై 2026 చివరి వారంలో జింబాబ్వే పర్యటనకు వెళ్లనుంది. అక్కడ జింబాబ్వేతో 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది. జూలై 23న మొదటి టీ20, జూలై 25న రెండో మ్యాచ్, జూలై 26న మూడో మ్యాచ్ జరగనున్నాయి. కానీ, ఈ జింబాబ్వే పర్యటనకు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ని బీసీసీఐ తప్పించింది. అతడికి రెస్ట్ ఇవ్వాలని బోర్డు భావిస్తోంది. గంభీర్ స్థానంలో నేషనల్ క్రికెట్ అకాడమీ చీఫ్ వీవీఎస్ లక్ష్మణ్ ఈ టూర్ కి తాత్కాలిక హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు.

**శ్రీలంక టూర్ కి కొత్త బౌలింగ్ కోచ్:**

ఒకవేళ మోర్నీ మోర్కెల్, ర్యాన్ టెన్ డోస్కాట్ ఇద్దరూ జట్టు నుంచి తప్పుకోవాలని ఫిక్స్ అయితే, బీసీసీఐ చాలా వేగంగా స్పందించాల్సి ఉంది. ఎందుకంటే ఆ వెంటనే శ్రీలంక పర్యటనకు టీమిండియా వెళ్లబోతుంది. ఆగస్టు 2026లో జరగబోయే ఈ శ్రీలంక టూర్ లో ఇండియా రెండు టెస్టుల సిరీస్ ఆడబోతుంది. ఆగస్టు 15వ తేదీన గాలే వేదికగా మొదటి టెస్ట్, ఆగస్టు 23 నుంచి 27 వరకు కొలంబో వేదికగా రెండో టెస్ట్ జరగనున్నాయి. మోర్కెల్ లేకపోతే, ప్రస్తుతం బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫాస్ట్ బౌలింగ్ కోచ్‌గా ఉన్న టీమిండియా మాజీ పేసర్ లక్ష్మీపతి బాలాజీని శ్రీలంక టూర్‌కు తాత్కాలిక బౌలింగ్ కోచ్‌గా పంపడానికి బీసీసీఐ యోచిస్తుంది.

**ఫీల్డింగ్ కోచ్ టీ.దిలీప్‌పైనా వేటు?**

భారత్ వరుస పరాజయాలతో కేవలం అసిస్టెంట్, బౌలింగ్ కోచ్‌లు మాత్రమే కాదు, ఫీల్డింగ్ కోచ్ దిలీప్ పోస్టుపై కూడా కత్తి వేలాడుతుంది. గత కొంతకాలంగా ఇండియన్ టీమ్ ఫీల్డింగ్ ప్రమాణాలు భారీగా పడిపోవడంతో.. బోర్డు ఆయనపై కూడా అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తుంది. మొత్తం మీద గంభీర్ కోచింగ్ టీమ్‌లోని సభ్యులు తప్పుకోవడానికి రెడీ కావడం, మరికొందరిపై బీసీసీఐ వేటు వేసేందుకు సిద్ధమైంది. రాబోయే రోజుల్లో టీమిండియా సపోర్ట్ స్టాఫ్ పూర్తిగా మారిపోయే ఛాన్స్ కనిపిస్తున్నాయి.

# 230 కోట్ల ఆస్తిపరుడైనా సాధారణ జీవితం!



నాభా నటేష్ 'గోల్డెన్ అవర్' గ్లామర్ - కెరీర్, అరంగేట్రం రాబోయే చిత్రాలు



కోలీవుడ్ అత్యంత ప్రతిభావంతులైన నటులలో ధనుష్ ఒకరు. నటుడిగా, గాయకుడిగా, గీత రచయితగా, దర్శకుడిగా , నిర్మాతగా పరిశ్రమలో తనదైన ముద్ర వేసారు. కెరీర్ ఆరంభం నుండి గ్లోబల్ స్టార్ స్థాయి వరకు ఆయన ఎదిగిన విధానం ఎంతో స్ఫూర్తిదాయకం. అంతేనా 230 కోట్ల రూపాయల ఆస్తిపరుడు. విలాసవంతమైన జీవనశైలి తో పాటు అత్యంత సంపన్న నటులలో ఒకరిగానూ నిలుస్తున్నారు. ధనుష్ ఆస్తుల విషయానికి వస్తే ఆయనకు చెన్నైలోని ప్రతిష్టాత్మకమైన పోయెస్ గార్డెన్‌లో 150 కోట్ల రూపాయల విలువైన బంగ్లా ప్రధానాకర్షణగా నిలుస్తుంది. అత్యంత భద్రత .. ఆధునిక సదుపాయాలతో కూడిన ఈ భవనం నగరంలోని అత్యంత ఖరీదైన నివాస ప్రాంతాల్లో ఒకటి. అంతే కాదు అళ్వార్‌పేట ప్రాంతంలో 18 కోట్ల రూపాయల విలువైన మరొక లగ్జరీ బంగ్లా కూడా ఉంది. రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు ఆయన ఆర్థిక భవిష్యత్తుపై ఉన్న దూరదృష్టిని తెలియజేస్తున్నాయి. వాహనాల విషయానికి వస్తే ధనుష్‌కు లగ్జరీ కార్లంటే ఎంతో ఇష్టం. సేకరణలో రోల్స్ రాయిస్ ఘోస్ట్, రోల్స్ రాయిస్ స్పెక్టర్ , బెంట్లీ కాంటినెంటల్ జిటి , ఫోర్డ్ ముస్టాంగ్ వంటి అత్యంత ఖరీదైన వేగవంతమైన వాహనాలున్నాయి. 7.5 కోట్ల రూపాయల విలువైన రోల్స్ రాయిస్ స్పెక్టర్ ఎలక్ట్రిక్ సెడాన్‌ను ఇటీవల కొనుగోలు చేసారు. ఆధునిక సాంకేతికత .. విలాసం పట్ల ఆసక్తిని చాటి చెబుతోంది. ధనుష్ ఒక్కో చిత్రానికి 20 నుంచి 35 కోట్ల రూపాయల వరకు పారితోషికం తీసుకుంటారు. బ్రాండ్ ఎండార్స్‌మెంట్ల ద్వారా కూడా భారీగా ఆర్జిస్తున్నారు. ప్రతి నెలా సుమారు 3 కోట్ల రూపాయల మేర ఆదాయాన్ని పొందుతుంటారని అంచనా. అంతర్జాతీయ చిత్రాల్లో నటించడం, సొంత నిర్మాణ సంస్థ వుండర్‌బార్ ఫిలిమ్స్ ద్వారా చిత్రాలను నిర్మించడం వంటివి ధనుష్ ఆర్థిక మూలాలను మరింత బలోపేతం చేస్తున్నాయి.అంతటి సంపద, విలాసాలు ఉన్నా? ధనుష్ వ్యక్తిగతంగా చాలా సాధారణంగా ఉంటుంది. బయటకు వెళ్లాలంటే పలానా బ్రాండ్ కారు ఉండాలని లేదు. ఆ సమయానికి ఏది అందుబాటులో ఉంటే అందులో వెళ్లిపోతారు. షూటింగ్ సమయంలో ఎలాంటి పరిస్థితులున్నా? సర్దుకుపోవడం ధనుష్ ప్రత్యేకతగా చెబుతున్నారు. అలాగే పనిపై చూపే నిబద్ధత ..క్రమశిక్షణే ధనుష్ ని ఈ స్థాయికి చేర్చాయి. దశాబ్దాలుగా సినీ పరిశ్రమలో కొనసాగుతున్నా? ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకుంటారు. ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా తనను తాను మలచుకోవడం ధనుష్ ప్రత్యేకత. ఆస్తులు ఎంతటివైనా? తన నటనతో ప్రపంచవ్యాప్తంగా అభిమానుల మనసుల్లో ఆయన సంపాదించుకున్న గుర్తింపు అన్నిటికంటే మిన్న. ఆర్థికంగా ఎంత ఎదిగినా? కళాత్మక విలువలను వదులుకోకుండా, నటుడిగా , దర్శకుడిగా కొత్త శిఖరాలను అధిరోహించడం ధనుష్ గొప్పతనం.



స్టైలిష్ ఫోటోషూట్ లుక్‌లో ఐశ్వర్య రాజేష్ ఆకర్షణీయ మైన రూపం

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,